VELTHURU TELUGU DAILY

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి, నల్గొండ : శనివారం 25.07.2026
సంపుటి : 09 సంచిక : 46 , పేజీలు : 12 , వెల:రూ . 5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRAPRADESH www.velthuru.com




## కేటీఆర్‌కు ధర్నా చేసే నైతిక హక్కు లేదు: పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

# జనావాసాల్లోనే క్యూర్ ఇందిరమ్మ ఇళ్లు

- దూర ప్రాంతాల్లో ఇళ్లు వద్దన్న సీఎం
- నిరుపయోగ భూముల గుర్తింపునకు ఆదేశం
- పనికి దగ్గరగా ఇళ్ల నిర్మాణంపై దృష్టి
- తొలి దశలో 17 నియోజకవర్గాల్లో 7,680 ఫ్లాట్లు
- ఒక్కో ఫ్లాట్‌కు రూ.5 లక్షల సబ్సిడీ
- ల్యాండ్ కాస్ట్‌ను భరించనున్న ప్రభుత్వం



**హైదరాబాద్, జూలై 24 (వెలుతురు):**

జనావాసాలకు దూరంగా కాకుండా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉండే ప్రాంతాల్లోనే క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన నిరుపయోగ స్థలాలను గుర్తించి, తొలి దశలో 17 నియోజకవర్గాల్లో 7,680 ఫ్లాట్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సూచించారు.శుక్రవారం క్యూర్ పరిధిలో చేపట్టనున్న ఇందిరమ్మ గృహాల నిర్మాణంపై ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. పోలీస్, రెవెన్యూ, రవాణా శాఖలకు చెందిన వినియోగంలో లేని భూములను గుర్తించి, అవస రమైతే ఆయా శాఖలకు ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించి గృహ నిర్మాణానికి వినియోగించాలని ఆదేశించారు.జనావా సాలకు దూరంగా ఇళ్లు నిర్మిస్తే లబ్ధిదారులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు దూరమవుతారని, ఫలితంగా ఆ ఇళ్లు నిరుప యోగంగా మారే ప్రమాదం ఉందని సీఎం అభిప్రాయ పడ్డారు. అందుకే పని ప్రదేశాలకు చేరువలో, ప్రజలు నివసిస్తున్న ప్రాంతాల్లోనే ఇందిరమ్మ గృహాలను నిర్మించాలని స్పష్టం చేశారు. దీనివల్ల నిరుపేదల జీవనో పాధికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని పేర్కొన్నారు.

▶ మిగతా 2లో

# ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటుకు దీటుగా నిలపాలి

- జెన్‌కో, సింగరేణిలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కీలక ఆదేశాలు!
- బొగ్గు ఉత్పత్తిలో ఒక్కరోజు ఆలస్యమైనా భారీ నష్టమే..
- అంతర్జాతీయ స్థాయి పోటీతత్వంతో మునుముందుకు సాగాలని స్పష్టీకరణ




**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 24 (వెలుతురు):**

రాష్ట్ర ప్రభుత్వ రంగానికి ఆత్మలాంటి సింగరేణి, జెన్‌కో సంస్థలు ప్రైవేటు రంగానికి దీటుగా అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు.

▶ మిగతా 2లో

# పేపర్ లీక్ దోషులకు 10 ఏళ్ల జైలు!

- రూ.10 కోట్ల జరిమానాకు కేంద్రం సిద్ధం
- చట్ట సవరణలకు క్యాబినెట్ ఆమోదం
- మూడు నెలల్లో కేసుల విచారణకు ప్రతిపాదనలు
- ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ఏర్పాటుకు బిల్లులో నిబంధనలు
- వచ్చే వారం లోక్‌సభలో బిల్లు ప్రవేశపెట్టే అవకాశం
- అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది




# పార్టీ మారడం లేదు కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లడం లేదు




- మాజీ మంత్రి మల్లారెడ్డి స్పష్టీకరణ
- రక్తంతో కార్యకర్త రాసిన లేఖ చూసి బాధపడ్డాను.
- బోయిన్‌పల్లిలో వైభవంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు
- బీఆర్‌ఎస్‌లోనే ఉంటానని కేడర్‌కు మల్లారెడ్డి భరోసా
- కాంగ్రెస్‌లో చేరుతారంటూ గత కొద్ది రోజులుగా ఊహాగానాలు
- రక్తంతో లేఖ రాసిన కార్యకర్తను కలుస్తానని స్పష్టత

**హైదరాబాద్ వెలుతురు జూలై 24:**

మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నారంటూ గత కొద్ది రోజులుగా తెలంగాణ రాజకీయాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. ఆయన ముఖ్యమంత్రిని, ఇతర కాంగ్రెస్ అగ్రనేతలను కలిశారని, త్వరలోనే హస్తం గూటికి చేరడం ఖాయమని వార్తలు గుప్పుమన్నాయి.

# జెన్ జీ.... కాంగ్రెస్, బీఆర్ఎస్ ను నిలదీయండి

- బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో అన్నీ పేపర్ లీకులే
- కాంగ్రెస్ రెండున్నరేళ్ల పాలనలో టెన్త్ తెలుగు, హిందీ పేపర్ లీక్
- మరి ఆనాడెందుకు రాజీనామా చేయలేదు?




# నీట్ సంస్కరణలపై అఫిడవిట్లు దాఖలు చేయండి

- కేంద్రం, ఎన్టీఏకు సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు
- పేపర్ లీక్ నిరోధక చర్యల వివరాలు ఇవ్వాలని సూచన
- ఆన్‌లైన్ పరీక్షకు చేపట్టిన ఏర్పాట్లపై ప్రశ్నలు
- సైబర్ భద్రతపై పూర్తి వివరాలు కోరిన ధర్మాసనం

**న్యూఢిల్లీ వెలుతురు జూలై 2026:**



నీట్ పరీక్షల్లో చోటుచేసుకున్న తప్పిదాలకు ఇకనైనా ముగింపు పలకాలని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. పేపర్ లీకలను అరికట్టేందుకు చేపట్టిన సంస్కరణలు, భవిష్యత్తులో నీట్ పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహిం చేందుకు చేసిన ఏర్పాట్లపై వివరణాత్మక అఫిడవిట్లు దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ)కి సూచించింది.నీట్ పేపర్ లీక్ వ్యవహారానికి సంబంధించిన పిటిషన్లపై విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ ఆదేశాలు జారీ చేసింది. పేపర్ లీకలను నివారించేందుకు తీసుకున్న చర్యలను న్యాయస్థానం సమీక్షిం చాలని భావిస్తున్నట్లు తెలిపింది. ఆన్‌లైన్ పరీక్ష నిర్వహణకు అవసరమైన సైబర్ భద్రత, డేటా రక్షణ చర్యలపై కూడా పూర్తి వివరాలు సమర్పిం చాలని కేంద్రాన్ని ఆదేశించింది.ఈ సందర్భంగా కేంద్రం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ.. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే పలు సంస్కరణలు చేపట్టిందన్నారు. వాటికి సంబంధించిన పూర్తి వివరాలను అఫిడవిట్ రూపంలో సమర్పిస్తామని, అందుకు కొంత గడువు ఇవ్వాలని కోర్టును కోరారు.దీనికి అంగీ కరించిన సుప్రీంకోర్టు కేసు తదుపరి విచారణను జులై 27కు వాయిదా వేసింది. అప్పటిలోగా కేంద్ర ప్రభుత్వం, ఎన్టీఏ సంస్కరణలకు సంబంధించిన అఫిడవిట్లు దాఖలు చేయాలని స్పష్టం చేసింది.

# రూ. 2,216 కోట్లతో ఆలయాల అభివృద్ధి

- రాష్ట్రవ్యాప్తంగా ఆలయాలకు మాస్టర్‌ప్లాన్
- మేడారానికి రూ.101 కోట్లతో అభివృద్ధి
- వేములవాడ, భద్రాద్రి, బాసరలో పనులు
- ధర్మపురి, జోగులాంబలో టెండర్ల ప్రక్రియ
- మరో 9 ఆలయాలకు మాస్టర్‌ప్లాన్ సిద్ధం
- దశలవారీగా పనులు చేపట్టనున్న ప్రభుత్వం

**హైదరాబాద్, జూలై 24 (వెలుతురు):**

తెలంగాణలోని ప్రముఖ దేవాలయాల సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.2,216 కోట్లతో కార్యాచరణ అమలు చేస్తోంది. ఇప్పటికే నాలుగు ఆలయాల్లో పనులు ప్రారంభం కాగా, మరో ఆరు ఆలయాల్లో టెండర్ల ప్రక్రియ కొనసాగుతోంది. అదనంగా మరో తొమ్మిది ఆలయాలకు మాస్టర్‌ప్లాన్ సిద్ధం చేసింది.మేడారం సమ్మక్క–సారలమ్మ గద్దెల పునర్నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులను రూ.101 కోట్లతో పూర్తి చేసింది. వేములవాడ రాజరాజేశ్వరస్వామి, భద్రాచలం శ్రీ సీతారామచం ద్రస్వామి, బాసర శ్రీ జ్ఞాన సరస్వతి, కాళేశ్వరం శ్రీ కాళేశ్వర ముక్తీశ్వ రస్వామి దేవాలయాల్లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి.ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి, అలంపూర్ జోగులాంబ, హైదరాబాద్ పెద్దమ్మ, వరంగల్ భద్రకాళి, కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వరస్వామి, నల్గొండ జిల్లా చెరువుగట్టు శ్రీ జడల రామలింగేశ్వరస్వామి దేవాలయాల్లో అభివృద్ధి పనుల కోసం టెండర్ల ప్రక్రియ కొనసా గుతోంది.అదేవిధంగా మరో తొమ్మిది ప్రముఖ దేవాలయాలకు మాస్టర్‌ప్లాన్ సిద్ధం చేసిన ప్రభుత్వం, దశలవారీగా అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించింది.

## పేపర్ లీక్‌లపై కఠిన చట్టం తెస్తాం




- ఎంపీ అర్వింద్ ధర్మపురి
- ఫాస్ట్‌ట్రాక్ కోర్టులకు ముసాయిదా సిద్ధం
- కఠిన శిక్షలతో కొత్త బిల్లుకు రూపకల్పన
- సోమవారం నుంచే పార్లమెంట్‌లో ఆమోదానికి ప్రయత్నం

## రాజ్యసభలో 'వందే మాతరం' బిల్లు..

- జాతీయ గేయాన్ని అవమానిస్తే జైలు శిక్ష!
- జాతీయ గీతం హోదా కల్పించేందుకు కేంద్రం కీలక అడుగు
- విపక్షాల నిరసనలతో సోమవారానికి సభ వాయిదా




## జంతర్ మంతర్ వద్ద విద్యార్థుల ఉద్యమానికి విద్యార్థి నాయకుడిగా నా సంపూర్ణ మద్దతు

**- మంత్రి పొన్నం ప్రభాకర్**

**హైదరాబాద్ వెలుతురు జూలై 24:**

ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై న్యాయం కోరుతూ విద్యార్థులు నిర్వహిస్తున్న శాంతియుత నిరసనకు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.




## ఆయిల్ ఫెడ్ కార్యాలయంలో అధికారులతో మంత్రి తుమ్మల సమీక్ష సమావేశం

- ఎల్-నినో పరిస్థితుల్లో ఆయిల్‌పామ్ సాగు విస్తరణకు మరింత వేగం.. రైతులకు మొక్కలు, డ్రిప్ పరికరాల కొరత ఉండకూడదని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు



# జెన్ జీ... కాంగ్రెస్, బీఆర్ఎస్ ను నిలదీయండి

- విద్యార్థుల ముసుగులో కమ్యూనల్, కమ్యూనిస్టు శక్తులు
- పాకిస్తాన్ కు చెందిన 480 సోషల్ మీడియా అకౌంట్లను కేంద్రం బ్లాక్ చేసింది
- మెడికల్ ఎంట్రన్స్ టెస్టులు లాడ్జీల్లో రాయించిన ఘనత కాంగ్రెస్, కూటమి పార్టీలది
- నీట్ కు ఆజాద్ కాశ్మీర్ కు సంబంధం ఏమిటి?
- నీట్ కు బంగ్లాదేశ్, పాకిస్తాన్, నేపాల్, శ్రీలంకకు సంబంధం ఏమిటి?
- నీట్ కు సనాతన ధర్మానికి, రాముడికి, సీతమ్మకు సంబంధమేమిటి

**హైదరాబాద్ వెలుతురు జూలై 24:**

రేవంత్ రెడ్డి రెండున్నరేళ్ల పాలనలో, బీఆర్ఎస్ పదేళ్ల పాలనలోనూ పరీక్షా పత్రాలు లీకయ్యాయని, మరి ఆనాడు కేసీఆర్, కేటీఆర్, రేవంత్ రెడ్డి ఎందుకు రాజీనామా చేయలేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రశ్నించారు. ''జెన్ జీ తరం పిల్లలారా... బీఆర్ఎస్ పార్టీ అంటేనే పేపర్ లీకేజీలు, పశ్నాపత్రలు అమ్ముకుని దోచుకున్నరు. కాంగ్రెస్ రెండున్నరేళ్ల పాలనలోనే అదే జరిగింది. ఆ రెండు పార్టీలను నిలదీయండి. అప్పుడైనా బుద్ధి వస్తుందేమో''అని పిలుపు నిచ్చారు. నిరసనలు, ధర్నాలను నిషేధిస్తూ ధర్నా చౌక్ నే ఎత్తేసిన బీఆర్ఎస్ నేతలు ఇయాళ సిగ్గులేకుండా అదే ధర్నా చౌక్ కు వచ్చి నిరసన చేస్తుంటే ఇందిరాపార్క్, ఎన్టీఆర్ పార్కులు పగలబడి నవ్వుతున్నాయని ఎద్దేవా చేశారు. ఢిల్లీలో కాక్రోచ్ పార్టీ పేరుతో జరిగిన నిరసనలో కమ్యూనిస్టు, కమ్యూనల్ పార్టీలు చొరబడి హింసను సృష్టించడమే కాకుండా పార్లమెంట్ పై దాడి చేసేందుకు యత్నించాయని మండిపడ్డారు.ఈరోజు బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బీజేపీ ఎమ్మెల్యేలు పైడి రాకేశ్ రెడ్డి, పాల్వాయి హరీష్, ఎమ్మెల్సీలు అంజిరెడ్డి, మల్క కొమరయ్య, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్, ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్, ముఖ్య అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్, అధికార ప్రతినిధులు సీహెచ్.విఠల్, జె.సంగప్ప తదితరులతో కలిసి కేంద్ర మంత్రి బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. ఏమన్నారంటే నీట్ పేపర్ లీక్ వ్యవహారం లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు, తల్లిదండ్రుల భావోద్వేగాలతో ముడిపడిన అంశం. అందరికంటే ఎక్కువగా ప్రధాని మోదీ బాధపడుతున్నారు. నిందితులకు కఠిన శిక్ష పడేలా ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేశారు. సీబీఐ ఇప్పటికే 11 మంది ఫ్యాకల్టీసహా 17 మందిని అరెస్ట్ చేసింది. విద్యార్థులు ఆందోళన అర్థం చేసుకున్నాం. విద్యాశాఖ మంత్రి ధరేంద్ర ప్రదాన్ క్షమాపణ చెప్పారు. విద్యార్థుల విద్యా సంవత్సరం నష్టపోకుండా 40 రోజుల్లోనే పరీక్షలు నిర్వహించి ఫలితాలు ప్రకటించింది.విద్యార్థుల ముసుగులో కమ్యూనల్, కమ్యూనిస్టు శక్తులు మొన్న ఢిల్లీలో అరాచకాలకు సృష్టించాయి. పార్లమెంట్ పై దాడి చేసేందుకు కుట్ర చేశారు. దేశ వ్యతిరేక నినాదాలు అందులో భాగమే. పోలీసులపై, జర్నలిస్టులపైన, మహిళా జర్నలిస్టులపై దాడులతో అసభ్యంగా ప్రవర్తించారు. పోలీసుల తలలు పగిలినా ఎక్కడా ఫైరింగ్ చేయలేదు. 118 మంది పోలీసులకు తీవ్ర గాయాలయ్యాయి. విధిలేని పరిస్థితుల్లో అరాచక శక్తులపై తప్పనిసరి లాఠీఛార్జ్ చేయాల్సి వచ్చింది.పాకిస్తాన్ నుండి సోషల్ మీడియా ద్వారా విష ప్రచారం చేస్తూ ఉద్రిక్తతలు సృష్టిస్తున్నారు. అందుకే పాకిస్తాన్ కు చెందిన 480 సోషల్ మీడియా అకౌంట్లను కేంద్రం బ్లాక్ చేసింది. విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలని కోరుతున్నా. నీట్ కు ఆర్టికల్ 370 రద్దుకు సంబంధం ఏమిటి?. నీట్ కు ఆజాద్ కాశ్మీర్ కు సంబంధం ఏమిటి? నీట్ కు బంగ్లాదేశ్, పాకిస్తాన్, నేపాల్, శ్రీలంకకు సంబంధం ఏమిటి?. నీట్ కు సనాతన ధర్మానికి, రాముడికి, సీతమ్మకు సంబంధమేమిటి. విద్యార్థులెవరూ దేశ ద్రోహ నినాదాలు చేయబోరు. డాక్టర్ కావాలనుకునే విద్యార్థులెవరూ రాళ్లు విసరరు. లాఠీలు పట్టుకోరు. మహిళలపై అసభ్యంగా ప్రవర్తించరు. విపక్షాలు పార్లమెంట్ లో ఎందుకు చర్చలకు సిద్ధంగా లేదు. చర్చలతో రాద్ధాంతాలు చేసి రాజకీయం చేయడమే వాళ్ల లక్ష్యం. నీట్ పేపర్ లీకై రెండు నెలలు దాటినా కాంగ్రెస్, ప్రతిపక్షాలు ఏనాడూ పెదవి విప్పలే. కాక్రోచ్ పార్టీ ధర్నాలతో మొన్న సడెన్ గా పీఎం ఇంటిని ముట్టడించేందుకు కాంగ్రెస్ కుట్ర. ఇండీ కూటమి నీట్ సమస్య పరిష్కారంపైన, విద్యార్థుల భవిష్యత్తుపై ఆలోచనే లేదు. మోదీని దించి రాహుల్ ను పీఎం చేయాలన్నదే వాళ్ల ఏకైక లక్ష్యం. అందుకే ప్రధాని, హోం, విద్యా మంత్రి రాజీనామా చేయాలంటున్నారు.యూపీఏ హయాంలో 72 సార్లు పేపర్లు లీకైనయ్. మరి ఆనాడు మన్మోహన్ సింగ్, విద్యాశాఖ మంత్రి ఎందుకు రాజీనామా చేయలేదు?. రాజస్తాన్ లో అశోక్ గెహ్లాట్ సీఎంగా ఉండగా 18సార్లు పేపర్లు లీక్ అయితే ఆనాడు రాజీనామా చేశారా?. ఆనాడు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఏమన్నారో దేశమంతా చూసింది. కాంగ్రెస్ చేస్తే సంసారం...ఇతరులు చేస్తే వ్యభిచారమా?. పంజాబ్ లోని ఆప్ ప్రభుత్వ హయంలోనే ప్లస్ 2 పేపర్ లీకైతే కేజ్రీవాల్ సారీ చెప్పిండా? సీఎంతో రాజీనామా చేయించిండా?. కర్నాటలో టెన్త్ క్లాస్, పీయూసీ పేపర్ లీకైతే సీఎంతో, విద్యా మంత్రితో రాజీనామా చేయించారా. యూపీలో ములాయం సింగ్, అఖిలేష్ యాదవ్ టైంలో ఎన్నోసార్లు పేపర్ లీకైతే రాజీనామా ఎందుకు చేయలేదు. బెంగాల్ లో టీచర్ రిక్రూట్ మెంట్ టెస్ట్ పేపర్ లీకైతే మమతా బెనర్జీ రాజీనామా చేసిందా?. కేరళ LDF పాలనలో స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (PSC) పరీక్షల్లో భారీగా అవకతవకలు జరిగితే పినరయి విజయన్ సీఎం పదవికి రాజీనామా చేసిండా.కేసీఆర్ పాలనలో ప్రభుత్వం అంటేనే పేపర్ లీక్ ప్రభుత్వంగా మారింది నిజం కాదా? ఆనాడు ఎంసెట్ పేపర్, టీఎస్పీఎస్సీ గ్రూప్ 1 పేపర్, ఎస్సెస్సీ తెలుగు, హిందీ పేపర్లు లీకైనయ్. పరీక్షలంటే పేపర్లు అమ్ముకుని విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేశారు. మరి ఆనాడు కేసీఆర్, కేటీఆర్ రాజీనామా చేశారా?. నేను గ్రూప్ 1 పేపర్ లీక్ పై పోరాటం చేస్తుంటే ఏమైందో మీరే చూశారు. టెన్త్ పేపర్ లీక్ చేస్తే వాడ్ని పట్టుకోకుండా నామీద కేసు పెట్టి అరెస్ట్ చేసి జైలుకు పంపారు కదా. ఆనాడు సీఎం కేసీఆర్ మందు తాగి 5 నిమిషాలకు ఒకసారి పోలీస్ కమిషనర్ కు ఫోన్ చేసి తెల్లవార్లు తిప్పి జైలుకు



పంపాలని అనలేదా. దీనిమీద కోర్టు నన్ను నిర్దోషిగా ప్రకటిస్తూ... కేసీఆర్ ప్రభుత్వానికి మెట్టికాయలు వేస్తూ తీర్పు వెల్లడించింది మర్చిపోయారా.ఇన్ని తప్పిదాలు చేసిన బీఆర్ఎస్ నాయకులు సిగ్గు లేకుండా పేపర్ లీక్ పై ధర్నా చేయడమా? ధర్నా చౌక్ నే ఎత్తేసినోడు ఇయాళ ధర్నాకు కూసుంటే ఇందిరాపార్క్, ఎన్టీఆర్ స్టేడియం నవ్వుతున్నయ్. కేటీఆర్ కనీసం పుట్టినరోజు కూడా నిజాలు చెప్పలేదు... నోరు తెరిస్తే పచ్చి అబద్దాలు మాట్లాడుతున్నాడు. ట్విట్టర్ టిల్లు బినామీ సంస్థ గ్లోబరీనా నిర్వాకంవల్ల 27 మంది ఇంటర్మీడియట్ ఆత్మహత్య చేసుకుంటే కనికరం లేకుండా వాళ్ల తల్లిదండ్రులపై లాఠీఛార్జ్ చేయించిన ఘటనలు మర్చిపోగలమా?. మీ బినామీ సంస్థ వల్ల 27 మంది ఇంటర్ విద్యార్థులు ఆత్మహత్య చేసుకుంటే ఎందుకు రాజీనామా చేయలేదు. జెన్ జీ తరం పిల్లలారా.... ఇదే విషయంపై కేటీఆర్ ను నిలదీయండి.. అప్పుడైనా బుద్ధి వస్తుంది.పేపర్ లీక్ పై సీఎం వ్యాఖ్యలు సుద్దపూసను తలపిస్తున్నాయి. కాంగ్రెస్ రెండేళ్ల పాలనలోనే టెన్త్ తెలుగు, హిందీ పేపర్ లీకైంది. గ్రూప్ 1 లో అక్రమాలు జరిగి 4 లక్షల మంది నిరుద్యోగుల భవిష్యత్తును నాశనమైంది. మరి ఆనాడు మీరెందుకు రాజీనామా చేయలేదు. సీఎంగారూ...ముందు మీరు రాజీనామా చేసి ఇతరుల రాజీనామా గురించి మాట్లాడండి. మొన్న నీట్ పరీక్షల్లో ర్యాంకులు సాధించిన గురుకుల విద్యార్థులందరినీ పిలిచి సన్మానం ఎందుకు చేసినవ్. మీరు సన్మానించిన విద్యార్థులను అడగండి నీట్ పరీక్ష ఎట్లా జరిగిందో చెబుతారు.గ్లోబరీనా గురించి మాట్లాడుతున్న సీఎం...ఇంటర్ విద్యార్థుల ఆత్మహత్యలకు సూత్రధారాలైన వాళ్లను ఎందుకు అరెస్ట్ చేయడం లేదు. కాంగ్రెస్, బీఆర్ఎస్ డ్రామాలన్నీ ప్రజలు తెలుసు. ఫోన్ ట్యాపింగ్ పైనా చర్యల్లేవు... వాళ్లను అరెస్ట్ చేస్తానంటే ఆపిందెవరు? చేతనైతే... ఆత్మహత్య చేసుకున్న 27 మంది విద్యార్థుల తల్లిదండ్రుల స్టేట్ మెంట్ రికార్డు చేయండి. రేవంత్ కొట్టినట్లు చేస్తే...కేటీఆర్ ఏడ్చినట్లు నటిస్తున్నడు. రేవంత్, కేటీఆర్ తీరు... సంపినోడే సంతాప సభ పెట్టినట్లుంది. ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకోలేని చేతగాని దద్దమ్మ ప్రభుత్వం కాంగ్రెస్ ది. బీఆర్ఎస్ స్కాంలు కాంగ్రెస్ కు ఏటీఎంలాగా మారాయి. సీఎంకు తెలుసా? లేక మధ్యవర్తిగా ఉన్నారా?మేం మీలెక్క ఆరోపణలకు ప్రత్యారోపణలు చేస్తూ ఎదురుదాడి చేయడం లేదు. భవిష్యత్తులో ఇట్లాంటి జరగకుండా పెద్ద ఎత్తున సంస్కరణలు చేపట్టినం. 2024లోనే యాంటీ పేపర్ లీక్ బిల్లును పార్లమెంట్ లో ప్రవేశపెట్టినం. ఆనాడు కాంగ్రెస్ సిగ్గు లేకుండా వ్యతిరేకించి వాకౌట్ చేసింది. ఆనాడే సూచనలు, సలహాలివ్వాలని చెబితే పారిపోయిన మీరా ఇయాళ మా గురించి, మోదీగారి నిజాయితీ గురించి మాట్లాడేది?.మెడికల్ ఎంట్రన్స్ టెస్టులు లాడ్జీల్లో రాయించిన ఘనత కాంగ్రెస్, కూటమి పార్టీలది. పేపర్లు లీక్ చేయించి మెరిట్ ఉన్న పేద పిల్లలకు సీట్లు రాకుండా చేసిన నీచులు మీరు. జేఈఈ తరహాలోనే ఇకపై ఆన్ లైన్ లోనే నీట్ పరీక్ష నిర్వహిస్తాం. 2014కు ముందు దేశంలో 51 వేల MBBS సీట్లుంటే... ప్రస్తుతం 1 లక్షా 36 వేల వరకు సీట్లు పెరిగినయ్. మెడికల్ కాలేజీలు యూపీఏ హయాంలో 385 ఉంటే...ఇయాళ 824 కు పెరిగినయ్. ఇదీ మా నిబద్ధత. ముందు మీరు యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చండి. 6 గ్యారంటీలను నెరవేర్చండి. గత ఎన్నికల్లో యువత కోసం ప్రకటించిన హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ ఏమైంది?. చిత్తశుద్ధి ఉంటే యూత్ డిక్లరేషన్ ను అమలు చేసి నిజాయితీ నిరూపించుకోండి. చనిపోయిన విద్యార్థులకు నష్ట పరిహారంపై కేంద్రం ఆలోచిస్తుంది.ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామా పరిష్కారం కాదు, విద్యార్థుల భవిష్యత్తే మాకు ముఖ్యం. మేం రాజకీయంతో కాదు, రాజనీతితో ఆలోచించి పనిచేస్తున్నాం. బీఆర్ఎస్ మాదిరిగా కాంగ్రెస్ తో చీకటి ఒప్పందాల్లేవు. కప్పం కట్టడాలు లేవు. రాహుల్ గాంధీ ప్రతిపక్ష నేత. ప్రధానిగా చేసిన నెహ్రూ, ఇందిరా, రాజీవ్ కుటంబ వారసుడు.. ఇట్లా చేస్తారనుకోలేదు. కాంగ్రెస్, ఇండీ కూటమి, కమ్యూనిస్టులు, కమ్యూనల్ పార్టీలన్నీ ఒక్కటై దేశాన్ని అస్థిర పర్చేందుకే కుట్రలు చేస్తున్నట్లు కన్పిస్తోంది. అర్బన్ నక్సల్స్, కమ్యూనిస్టులు, కమ్యూనల్స్ కలిసి విద్యార్థుల ముసుగులో దారుణాలకు తెగబడుతున్నారు.వీళ్లను చూస్తుంటే.... చాణక్యుడు చెప్పిన మాటలు గుర్తుకొస్తున్నయ్. రాజు బలవంతుడైతే... దొంగలు, దోపిడీదారులు, హంతకులు ఒక్కటై దేశంలో అరాచకాన్ని సృష్టించడానికి, దేశాన్ని విభజించడానికి కుట్రలు చేస్తుంటారట. ప్రపంచ దేశాలన్నీ మోదీ నాయకత్వాన్ని పొగుడుతుంటే ఇండీ కూటమి, కమ్యూనిస్టు, కమ్యూనల్స్ తట్టుకోలేక పోతున్నారు. అరాచకాలతో దేశాన్ని అస్థిరపర్చి భారత్ ను పాకిస్తాన్, శ్రీలంక, బంగ్లాదేశ్ లెక్క మార్చే కుట్ర జరుగుతోంది. విద్యార్థులారా... కుటిల రాజకీయ నేతల ట్రాప్ లో పడకండి. మెడికల్ కౌన్సిలింగ్ కు సిద్ధం కండి. విధ్వంసకర శక్తుల వలలో పడి భవిష్యత్తును నాశనం చేసుకోకండి. మూటలు ఇచ్చేది బీఆర్ఎస్సే. ఆ మూటలను ఢిల్లీకి మోస్తోంది కాంగ్రెస్సే. అందుకే బీఆర్ఎస్ స్కాంలపై చర్యలు తీసుకోవడం లేదు కదా. రేవంత్ సీఎం కాకముందే అధికారంలోకి రాగానే కేసీఆర్ కుటుంబాన్ని జైల్లో వేస్తామన్నారు కదా?. మరి రెండున్న రేళ్లుగా ఎందుకు అరెస్ట్ చేయడం లేదు. ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామాతో సమస్య పరిష్కారం కాదు. విద్యార్థుల భవిష్యత్తే మాకు ముఖ్యం. విద్యార్థుల ఆందోళన చేస్తామంటే... నమ్మి పర్మిషన్ ఇచ్చాం. విద్యార్థుల ముసుగులో సంఘ విద్రోహ శక్తులు చేసి అరాచకాలు చేస్తారనుకోలేదు.కేటీఆర్ కు 50వ బర్త్ డే శుభాకాంక్షలు. కేటీఆర్ బతుకు ఫిఫ్టీ ఫిఫ్టీ అయ్యింది. 50 శాతం గబ్బులు... మరో 50 శాతం పబ్బులతోనే బతుకు గడుస్తోంది. బీజేపీలో బలమైన నాయకుడి గురించి బీఆర్ఎస్ కు ఎందుకు. బీజేపీ కార్యకర్త చాలు... బీఆర్ఎస్ ను ఎదుర్కోవడానికి. పార్లమెంట్ లో నీట్ పై చర్చకు మేం సిద్ధం.

## పార్టీ మారడం లేదు కాంగ్రెస్...

(మొదటి పేజీ తరువాయి)

ఈ పరిణామాలతో తీవ్ర మనస్తాపానికి గురైన ఒక బీఆర్ఎస్ కార్యకర్త.. మల్లారెడ్డి పార్టీ మారకూడదని కోరుతూ తన సొంత రక్తంతో లేఖ రాశాడు.ఈ ఘటనపై బోయిన్‌పల్లిలో నిర్వహించిన కేటీఆర్ జన్మదిన వేడుకల్లో మల్లారెడ్డి స్పందించారు. రక్తంతో రాసిన లేఖ తనను ఎంతగానో బాధించిందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతగా అభిమానించిన ఆ కార్యకర్త ఎవరో కనుక్కొని నేరుగా వెళ్లి తప్పకుండా కలుస్తానని చెప్పారు.ఇదే వేడుకలో తన పార్టీ మార్పు ఊహాగానాలపై ఆయన పూర్తి స్పష్టత ఇచ్చారు. తాను కాంగ్రెస్‌తో సహా ఏ ఇతర పార్టీలోకీ మారడం లేదని, ప్రాణం ఉన్నంతవరకు బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానని తేల్చి చెప్పారు. కార్యకర్తలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, గులాబీ జెండా నీడలోనే ఉంటానని మరోసారి స్పష్టం చేశారు.

## జనావాసాల్లోనే క్యూర్...

(మొదటి పేజీ తరువాయి)

క్యూర్ పరిధిలో నిర్మించే ఒక్కో ఫ్లాట్ 528 చదరపు అడుగుల విస్తీర్ణంలో, 400 చదరపు అడుగుల కార్పెట్ ఏరియాతో ఉండనుంది. ఒక్కో ఫ్లాట్ నిర్మాణ వ్యయం సుమారు రూ.11 లక్షలు కాగా, అందులో రూ.5 లక్షల సబ్సిడీని ప్రభుత్వం అందించనుంది. మిగిలిన రూ.6 లక్షలను లబ్ధిదారుడు భరించాల్సి ఉంటుంది. భూమి వ్యయాన్ని మాత్రం పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుంది.తొలి విడతలో రాజేంద్రనగర్, మహేశ్వరం, శేరిలింగంపల్లి, ఇబ్రహీంపట్నం, మల్కాజ్‌గిరి, నాంపల్లి, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, కార్వాన్, బహదూర్‌పురా, అంబర్‌పేట్, కూకట్‌పల్లి, మేడ్చల్, కుత్బుల్లాపూర్, సనత్‌నగర్, సికింద్రాబాద్ కంటోన్మెంట్, మలక్‌పేట్ నియోజకవర్గాల్లో 7,680 ఫ్లాట్ల నిర్మాణానికి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. ఇందుకోసం నిరుపయోగ ప్రభుత్వ భూముల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు.

## పేపర్ లీక్ దోషులకు 10 ఏళ్ల జైలు!

**న్యూఢిల్లీ వెలుతురు జూలై 2026:**

ప్రశ్నపత్రాల లీక్‌లకు పాల్పడే వారిపై మరింత కఠిన చర్యలకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. పేపర్ లీక్ కేసుల్లో దోషులకు గరిష్ఠంగా 10 ఏళ్ల జైలు శిక్ష, రూ.10 కోట్ల వరకు జరిమానా విధించేలా చట్టాన్ని సవరించాలని కేంద్ర క్యాబినెట్ నిర్ణయించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన శుక్రవారం జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో ఈ మేరకు ముసాయిదా బిల్లుకు ఆమోదం లభించినట్లు సమాచారం. అయితే దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.2024లో అమల్లోకి వచ్చిన ప్రవేశ పరీక్షల (అక్రమ పద్ధతుల నివారణ) చట్టంకు కీలక సవరణలు ప్రతిపాదించారు. ప్రస్తుతం వ్యక్తిగతంగా పేపర్ లీక్‌కు పాల్పడిన వారికి 3 నుంచి 5 ఏళ్ల జైలు శిక్ష, రూ.10 లక్షల వరకు జరిమానా ఉండగా.. వ్యవస్థీకృత నేరాల్లో 5 నుంచి 10 ఏళ్ల జైలు శిక్ష, రూ.కోటి వరకు జరిమానా విధించే నిబంధనలు ఉన్నాయి. వీటిని మరింత కఠినతరం చేస్తూ జరిమానాలను రూ.10 కోట్ల వరకు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది.పేపర్ లీక్ కేసుల వేగవంతమైన విచారణ కోసం ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసే ప్రతిపాదన కూడా బిల్లులో ఉంది. ఈ కోర్టుల పరిధిలో కేసుల విచారణను మూడు నెలల్లో పూర్తి చేసి దోషులకు త్వరితగతిన శిక్షలు విధించేలా నిబంధనలు రూపొందించినట్లు సమాచారం. ఇప్పటికే ఢిల్లీలో తొలి ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు కాగా, మరో నాలుగు కోర్టులను ఏర్పాటు చేయడానికి చర్యలు కొనసాగుతున్నాయి.నీట్ పేపర్ లీక్ ఘటనల నేపథ్యంలో పరీక్షల విశ్వసనీయతపై ఆందోళనలు వ్యక్తమైన విషయం తెలిసిందే. ఈ పరిణామాల అనంతరం పేపర్ లీక్‌లను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని ప్రధాని మోదీ ప్రకటించారు. ఈ బిల్లును వచ్చే వారం లోక్‌సభలో ప్రవేశపెట్టే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.

# పేపర్ లీక్‌లపై కఠిన చట్టం తెస్తాం

- 22 లక్షల మందికి తిరిగి పరీక్షలు నిర్వహించాం
- నిందితులందరినీ అరెస్టు చేశామని వెల్లడి
- విద్యార్థుల భవిష్యత్తే ప్రభుత్వానికి ప్రాధాన్యం

**న్యూఢిల్లీ, జూలై 24 (వెలుతురు):**

పేపర్ లీక్ ఘటనలను అత్యంత తీవ్రమైన నేరంగా భావిస్తున్నామని, దోషులకు కఠిన శిక్షలు విధించేలా కొత్త చట్టాన్ని తీసుకొస్తామని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి తెలిపారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ఏర్పాటు, కఠిన శిక్షల నిబంధనలతో రూపొందించిన ముసాయిదాపై కేంద్ర మంత్రివర్గం చర్చించి, వీలైనంత త్వరగా పార్లమెంట్‌లో ఆమోదింపజేయడానికి ప్రయత్నిస్తామని చెప్పారు.పేపర్ లీక్ అనేది చిన్న విషయం కాదని, లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రుల జీవితాలను ప్రభావితం చేసే అంశమని అర్వింద్ పేర్కొన్నారు. ఘటన వెలుగులోకి వచ్చిన వెంటనే కేంద్ర ప్రభుత్వం వేగంగా స్పందించి నిందితులను గుర్తించి అరెస్టు చేసిందని, ప్రస్తుతం వారంతా జైలులో ఉన్నారని వెల్లడించారు.ప్రభుత్వం పూర్తి స్థాయిలో యంత్రాంగాన్ని వినియోగించి అత్యంత తక్కువ సమయంలోనే 22 లక్షల మంది విద్యార్థులకు తిరిగి పరీక్షలు నిర్వహించిందని తెలిపారు. ఈ నెల 19న ఫలితాలను కూడా ప్రకటించామని, దేశవ్యాప్తంగా విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడం సంతోషకరమని అన్నారు.పేపర్ లీక్‌లపై చర్యలు ఇంతటితో ఆగబోవని స్పష్టం చేసిన ఆయన.. ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ఏర్పాటు కోసం ఇప్పటికే సంబంధిత శాఖలకు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. అధికారులు సిద్ధం చేసిన ముసాయిదాపై కేంద్ర మంత్రివర్గం చర్చించి, సభ్యుల సూచనల మేరకు తుది రూపం ఇవ్వనున్నట్లు చెప్పారు.సోమవారం నుంచి పార్లమెంట్ రెండో విడత సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో, ఈ బిల్లును వీలైనంత త్వరగా పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదం పొందేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అర్వింద్ ధర్మపురి తెలిపారు.

## ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటుకు...

(మొదటి పేజీ తరువాయి)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్, తెలంగాణ జెన్‌కో ఉన్నతాధికారులతో ఆయన సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు సంస్థల పనితీరు, ఉత్పత్తి లక్ష్యాలు, భవిష్యత్ కార్యాచరణపై అధికారులకు డిప్యూటీ సీఎం పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.

**జెన్‌కోకు నాణ్యమైన బొగ్గు నిరంతరాయంగా అందాలి**

విద్యుత్ ఉత్పత్తిలో ఏమాత్రం ఆటంకం కలగకుండా జెన్‌కో థర్మల్ విద్యుత్ కేంద్రాలకు సింగరేణి నుంచి నాణ్యమైన బొగ్గును నిరంతరాయంగా సరఫరా చేయాలని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. బొగ్గు ఉత్పత్తి, రవాణాలో ఒక్కరోజు జాప్యం జరిగినా సంస్థకు, ప్రభుత్వానికి తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లుతుందని హెచ్చరించారు. ఈ విషయంలో ఏ చిన్న నిర్లక్ష్యాన్ని సహించేది లేదని, ఉత్పత్తి వేగాన్ని మరింత పెంచాలని అధికారులను ఆదేశించారు.

**ప్రైవేటుకు దీటుగా పోటీ పడాలి**

కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల బొగ్గు రంగంలో ప్రైవేటు సంస్థల నుంచి పోటీ పెరిగిందని, మారిన పరిస్థితులకు అనుగుణంగా సింగరేణి తన నైపుణ్యాన్ని, సామర్థ్యాన్ని పెంచుకోవాలని సూచించారు.ఆధునిక సాంకేతికత: ఉత్పత్తి వ్యయాన్ని తగ్గిస్తూనే, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలి.పోటీతత్వం: ప్రపంచ స్థాయి పోటీ వాతావరణంలో సింగరేణి అత్యుత్తమ ఫలితాలు సాధించి లాభాల బాటలో పయనించేలా ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలి.

**దీర్ఘకాలిక ముందస్తు ప్రణాళికలు అవసరం**

భవిష్యత్ విద్యుత్ అవసరాలు, పారిశ్రామిక పురోగతిని



దృష్టిలో ఉంచుకుని ముందస్తు కార్యాచరణతో ముందుకు సాగాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దిశానిర్దేశం చేశారు. బొగ్గు నిల్వల అన్వేషణ, నూతన గనుల అభివృద్ధి, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుల విస్తరణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. సింగరేణిని మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని విధాలా సంపూర్ణ సహకారం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

# జంతర్ మంతర్ వద్ద విద్యార్థుల ఉద్యమానికి...

(మొదటి పేజీ తరువాయి)

విద్యార్థులు, అధ్యాపకులు జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న నిరసనల్లో పాల్గొనవద్దంటూ జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (JNU) యాజమాన్యం అడ్వైజరీ జారీ చేయడాన్ని మంత్రి తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికీ రాజ్యాంగం కల్పించిన హక్కు అని పేర్కొన్నారు.నీట్ పేపర్ లీకేజీ కారణంగా వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అనిశ్చితిలో పడిందని, గత 20 రోజులుగా విద్యార్థులు తమకు జరిగిన అన్యాయంపై న్యాయం కోరుతూ ఆందోళన చేస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం తగిన విధంగా స్పందించడం లేదని విమర్శించారు.నీట్ పేపర్ లీకేజీ కి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. అలాగే ఈ వ్యవహారంతో తీవ్ర మనోవేదనకు గురై ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించి ఆదుకోవాలని కోరారు.శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులు, ఉద్యమకారులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఎత్తివేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం, వారికి న్యాయం జరిగేలా లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ చేపడుతున్న ఉద్యమానికి తన సంపూర్ణ మద్దతు ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించి, నీట్ పేపర్ లీకేజీ బాధితులకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

# కాంగ్రెస్, కాక్రోచ్ జనతా పార్టీ ఢిల్లీ డ్రామాలను ఎండగట్టిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు





- షాద్‌నగర్‌లో ఘనంగా రంగారెడ్డి జిల్లా బీజేపీ కార్యవర్గ సమావేశం
- రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీ గెలుపు ఖాయమని ధీమా

**రంగారెడ్డి జిల్లా వెలుతురు జూలై 24:**

రంగారెడ్డి జిల్లా భారతీయ జనతా పార్టీ కార్యవర్గ సమావేశం ఈరోజు షాద్‌నగర్‌లో అత్యంత ఘనంగా నిర్వహించబడింది. ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.ఈ సందర్భంగా ఎన్. రామచందర్ రావు మాట్లాడుతూ... దేశంలో రైతుల సమస్యల పేరిట కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీ మరియు కాక్రోచ్ జనతా పార్టీ నాయకులు కలిసి ఢిల్లీలో ధర్నాలు చేస్తూ డ్రామాలు ఆడుతున్నారని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజలను, రైతులను మోసం చేసేందుకే వీరంతా కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్, దాని మిత్రపక్షాల నాటకాలను ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీ విజయం సాధించి అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేసి, ప్రజా సమస్యలపై పోరాటాలను ఉధృతం చేయాలని ఈ సందర్భంగా కార్యకర్తలకు, నాయకులకు ఆయన దిశానిర్దేశం చేశారు.సమావేశంలో పాల్గొన్న ముఖ్య నాయకులు ఈ జిల్లా కార్యవర్గ సమావేశంలో బీజేపీ ముఖ్య నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రసంగించారు. హాజరైన వారిలో రాజ్ భూపాల్ గౌడ్ (జిల్లా అధ్యక్షుడు) బూర నర్సయ్య గౌడ్ (మాజీ ఎంపీ) రఘునాథరావు (జిల్లా ఇంచార్జ్) బొక్క నరసింహారెడ్డి, నరసింహారెడ్డి, తోకల శ్రీనివాస్ రెడ్డి, బొక్క బాల్ రెడ్డి, అంజన్ కుమార్, భాషా, గణేష్ (యువమోర్చా అధ్యక్షుడు) జగదీప్ (ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి) రత్నం, శ్రీరాములు, విష్ణువర్ధన్ రెడ్డి, శ్రీధర్, మహేందర్, గోనే శ్రీకాంత్, పవన్, బాబురావు మరియు బిజెపి విభాగాలు, మోర్చాల ప్రతినిధులు, మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ సమావేశాన్ని విజయవంతం చేశారు.

# ఉప్పర్‌పల్లి బీజేపీ ఆఫీస్ వద్ద ఘనంగా సాగుతున్న ఓటు హక్కు అవగాహన సదస్సు

- విజయవంతంగా 24వ రోజుకు చేరిన మహాయజ్ఞం!
- బొక్క బాల్ రెడ్డి గారి సారథ్యంలో అప్రతిహతంగా సాగుతున్న ఓటరు చైతన్య యజ్ఞం!
- "ఒకే దేశం - ఒకే ఓట్" నినాదంతో ప్రతి ఇంటికీ వెళ్తున్న బీజేపీ సేవా సైనికులు!

**హైదరాబాద్ వెలుతురు జూలై 24:**



దేశ భవిష్యత్తును నిర్ణయించే తిరుగులేని శక్తి ఓటు హక్కుకు మాత్రమే ఉందని, ప్రతి పౌరుడు తన ఓటును హక్కుగా కాపాడుకోవాలని భారతీయ జనతా పార్టీ సేవా సైనికులు పిలుపు నిచ్చారు.ఉప్పర్‌పల్లి బీజేపీ కార్యాలయం వద్ద మరియు హైదర్‌గూడ డివిజన్ల పరిధిలో ఓటు హక్కు ప్రాధాన్యతపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు, కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక్ష సమీక్ష (SIR) ప్రక్రియలో భాగంగా చేపట్టిన ప్రత్యేక అవగాహన కార్యక్రమం శుక్రవారం రోజుకి విజయవంతంగా 24వ రోజుకు చేరుకుంది.బిజెపి సీనియర్ నాయకులు బొక్క బాల్ రెడ్డి గారి అద్భుత నాయకత్వంలో, ఆయన ముందుండి నడిపిస్తున్న ఈ మహాయజ్ఞంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలైన గోనే శ్రీకాంత్ రెడ్డి, పవన్ పల్లుచెరువు, నరేందర్, భూపాల్ ముదిరాజ్, కర్ణాకర్, రాజశేఖర్, మనోజ్, చిన్న మనోజ్, పెద్ద మనోజ్, ఇతర బీజేపీ కార్యకర్తలు మరియు బీఎల్ఓలు (BLO) భాగస్వాములై అత్యంత బాధ్యతాయుతంగా ముందుకు తీసుకెళ్తున్నారు.

**వన్ నేషన్ - వన్ ఓట్ కోసం అలుపెరుగని కృషి:**

ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ముందుకు తీసుకెళ్తున్న "వన్ నేషన్ – వన్ ఓట్" (ఒకే దేశం – ఒకే ఎన్నిక) విధానం దేశ సమగ్ర వికాసానికి, ప్రగతికి ఎంతో అవసరమని నొక్కి చెప్పారు. ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి, అక్రమ మరియు నకిలీ ఓట్లను సమూలంగా అరికట్టడానికి ప్రతి ఇంటికీ వెళ్లి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. దేశ రక్షణలో, ధర్మ రక్షణలో ప్రతి ఒక్కరి ఓటు అత్యంత కీలకమని, అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు.

**మీ ఇంటి వద్దకే హెల్ప్‌లైన్ సేవలు:**

ఇంకా ఎవరైనా ఓటరు నమోదు లేదా సవరణ ఫారమ్‌లు తీసుకోకపోతే... కాలనీ ప్రెసిడెంట్లు, సెక్రటరీలు, విల్లాస్ మరియు గేటెడ్ కమ్యూనిటీల ప్రతినిధులు మా హెల్ప్‌లైన్ నంబర్లకు సమాచారం అందిస్తే, మా కార్యకర్తలే నేరుగా మీ వద్దకు వచ్చి ఫారమ్‌లు పూర్తి చేసి, తామే సబ్మిట్ చేస్తారు.

**గమనిక:**

ఆగస్టు 3వ తేదీ వరకు మాత్రమే సమయం ఉన్నందున ఎవరూ నిర్లక్ష్యం చేయవద్దు. మీ సేవ కోసం ప్రతిరోజూ ఉదయం 9:00 నుండి రాత్రి 9:00 గంటల వరకు ఉప్పర్‌పల్లి బీజేపీ ఆఫీస్ నందు సేవా సైనికులు అందుబాటులో ఉంటారు.

భారత్ మాతాకీ జై! జై శ్రీరామ్!
వేదిక / చిరునామా: బీజేపీ ఆఫీస్, ఉప్పర్‌పల్లి, హైదర్‌గూడ డివిజన్
సహాయం కోసం సంప్రదించాల్సిన హెల్ప్‌డెస్క్ నంబర్లు:
90000 89911
8885559911
సదా మీ సేవలో,
భారతీయ జనతా పార్టీ సేవా సైనికులు & కార్యకర్తలు
ఉప్పర్‌పల్లి – హైదర్‌గూడ డివిజన్.

# న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో వీ. హనుమంతరావు గారి మౌన దీక్షకు కాంగ్రెస్ నేతల సంఘీభావం






- కొప్పుల ప్రవీణ్ కుమార్ ప్రధాన కార్యదర్శి తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ)

**న్యూఢిల్లీ వెలుతురు జూలై 24:**

న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో సీనియర్ కాంగ్రెస్ నాయకులు వి. హనుమంతరావు గారు చేపట్టిన మౌన దీక్షకు కాంగ్రెస్ పార్టీ నాయకులు సంఘీభావం ప్రకటించారు.ఈ సందర్భంగా ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి గారు, తెలంగాణ రాష్ట్ర చీఫ్ విప్ ఆది శ్రీనివాస్ గారు, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ప్రధాన కార్యదర్శి కొప్పుల ప్రవీణ్ కుమార్ గారు దీక్షా శిబిరాన్ని సందర్శించి, వీ. హనుమంతరావు గారిని కలిసి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు.నాయకులు వీ. హనుమంతరావు గారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకోవడంతో పాటు, ఆయన చేపట్టిన దీక్ష వెనుక ఉన్న ప్రజా ప్రయోజనాల పట్ల తమ సంఘీభావాన్ని వ్యక్తం చేశారు.

**కాంగ్రెస్ నేతల వ్యాఖ్య**

“ప్రజా ప్రయోజనాల పరిరక్షణ కోసం వీ. హనుమంతరావు గారు చేపట్టిన ఈ మౌన దీక్ష ప్రజల ఆకాంక్షలకు ప్రతిబింబం. ప్రజా సమస్యల పరిష్కారం కోసం జరుగుతున్న ప్రతి ప్రజాస్వామ్య పోరాటానికి కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుంది.”ఈ సందర్భంగా నాయకులు వీ. హనుమంతరావు గారి దీక్ష విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు సానుకూలంగా స్పందించాలని కోరారు.

# ప్రెస్ క్లబ్ సభ్యులకు నిమ్స్ లో మాస్టర్ హెల్త్ చెకప్ ప్రారంభం

**హైదరాబాద్ వెలుతురు జూలై, 24:**



నిమ్స్ లో ప్రెస్ క్లబ్ సభ్యులకు మాస్టర్ హెల్త్ చెకప్ ప్రత్యేక శిబిరం ప్రారంభమైంది వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు శుక్రవారం నాడు నిమ్స్ లో ప్రెస్ క్లబ్ సభ్యులకు మాస్టర్ చెకప్ ప్రత్యేక శిబిరాన్ని నిమ్స్ డైరెక్టర్ రాహుల్ దేవరాజ్ పరిరక్షణలో డీన్ సీనియర్ ప్రొఫెసర్ చంద్రశేఖర్, సీనియర్ ప్రొఫెసర్ పరంజ్యోతి, అసిస్టెంట్ రిజిస్టర్ డాక్టర్ చరణ్ రాజు లు లాంఛనంగా ప్రారంభించారు. జర్నలిస్టులో వారి కుటుంబ సభ్యులకు ఈ మాస్టర్ హెల్త్ చెకప్ శిబిరం ఎంతగానో ఉపకరిస్తుందని ప్రెస్ క్లబ్ అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు ఎస్. విజయకుమార్ రెడ్డి ,రమేష్ వరికుప్పల ఈ సందర్భంగా అన్నారు. తీవ్రమైన పని ఒత్తిడి వల్ల జర్నలిస్టులు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని అలాంటి వారికి ఈ నిమ్స్ శిబిరం ఒక సువర్ణ అవకాశమని ప్రెస్ క్లబ్ కార్యవర్గం అభిప్రాయపడింది.ఈ వైద్య శిబిర ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు ఏ .రాజేష్, అరుణ అత్తలూరి, జాయింట్ సెక్రెటరీ చిలుకూరి హరిప్రసాద్, కోశాధికారి రమేష్ వైట్ల, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు ఎన్. శ్రీనివాస్ రెడ్డి, వనం నాగరాజు, అశోక్ దయ్యాల, రచన ముడుంబై, నిమ్స్ పి .ఆర్. ఓ .సత్యం గౌడ్ సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు. జర్నలిస్టులకు హెల్త్ కార్డు ఉన్న సభ్యులందరికీ ఈ మాస్టర్ హెల్త్ చెకప్ చేయడం జరుగుతుందని నిమ్స్ వైద్యాధికారులు వెల్లడించారు. ప్రెస్ క్లబ్ నమోదు చేసుకున్న సభ్యులకు మాత్రమే ఈ శిబిరంలో వైద్య పరీక్షలు చేయడం జరుగుతుందని ప్రెస్ క్లబ్ కార్యవర్గం వెల్లడించింది.

# కేటీఆర్‌కు ధర్నా చేసే నైతిక హక్కు లేదు: పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

- కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన టీపీసీసీ చీఫ్
- ధర్నా చౌక్‌ను ఎత్తేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని విమర్శ
- గ్లోబరీనా నివేదికను ఎందుకు దాచారని ప్రశ్న
- బీఆర్ఎస్ హయాంలోనే పరీక్షల లీకుల పర్వం సాగిందని ఆరోపణ
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోసం రాహుల్ గాంధీ పోరాడుతున్నారని వ్యాఖ్య
- బీఆర్ఎస్ డ్రామాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని పిలుపు

**హైదరాబాద్ వెలుతురు జూలై 24:**



టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. గాంధీ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూనే, ధర్నా చౌక్‌ను ఎత్తివేసిన చరిత్ర బీఆర్ఎస్‌దేనని, అలాంటి పార్టీకి ఇప్పుడు ధర్నాలు చేసే నైతిక హక్కు లేదని అన్నారు.ధర్నా చౌక్‌లో కేటీఆర్ ముక్కు నేలకు రాసి ప్రజలకు క్షమాపణ చెప్పాలని మహేష్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. ధర్నా అంటే ఏమిటో కేటీఆర్ ముందుగా అర్థం చేసుకోవాలని, విద్యార్థుల సమస్యలపై పోరాడుతున్నట్లు నటించడం ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని వ్యాఖ్యానించారు.విద్యార్థుల సమస్యలపై కాంగ్రెస్ అగ్రనేత మల్లికార్జున ఖర్గే వయసు మీద పడినా పోరాటం చేస్తున్నారని, కానీ ప్రతిపక్ష నేత కేసీఆర్ మాత్రం ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే కొడంగల్‌లో నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారని గుర్తు చేశారు.ఇంటర్మీడియట్ విద్యార్థుల మరణాలకు గ్లోబరీనా సంస్థ బాధ్యత వహించలేదా అని ప్రశ్నించిన మహేష్ కుమార్ గౌడ్.. ఆ సంస్థ ఇచ్చిన నివేదికను బీఆర్ఎస్ ప్రభుత్వం ఎందుకు బయటపెట్టలేదని నిలదీశారు. పేరు మార్చుకుని అదే సంస్థ విద్యార్థుల జీవితాలతో ఆటలాడుతోందని, గ్లోబరీనా వ్యవహారంలో కేటీఆర్ పాత్రపై అనుమానాలు ఉన్నాయని ఆరోపించారు.బీఆర్ఎస్ పాలనలో పరీక్షల లీకుల పరంపర కొనసాగిందని, గ్రూప్–1 సహా పలు పరీక్షల్లో అవకతవకలు జరిగాయని అన్నారు. బీఆర్ఎస్ ఖాతాల్లో రూ.1,400 కోట్ల నిధులు ఉన్నాయని పేర్కొంటూ, వాటిలోంచి పరీక్షల కారణంగా నష్టపోయిన లేదా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు ఆర్థిక సాయం చేయాలని డిమాండ్ చేశారు.నీట్ పరీక్ష లీక్ మే 12న జరిగినా కేటీఆర్ ఇప్పుడు మొద్దు నిద్ర లేచినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాహుల్ గాంధీకి రాజకీయ మైలేజ్ రాకుండా మోదీతో కలిసి కుట్ర చేసి కాంగ్రెస్‌పై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. విద్యార్థుల కోసం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని రాహుల్ గాంధీ పోరాడుతున్నారని పేర్కొన్నారు.పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌ను పూర్తిగా తిరస్కరించి సున్నా సీట్లకు పరిమితం చేశారని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ కూడా సరిగా ఇవ్వలేదని విమర్శిస్తూ, నల్లచొక్కాలు వేసుకుని ఇప్పుడు ధర్నాలు చేస్తే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని వ్యాఖ్యానించారు.

# రాజ్యసభలో ‘వందేమాతరం’ బిల్లు..

**న్యూఢిల్లీ వెలుతురు జూలై 2026:**

జాతీయ గీతం ‘జనగణమన..’ తరహాలోనే జాతీయ గేయం ‘వందేమాతరం’కు కూడా చట్టపరమైన రక్షణ కల్పించే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. వందేమాతరం గేయాన్ని అవమానించినా, దాని ఆలాపనకు ఆటంకం కలిగించినా జైలు శిక్ష విధించేలా ప్రతిపాదిస్తూ రూపొందించిన ‘వందేమాతరం బిల్లు’ను హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ శుక్రవారం రాజ్యసభలో ప్రవేశ పెట్టారు. అయితే, ఈ బిల్లుపై విపక్షాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడంతో సభలో గందరగోళం నెలకొని, రాజ్యసభ సోమవారానికి వాయిదా పడింది.

**నేషనల్ ఆనర్’ చట్టంలో కీలక సవరణలు**

వందేమాతరం ఆలాపనను కావాలని అడ్డుకున్నా, గేయం పాడుతున్న సమయంలో ఇబ్బందులు సృష్టించినా నేరంగా పరిగణించేలా ప్రివెన్షన్ ఆఫ్ ఇన్‌సల్ట్స్ టూ నేషనల్ ఆనర్ – 1971 చట్టానికి మార్పులు చేస్తూ కేంద్రం ఈ తాజా బిల్లులో నిబంధనలు పొందుపరిచింది. ఒకప్పుడు వందేమాతరంలో కొన్ని చరణాలకే ప్రాధాన్యత ఇచ్చేవారని, కానీ ఇప్పుడు పూర్తిస్థాయిలో ఆలపిస్తున్నందున దీనికి తగిన గౌరవం, చట్టభద్రత అవసరమని బీజేపీ రాజ్యసభ ఎంపీ సంజయ్ సేథ్ బిల్లును సమర్థించారు.

**స్వేచ్ఛా హక్కుకు భంగం: విపక్షాల ఆందోళన**

మరోవైపు, కేంద్ర తెచ్చిన ఈ బిల్లును ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. బిల్లులోని నిబంధనలు రాజ్యాంగం పౌరులకు ప్రసాదించిన ప్రాథమిక స్వేచ్ఛా హక్కుకు భంగం కలిగించేలా ఉన్నాయని ఆరోపిస్తున్నాయి. ఈ క్రమంలోనే సీపీఐ(ఎం) రాజ్యసభ ఎంపీ జాన్, కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు లేఖ రాశారు. "స్వాతంత్ర్య పోరాటంలో వందేమాతరం పాత్ర అమూల్యమైనది. అయితే జాతీయ గీతం, జాతీయ గేయం స్థాయిలకు సంబంధించి ప్రస్తుతమున్న రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధంగా ఈ బిల్లు ఉంది. ఇది దేశభక్తికి, వ్యక్తిగత స్వేచ్ఛకు మధ్య ఉన్న సున్నితమైన సమతౌల్యాన్ని దెబ్బతీస్తుంది" అని పేర్కొంటూ, బిల్లును ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# రాజు కుటుంబానికి అండగా హెవీ ట్రక్ జాబర్స్

**బియ్యం, సరుకుల అందజేత**

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూలై 24:**



గ్రామం వెల్లంకిలో బీఎస్పీ నకిరేకల్ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు గూని రాజు తండ్రి పెద్ద లింగయ్య(68) ఇటీవలే గుండెపోటుతో మృతి చెందారు. ఆపదలో ఉన్న వారి కుటుంబానికి గ్రామంలోని హెవీ ట్రక్ జాబర్స్ అండగా నిలిచారు. వారికి తోచిన రూపంలో బియ్యం, నిత్యవసర సరుకులు అందజేశారు. భవిష్యత్తులోనూ వెన్నంటే ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జినుక రాజు, చేగూరి నర్సింహ్మ, గూని నాగరాజు, ఎల్లస్వామి, గణేష్, దేవమ్మ, మహేష్, సురేష్, కుర్మ నర్సింహ్మ, జంపల్లి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్యం గెలుపు కాదు... నిబద్ధతతో కూడిన ప్రయత్నమే!

మానవ జీవితం అనేది పుట్టుక నుండి మరణం వరకు సాగే ఒక నిరంతర సంక్షోభం, సమరం. ప్రతి నిమిషం, ప్రతి క్షణం ఏదో ఒక నిర్దిష్ట లక్ష్యాన్ని సాధించడం కోసం, మరేదో విజయ జెండాను ఎగురవేయడం కోసం మనిషి నిరంతరం తపించిపోతున్నాడు. విద్యార్థి దశలో పరీక్షల మార్కులు, ఉపాధి రంగంలో ప్రమోషన్లు, వ్యాపార సామ్రాజ్యాల్లో లాభాల శాతాలు, రాజకీయ మైదానంలో అధికార పీఠాలు ఇలా ఏ రంగాన్ని పరిశీలించినా విజయాన్నే అంతిమ గమ్యంగా భావిస్తూ మానవాళి అర్రులు చాస్తోంది. నిత్యం విజయం వెంటే పరుగులు తీసే ఈ ధోరణి సమాజంలో ఒక సహజ నియమంగా మారిపోయింది.అయితే, ఆధునిక సమాజం రేసుగుర్రాల వలె పరిగెడుతున్న ఈ తరుణంలో ఒక్క క్షణం ఆగి ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కాలం అనే మహా న్యాయమూర్తి ముందు నిలబడినప్పుడు మనం సాధించామని సంబరపడే విజయాలు, పోగొట్టుకున్నామని కుమిలిపోయే అపజయాలు నిజంగా ఎంతటి ప్రాధాన్యత కలిగినవి? చరిత్ర పుటలను నిశితంగా పరిశీలిస్తే ఒక పచ్చి నిజం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. అనాదిగా కాలం ఇచ్చిన ప్రతి కీలక తీర్పులోనూ బాహ్య విజయాలు, తాత్కాలిక వైఫల్యాలు రెండూ సమాన స్థాయిలోనే నిలుస్తాయి.

ప్రపంచంలో ఎంతటి శక్తులకైనా లొంగని, ఎవరికీ మినహాయింపు ఇవ్వని ఏకైక ప్రామాణిక శక్తి కాలం. అధికార గర్వంతో విర్రవీగే చక్రవర్తులైనా, వీధిలో అలమటించే యాచకులైనా, చరిత్ర సృష్టించిన విజేతలైనా, నిర్దాక్షిణ్యంగా ఓడిపోయిన పరాజితులైనా అందరినీ కాలచక్రం ఒకే రకమైన నిష్పాక్షిక గీటురాయిపై పెట్టి పరీక్షిస్తుంది. ఈ రోజు సమాజంలో సర్వాధికారిగా చెలామణి అవుతున్న ఒక వ్యక్తి, రేపటి చరిత్ర పుటల్లో కేవలం ఒక చిన్న వాక్యానికి మాత్రమే పరిమితం కావచ్చు. అదే సమయంలో, వర్తమానంలో ఘోర వైఫల్యంగా భావించబడే ఒక సంఘటన, రాబోయే తరాలకు దిశానిర్దేశం చేసే మహా స్ఫూర్తిగా అవతరించవచ్చు.ఎందుకంటే, కాలం ఎల్లప్పుడూ తాత్కాలిక సంఖ్యలను, ఫలితాలను పరిగణనలోకి తీసుకోదు. మనిషి ప్రదర్శించిన ప్రయత్నం వెనుక ఉన్న ఆత్మార్థతను, ఆశించిన శాశ్వత విలువలను, సమాజానికి మిగిల్చిన ఆదర్శ సందేశాన్ని మాత్రమే కాలం పరిగణిస్తుంది.ఉదాహరణకు, గ్రీకు వీరుడు అలెగ్జాండర్ ప్రపంచాన్నంతటినీ జయించాలనే ఆశయంతో దండయాత్రలు చేశాడు. నాటి రోజుల్లో ఆయన సాధించిన విజయాలు అపూర్వమైనవిగా భావించబడ్డాయి. కానీ, ఆయన అకాల మరణం పొందిన కొద్దికాలానికే ఆ సామ్రాజ్య వైభవం ముక్కలై కాలగర్భంలో కలిసిపోయింది. మరోవైపు, ప్రసిద్ధ తత్త్వవేత్త సోక్రటీస్ ఏ యుద్ధాలనూ గెలవలేదు, ఏ సామ్రాజ్యాలనూ స్థాపించలేదు. చివరికి సమాజం ఇచ్చిన విషపాత్రను స్వీకరించి ప్రాణాలు విడిచాడు. లోకం దృష్టిలో అది స్పష్టమైన ఓటమి. కానీ, శతాబ్దాలు గడిచినా నేటికీ ప్రపంచ వ్యాప్తంగా సోక్రటీస్ ఆలోచనా విధానాన్ని మానవాళి ఆరాధిస్తోంది తప్ప, అలెగ్జాండర్ సామ్రాజ్యాన్ని కాదు. కాలం ఎవరిని గెలిచినవాడిగా, ఎవరిని ఓడినవాడిగా నిర్ణయిస్తుందో అది మన తాత్కాలిక ఆలోచనలకు పూర్తి భిన్నంగా ఉంటుంది.మనం నిత్యం ఆరాటపడే విజయం అనేది ఒక నిర్దిష్ట కాల పరిమితికి, పరిస్థితులకు మాత్రమే పరిమితమైన ఒక భావన. క్రీడారంగంలో ఒక ఛాంపియన్ ట్రోఫీ సాధిస్తాడు, కానీ కొన్నేళ్లకే మరొక నూతన క్రీడాకారుడు ఆ రికార్డును తిరగరాస్తాడు. కార్పొరేట్ రంగంలో ఒక అగ్రగామి సంస్థ దశాబ్దాలు ఏలవచ్చు, కానీ నూతన సాంకేతిక విప్లవం ముందు మరుసటి రోజున అది కుప్పకూలిపోవచ్చు. రాజకీయాల్లో అపార ప్రజాదరణ పొందిన నాయకులను సైతం చరిత్ర తదుపరి కాలంలో నిష్పాక్షికంగా విశ్లేషిస్తుంది. కాబట్టి విజయం అనేది ఎప్పటికీ శాశ్వతం కానేరదు. అది కాలం చేతిలో తాత్కాలికంగా మెరిసే ఒక ఆభరణం మాత్రమే.



అదే విధంగా, అపజయం కూడా అంతిమం కాదు. సైన్స్ రంగాన్ని గమనిస్తే, శాస్త్రవేత్తలు వందలాది ప్రయోగాలు విఫలమైన తర్వాతే విప్లవాత్మక ఆవిష్కరణలను సాకారం చేయగలిగారు. థామస్ ఆల్వా ఎడిసన్ విద్యుత్ బల్బును కనుగొనే క్రమంలో వేలాది ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఆ వైఫల్యాలను ఆయన నిరాశగా చూడక, పని చేయని వేల మార్గాలను నేను కనుగొన్నాను అని ధీమాగా ప్రకటించారు. ఆ ప్రాథమిక వైఫల్యాలే లేకపోతే అంతిమ ఆవిష్కరణ సాధ్యపడేది కాదు. అంటే, మనం అపజయంగా భావించే ప్రతి సంఘటన కూడా విజయానికి గట్టి పునాది వేసే ఒక అనివార్యమైన అనుభవ పాఠం మాత్రమే.కాలం అంతిమంగా అంచనా వేసేది ఫలితాల సంఖ్యను కాదు, మనిషి ప్రదర్శించిన నిశ్చల సంకల్ప బలాన్ని. ఆపదలు ఎదురైనప్పుడు వ్యక్తి నిలబెట్టుకున్న మానవీయ విలువలను, సవాళ్ల నుంచి నేర్చుకున్న అనుభవాలను కాలం గుర్తిస్తుంది. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోయిన రైతన్న మళ్లీ నాగలి పట్టి భూమిని దున్నే ధైర్యం చూపిస్తే, అది రాజభవన విజయాల కంటే మిన్నయినది. తీవ్ర పోటీ పరీక్షల్లో విఫలమైన విద్యార్థి నిరాశకు గురికాకుండా మళ్లీ సన్నద్ధమైతే, దాన్నే అసలైన అంతర్గత శక్తిగా కాలం గుర్తిస్తుంది.

భారతీయ ధర్మ గ్రంథమైన భగవద్గీతలో శ్రీకృష్ణ పరమాత్మ అర్జునుడికి ఉపదేశించిన సారాంశం కూడా ఇదే. ఫలితంపై ఆశ వీడి, కర్తవ్యాన్నే ప్రధానంగా స్వీకరించాలని గీతాచార్యుడు ప్రభోధించాడు. ఎందుకంటే ఫలితం అనేది అనేక బాహ్య పరిస్థితులపై, కాలమాన పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. మన చేతిలో ఉన్నది కేవలం నిజాయితీతో కూడిన శ్రమ మాత్రమే. ఆ శ్రమలో ఆత్మార్థత ఉన్నప్పుడు, అది జయాపజయాలతో సంబంధం లేకుండా కాలం ముందు అత్యున్నత గౌరవాన్ని పొందుతుంది.భారత స్వాతంత్ర్య సంగ్రామాన్ని తిరగేస్తే ఈ సత్యం స్పష్టంగా కనిపిస్తుంది. మాతృభూమి స్వేచ్ఛ కోసం ప్రాణాలర్పించిన ఎందరో పోరాట యోధులు తాము ఆశించిన స్వాతంత్ర్య సమయాన్ని స్వయంగా చూడలేకపోయారు. వారి తక్షణ పోరాటం నాటి పరిస్థితుల్లో అసంపూర్ణంగా అనిపించవచ్చు. కానీ, నేడు ఆ త్యాగధనులను దేశం నలుమూలలా అమరవీరులుగా స్మరించుకుంటోంది. వారు తక్షణ ఫలితాలను పొందలేకపోయినా, కాలం వారిని అమర విజేతలుగా చరిత్ర పుటల్లో నిలిపింది.నేటి తీవ్రమైన పోటీ ప్రపంచంలో, ముఖ్యంగా యువత తీవ్రమైన మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు. ప్రతి చిన్న అపజయాన్ని జీవితానికి అంతంగా భావిస్తూ తీవ్ర నైరాశ్యంలోకి కూరుకుపోతున్నారు. కానీ, కాలం తీర్పు ముందు గెలుపోటములు రెండూ సమానమే అనే వైశాల్యాన్ని అలవరచుకుంటే ఈ ఒత్తిడి నుంచి విముక్తి లభిస్తుంది.ప్రతి అపజయం ఒక కొత్త నేర్చుకునే అవకాశాన్ని ఇస్తుంది, ప్రతి విజయం ఒక కొత్త బాధ్యతను పెంచుతుంది. గెలుపు అహంకారాన్ని పెంచకూడదు, ఓటమి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీయకూడదు. ఈ రెండూ కాలం అనే మహానదిలో కలిసిపోయే రెండు ప్రవాహాలు మాత్రమే. జీవితమనే ప్రయాణంలో గెలుపోటములు కేవలం తాత్కాలిక మజిలీలు మాత్రమే. ఎంత నిబద్ధతతో జీవించామన్నదే అసలైన విజయం. కాబట్టి రేపటి ఫలితంపై అనవసర భయాలు వీడి, నేటి కర్తవ్యాన్ని నిష్ఠతో నిర్వహించడమే నిజమైన మానవ విధి!



డా. సూర్యదేవర రామకృష్ణ ,
Moral Philosopher, 9490754169

# విద్య తరగతి గదిలో భవిష్యత్తు అంటారు... కానీ విద్యార్థికి భరోసా ఎక్కడ?

"తరగతి గదిలోనే విద్యార్థుల భవిష్యత్తు నిర్మితమవుతుంది" అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరచూ చెబుతున్నారు. ఆ మాట సూత్రప్రాయంగా నిజమే. కానీ ఆ భవిష్యత్తును నిర్మించే విద్యార్థుల కోసం ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలుగా వేల కోట్ల రూపాయలను విడుదల చేయకుండా ఆలస్యం చేస్తే, ఆ మాటల విశ్వసనీయతపై ప్రశ్నలు తలెత్తడం సహజం. విద్యను ప్రాధాన్యంగా చూస్తున్నామని చెప్పే ప్రభుత్వాలు, అదే విద్యను కొనసాగించేందుకు అవసరమైన ఆర్థిక మద్దతును నిర్లక్ష్యం చేస్తే, పేద విద్యార్థుల భవిష్యత్తు నినాదాలకే పరిమితమవుతుంది.

నేడు భారత విద్యావ్యవస్థ ఒక తీవ్రమైన వైరుధ్యాన్ని ఎదుర్కొంటోంది. విద్య అభివృద్ధికి, ఉపాధికి, సామాజిక చైతన్యానికి మార్గం కావాల్సి ఉండగా, పెద్ద సంఖ్యలో నిరుద్యోగ పట్టభద్రులను తయారుచేసే వ్యవస్థగా మారుతోందనే విమర్శలు పెరుగుతున్నాయి. ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ పూర్తిచేసిన తర్వాత కూడా ఉద్యోగాల కోసం యువత సంవత్సరాల తరబడి పరీక్షలు రాయడం, కోచింగ్ కేంద్రాల చుట్టూ తిరగడం, నిరాశతో జీవించడం సాధారణ దృశ్యంగా మారింది. విద్య జీవన నైపుణ్యాలను అందించే సాధనంగా కాకుండా మార్కుల పోటీగా, ఉద్యోగం కోసం సర్టిఫికెట్ల సేకరణగా మారిపోవడం ఈ సంక్షోభానికి ప్రధాన కారణం.అయితే ఈ విమర్శలు విద్యకు వ్యతిరేకంగా కావు. విద్య ఎలా ఉండాలి? ఎవరికి ఉపయోగపడాలి? అనే ప్రశ్నలను మళ్లీ ముందుకు తెచ్చే ప్రయత్నం మాత్రమే. విద్య అంటే కేవలం పరీక్షల్లో ఉత్తీర్ణత కాదు. అది విమర్శనాత్మక ఆలోచన, శాస్త్రీయ దృక్పథం, సామాజిక బాధ్యత, ప్రజాస్వామ్య విలువలు, జీవన నైపుణ్యాలను పెంపొందించే ప్రక్రియ కావాలి. అదే విద్య వ్యక్తిని మాత్రమే కాదు, సమాజాన్ని కూడా ముందుకు నడిపిస్తుంది.ఈ నేపథ్యంలో 2020లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన జాతీయ విద్యా విధానం (NEP-2020)పై దేశవ్యాప్తంగా విస్తృత చర్చ జరిగింది. 34 సంవత్సరాల తర్వాత వచ్చిన ఈ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం చారిత్రాత్మక సంస్కరణగా ప్రచారం చేసింది. అయితే, ఈ విధానాన్ని విమర్శించే విద్యావేత్తలు, సామాజిక న్యాయవాదులు వేరొక కోణాన్ని ప్రస్తావిస్తున్నారు. వారి అభిప్రాయం ప్రకారం, ఈ విధానం విద్యలో సమాన అవకాశాల కంటే ప్రైవేటీకరణకు, కేంద్రీకరణకు, మార్కెట్ ధోరణులకు అధిక ప్రాధాన్యం ఇస్తోందనే ఆందోళన ఉంది.

ప్రత్యేకించి సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థుల దృష్టిలో ఈ విధానంలోని అనేక అంశాలు సందేహాలను రేకెత్తిస్తున్నాయి. ప్రాథమిక స్థాయిలో మాతృభాషలో బోధనను ప్రోత్సహించడం ఒకవైపు సానుకూలంగా కనిపించినప్పటికీ, ప్రభుత్వ పాఠశాలలు మాత్రమే మాతృభాషకు పరిమితమై, ప్రైవేట్ విద్యాసంస్థలు ఇంగ్లీష్ మాధ్యమంలో ముందుకు సాగితే సామాజిక అసమానత మరింత పెరిగే ప్రమాదం ఉంది. భాష అనేది కేవలం సంభాషణ సాధనం మాత్రమే కాదు, అది అవకాశాలకు ద్వారం. ఆ ద్వారం పేదలకు మూసుకుపోతే సమానత్వం దెబ్బతింటుంది.పిల్లల జీవితంలో 3 నుండి 8 సంవత్సరాల వయస్సు అత్యంత కీలక దశ అని శాస్త్రీయ పరిశోధనలు చెబుతున్నాయి. ఈ దశలోనే మెదడు అభివృద్ధిలో ఎక్కువ భాగం పూర్తవుతుంది. అయినప్పటికీ, ఈ వయస్సు పిల్లలకు నాణ్యమైన ప్రీ-ప్రైమరీ విద్య అందించడంలో ప్రభుత్వాలు ఆశించిన స్థాయిలో ముందుకు రాలేకపోయాయి. అంగన్‌వాడీలు పోషకాహార పంపిణీ కేంద్రాలుగా ముఖ్యమైన సేవలు అందిస్తున్నప్పటికీ, సమగ్ర శిశు విద్యకు అవసరమైన మౌలిక సదుపాయాలు, శిక్షణ పొందిన ఉపాధ్యాయులు, బోధనా వనరులు చాలాచోట్ల లేవనే విమర్శలు ఉన్నాయి. ఫలితంగా బడుగు, బలహీన వర్గాల పిల్లలు ప్రారంభ దశలోనే నాణ్యమైన విద్యకు దూరమవుతున్నారు.

ఇక తరగతులు 3, 5, 8లో పరీక్షల ఆధారంగా విద్యార్థులను నిలిపివేసే (డిటైన్) విధానంపైనా అనేక అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల పిల్లలకు ఇంట్లో చదువుకునే వాతావరణం ఉండకపోవచ్చు. ట్యూషన్లు పెట్టించే అవకాశం ఉండకపోవచ్చు. అలాంటి పిల్లలకు అదనపు బోధన, వ్యక్తిగత శ్రద్ధ అవసరం. కానీ పరీక్షల్లో విఫలమయ్యారని వారిని అదే తరగతిలో నిలిపివేయడం సమస్యను పరిష్కరించదు, చదువుపై విరక్తిని పెంచే ప్రమాదం ఉంది.విద్యా హక్కు చట్టం (RTE) ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లను బడుగు, బలహీన వర్గాల పిల్లలకు కేటాయించాల్సిన నిబంధన ఉంది. అయితే, అమలు లోపాల కారణంగా ఈ హక్కు అనేక ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో ఫలితాలను ఇవ్వలేకపోతోంది. అదే సమయంలో ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన మౌలిక సదుపాయాలు, ఇంగ్లీష్ మాధ్యమం, డిజిటల్ వనరులు అందుబాటులో లేకపోతే, పేద విద్యార్థులు రెండువైపులా నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుంది.

తెలంగాణలో మాధ్యమ భాషపై కొనసాగుతున్న చర్చ కూడా ఇదే నేపథ్యంలో చూడాలి. ఒకవైపు ప్రైవేట్ పాఠశాలల్లో ఇంగ్లీష్ మాధ్యమం విస్తృతంగా అందుబాటులో ఉండగా, మరోవైపు ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని చోట్ల సమాన స్థాయిలో ఆ అవకాశం లేకపోవడం సామాజిక అసమానతను పెంచుతుందనే అభిప్రాయాలు ఉన్నాయి. ప్రపంచీకరణ, సాంకేతిక పరిజ్ఞానం, ఉద్యోగ అవకాశాల నేపథ్యంలో ఇంగ్లీష్ భాషకు ఉన్న ప్రాధాన్యాన్ని విస్మరించలేం. అదే సమయంలో మాతృభాష పరిరక్షణ కూడా అంతే ముఖ్యమైనది. అందువల్ల ఈ రెండింటి మధ్య సమతుల్యతను సాధించే విధానమే అవసరం.త్రిభాషా సూత్రంపై కూడా భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. దీనిని కొందరు జాతీయ సమైక్యతకు అవసరమైన చర్యగా సమర్థిస్తే, మరికొందరు అది విద్యార్థులపై అదనపు భారం మోపుతుందని, భాషా రాజకీయాలకు దారితీస్తుందని విమర్శిస్తున్నారు. ప్రజాస్వామ్యంలో ఇటువంటి విధానాలు విస్తృత చర్చ, రాష్ట్రాల అభిప్రాయాలు, విద్యావేత్తల సూచనల ఆధారంగా అమలుకావాలి.ఉన్నత విద్యలో ప్రతిపాదించిన మల్టిపుల్ ఎంట్రీ-ఎగ్జిట్ విధానం, నాలుగేళ్ల డిగ్రీలు, ఎం.ఫిల్ రద్దు వంటి అంశాలపైనా విభిన్న అభిప్రాయాలు ఉన్నాయి. ఈ విధానాన్ని సమర్థించే వారు ఇది విద్యార్థులకు ఎక్కువ స్వేచ్ఛ ఇస్తుందని అంటున్నారు. విమర్శించే వారు మాత్రం భారతదేశంలోని సామాజిక, ఆర్థిక వాస్తవాలను దృష్టిలో ఉంచుకుంటే పేద విద్యార్థులు మధ్యలో చదువు మానేసే ప్రమాదం మరింత పెరుగుతుందని హెచ్చరిస్తున్నారు. విద్యార్థి చదువు మానేసిన తర్వాత తిరిగి చేరడానికి ఉద్యోగ భద్రత, ఆర్థిక మద్దతు, సామాజిక భరోసా అవసరం. అవి బలహీనంగా ఉన్న పరిస్థితిలో ఈ విధానం ఆశించిన ఫలితాలను ఇవ్వకపోవచ్చని వారి వాదన.

అలాగే ఉన్నత విద్యలో ప్రైవేటీకరణ పెరిగితే ఫీజులు పెరగడం, ప్రభుత్వ విద్యాసంస్థల పాత్ర తగ్గడం, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు అవకాశాలు తగ్గిపోవడం వంటి ఆందోళనలు కూడా వ్యక్తమవుతున్నాయి. నాణ్యమైన విద్య అందరికీ అందుబాటులో ఉండాలంటే ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉంది.

విద్యలో సమానత్వం గురించి మాట్లాడే ప్రతి విధానం తగిన ఆర్థిక మద్దతు లేకుండా విజయవంతం కాదు. స్థూల జాతీయోత్పత్తిలో 6 శాతం విద్యకు కేటాయించాలని దశాబ్దాల క్రితమే సిఫారసు చేసినప్పటికీ, ఆ లక్ష్యం ఇప్పటికీ పూర్తిగా సాధించబడలేదు. తగిన నిధులు లేకుండా నాణ్యమైన ప్రభుత్వ విద్యను నిర్మించడం అసాధ్యం. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు, వసతి, డిజిటల్ వనరులు, ఉపాధ్యాయ నియామకాలు, ఇవన్నీ సమగ్ర పెట్టుబడిని కోరుకుంటాయి.

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విద్యను సామాజిక విముక్తికి ప్రధాన సాధనంగా చూశారు. ఆయన చెప్పిన "చదువుకోండి, సంఘటితమవండి, పోరాడండి" అనే పిలుపు వెనుక ఉన్న అసలు భావం, విద్య ద్వారా సమాన అవకాశాలు కల్పించడమే. అందువల్ల విద్యా విధానాలను అంచనా వేయాల్సిన ప్రమాణం ఒక్కటే, అవి సమాజంలోని చివరి వరుసలో ఉన్న బాలుడికి, బాలికకు కూడా నాణ్యమైన విద్యను అందిస్తున్నాయా లేదా?విద్యను మార్కెట్ అవసరాలకు మాత్రమే పరిమితం చేయడం, లేదా రాజకీయ భావజాలాల సాధనంగా ఉపయోగించడం, ఈ రెండూ ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. విద్య స్వేచ్ఛను, శాస్త్రీయ దృక్పథాన్ని, రాజ్యాంగ విలువలను, సామాజిక న్యాయాన్ని పెంపొందించే శక్తిగా ఉండాలి. ప్రభుత్వాల మార్పుతో విద్యా విధానాలు మారే పరిస్థితి కాకుండా, రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా అందరికీ సమాన అవకాశాలు కల్పించే జాతీయ విద్యా వ్యవస్థను నిర్మించాల్సిన అవసరం ఉంది.విద్యార్థుల భవిష్యత్తు నిజంగానే తరగతి గదిలో నిర్మితమవ్వాలంటే, ముందుగా ఆ తరగతి గది అందరికీ సమానంగా అందుబాటులో ఉండాలి. పేదరికం, కులం, భాష, ప్రాంతం, లింగం వంటి కారణాలతో ఎవరూ విద్యకు దూరం కాకూడదు. ప్రభుత్వాలు నినాదాలకే పరిమితం కాకుండా నిధులు, మౌలిక సదుపాయాలు, నాణ్యమైన ఉపాధ్యాయులు, సమాన అవకాశాలతో కూడిన విద్యా వ్యవస్థను నిర్మించినప్పుడే విద్య నిజమైన విముక్తి సాధనంగా మారుతుంది. అదే భారత రాజ్యాంగం కలగన్న సామాజిక న్యాయానికి, సమానత్వానికి, ప్రజాస్వామ్యానికి బలమైన పునాది అవుతుంది.



మన్నారం నాగరాజు
సామాజిక రాజకీయ విశ్లేషకులు

# నీట్ పేపర్ లీక్‌పై కాంగ్రెస్ ఆందోళన

- **వివేకానందనగర్‌లో మోదీ దిష్టిబొమ్మ దహనం.. కాంగ్రెస్ నేతల అరెస్టు**

**కూకట్ పల్లి, జూలై 24 వెలుతురు:**



దేశవ్యాప్తంగా సంచలనం రేపిన నీట్ పేపర్ లీక్ వ్యవహారాన్ని నిరసిస్తూ శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని వివేకానందనగర్ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. కూకట్ పల్లి వివేకానందనగర్ కమాన్ వద్ద చేపట్టిన ఈ నిరసనలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. నీట్ పరీక్షలో చోటుచేసుకున్న పేపర్ లీక్ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు న్యాయం చేయాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర నాయకులు చిరుమర్తి రాజు డిమాండ్ చేశారు. ఆందోళన ఉధృతంగా మారడంతో పోలీసులు వెంటనే జోక్యం చేసుకుని నిరసనకారులను అదుపులోకి తీసుకుని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ పరిణామంతో వివేకానందనగర్ కమాన్ పరిసరాల్లో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నీట్ పరీక్ష నిర్వహణలో పారదర్శకత పాటించాలని, విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడే వారిపై కేంద్ర ప్రభుత్వం రాజీపడకుండా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

# అమెరికాలో ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు...

- **ఫ్లోరిడాలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన బిక్కీ బుచ్చయ్య గౌడ్ కుటుంబం**

**కూకట్ పల్లి జూలై 24 వెలుతురు:**




భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలను అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తుంగతుర్తి మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బిక్కీ బుచ్చయ్య గౌడ్, ఆయన సతీమణి బిక్కీ మంగమ్మ, మనవరాలు సాయి శ్రీ కృతితో కలిసి కేక్ కట్ చేసి కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కేటీఆర్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవిస్తూ ప్రజా సేవలో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. తెలంగాణ అభివృద్ధికి ఆయన చేస్తున్న సేవలు మరింత విస్తరించాలని, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి సేవలందించాలని వారు కోరుకున్నారు. విదేశాల్లో నివసిస్తున్నప్పటికీ తెలంగాణపై తమ అభిమానం, కేటీఆర్ పట్ల ఉన్న అభిమానాన్ని చాటుతూ ఫ్లోరిడాలో జన్మదిన వేడుకలను కుటుంబ సభ్యులతో కలిసి ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు.

# ఎల్‌నినో ప్రభావం: ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు మొగ్గు చూపాలి

- **శంకర్‌పల్లి మండల వ్యవసాయ అధికారి చంటి చైతన్య**
- **మొకిల రైతు వేదికలో వానాకాలం–2026 అత్యవసర పంటల ప్రణాళిక సదస్సు**
- **ముఖ్య అతిథిగా హాజరైన ఏఎంసీ చైర్‌పర్సన్ గోవిందమ్మ**

**శంకర్‌పల్లి, వెలుతురు జూలై 24 :**



ప్రస్తుత వానాకాలం–2026 సీజన్‌లో ఎల్–నినో ప్రభావం వల్ల వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలు ఉన్నందున, రైతులు వాతావరణ మార్పులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపాలని శంకర్‌పల్లి మండల వ్యవసాయ అధికారి చంటి చైతన్య పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం శంకర్‌పల్లి మండలంలోని మొకిల రైతు వేదికలో 'వానాకాలం–2026 అత్యవసర పంటల ప్రణాళిక'పై మండల స్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ శ్రీమతి గోవిందమ్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, అధిక నీటి అవసరమున్న వరి సాగును సాధ్యమైనంత వరకు తగ్గించుకోవాలని రైతులకు సూచించారు. ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో పండే పప్పుధాన్యాలు, మొక్కజొన్న, సజ్జలు, నువ్వులు వంటి పంటలను సాగు చేయాలన్నారు. ఉద్యానవన పంటలైన టమాట, దొండకాయ వంటి కూరగాయలతో పాటు ఆయిల్ పామ్ సాగుపై రైతులకు శాస్త్రీయంగా అవగాహన కల్పించారు. రైతులు వ్యవసాయ శాఖ సూచనలు పాటిస్తూ పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని కోరారు.ఈ సదస్సులో మండల అభివృద్ధి అధికారి ప్రవీణ్ కుమార్, మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, వివిధ శాఖల మండల, గ్రామ స్థాయి అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, ఉద్యానవన విస్తరణ అధికారులు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# ఇంద్రారెడ్డి నగర్‌లో పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్ : 57 వాహనాలు సీజ్

**శంకర్ పల్లి వెలుతురు, జులై 24 :**

శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఇంద్రారెడ్డి నగర్‌లో శుక్రవారం తెల్లవారుజామున పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. చేవెళ్ల ఏసీపీ కిషన్ ఆధ్వర్యంలో ఉదయం 5:30 గంటల నుంచి ఉదయం 7:00 గంటల వరకు ఈ కార్డన్ అండ్ సెర్చ్ ప్రోగ్రాం నిర్వహించారు.ఈ తనిఖీల్లో భాగంగా కాలనీలోని ప్రతి ఇల్లాన్ని, అనుమానాస్పద వ్యక్తులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని 52 ద్విచక్ర వాహనాలను, 5 ఆటోలను పోలీసులు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఈ సందర్భంగా అధికారులు హెచ్చరించారు.ఈ భారీ తనిఖీ కార్యక్రమంలో శంకర్పల్లి సీఐ శ్రీనివాస్ రెడ్డి, ఎస్సైలు సురేష్ గౌడ్, సాయి కృష్ణ, పద్మతో పాటు పెద్ద సంఖ్యలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# ఐసీఎఫ్ఏఐ లా స్కూల్‌లో ఘనంగా ముగిసిన 'దీక్షారంభ్–2026'

- **రెండు వారాల ఓరియంటేషన్‌తో నూతన విద్యార్థులకు న్యాయ విద్యలో బలమైన పునాది**

**శంకర్ పల్లి, వెలుతురు జూలై 24 :**







ఐఎఫ్‌హెచ్‌ఈ హైదరాబాద్‌కు చెందిన ఐసీఎఫ్ఏఐ లా స్కూల్‌లో నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థుల కోసం జూలై 13 నుంచి 24 వరకు నిర్వహించిన రెండు వారాల సమగ్ర ఓరియంటేషన్ కార్యక్రమం 'దీక్షారంభ్–2026' శుక్రవారం విజయవంతంగా ముగిసింది. న్యాయ విద్యలో విద్యార్థులకు బలమైన పునాది వేయడంతో పాటు విశ్వవిద్యాలయ విద్యా విధానం, వృత్తిపరమైన నైతిక విలువలు, పరిశోధనా సంస్కృతి, కెరీర్ అవకాశాలు, విద్యార్థి సహాయ వ్యవస్థలపై సమగ్ర అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా నిర్వహించారు.రెండు వారాల పాటు నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు అకాడమిక్ ఉపన్యాసాలు, నిపుణుల ప్రసంగాలు, పరస్పర చర్చా కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రముఖ విద్యావేత్తలు, న్యాయ నిపుణులు, సీనియర్ న్యాయవాదులు, పోలీసు అధికారులు, పరిశ్రమల ప్రతినిధులు, విశ్వవిద్యాలయ అధికారులు పాల్గొని రాజ్యాంగ విలువలు, సమకాలీన న్యాయ అంశాలు, నాయకత్వ లక్షణాలు, వృత్తిపరమైన బాధ్యతలు, పర్యావరణ పరిరక్షణ, మానసిక ఆరోగ్యం, మాదకద్రవ్యాల నిర్మూలన, కెరీర్ ప్రణాళిక వంటి అంశాలపై విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు.అలాగే అకాడమిక్ నిబంధనలు, పరీక్షా విధానం, గ్రంథాలయ వనరులు, మూట్ కోర్ట్ కార్యకలాపాలు, లీగల్ ఎయిడ్ కార్యక్రమాలు, విద్యార్థి క్లబ్‌లు, సంఘాలు, క్యాంపస్‌లో అందుబాటులో ఉన్న విద్యా అవకాశాలపై సమగ్ర అవగాహన కల్పించారు.జూలై 24న నిర్వహించిన వాలెడిక్టరీ కార్యక్రమంలో ఐఎఫ్‌హెచ్‌ఈ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ (డా.) ఎస్. విజయలక్ష్మి మాట్లాడుతూ, క్రమశిక్షణ, నిబద్ధత, నైతిక విలువలు, విద్యా ప్రతిభ విజయవంతమైన న్యాయవాదికి మూలస్తంభాలని పేర్కొన్నారు. నిరంతర అభ్యాసం, విమర్శనాత్మక ఆలోచనతో పాటు అకాడమిక్, సహపాఠ్య కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని విద్యార్థులకు సూచించారు.ఐసీఎఫ్ఏఐ లా స్కూల్ డైరెక్టర్ ప్రొఫెసర్ (డా.) పి. రవిశేఖరరాజు మాట్లాడుతూ, న్యాయ విజ్ఞానంతో పాటు సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధనా నైపుణ్యాలు, సామాజిక బాధ్యత, వృత్తిపరమైన నిబద్ధత నేటి న్యాయవాదులకు అత్యంత అవసరమని అన్నారు. సంస్థలోని అత్యుత్తమ అధ్యాపక బృందం, ఆధునిక మౌలిక సదుపాయాలు, అనుభవాత్మక విద్యా అవకాశాలను పూర్తిగా వినియోగించుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.అసిస్టెంట్ డీన్ డా. ఎ. అరుణ్ కుమార్ మాట్లాడుతూ, ఈ ఓరియంటేషన్ కార్యక్రమం విద్యార్థులు విశ్వవిద్యాలయ జీవనానికి సులభంగా అలవాటు పడేలా ప్రత్యేకంగా రూపొందించినట్లు తెలిపారు. సంస్థలో లభించే ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ క్రమశిక్షణ, జిజ్ఞాస, చొరవతో ముందుకు సాగాలని సూచించారు.అకాడమిక్ కోఆర్డినేటర్ మిస్ అన్వేష పాణిగ్రాహి వోటు ఆఫ్ థ్యాంక్స్ తెలియజేస్తూ కార్యక్రమ విజయానికి సహకరించిన యాజమాన్యం, అధ్యాపకులు, వనరుల వ్యక్తులు, సిబ్బంది, విద్యార్థి వాలంటీర్లకు కృతజ్ఞతలు తెలిపారు.రెండు వారాల పాటు నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు న్యాయ విద్య, సంస్థ సంస్కృతి, అకాడమిక్ విధానాలు, పరిశోధనా అవకాశాలు, వృత్తిపరమైన నైతిక విలువలు, న్యాయ రంగంలోని కెరీర్ అవకాశాలపై సమగ్ర అవగాహన పొందారు. జాతీయ గీతాలాపనతో కార్యక్రమం ముగియగా, 'దీక్షారంభ్–2026' నూతన విద్యార్థుల న్యాయ విద్యా ప్రస్థానానికి శుభారంభంగా నిలిచింది.

# హైదరాబాద్ అభివృద్ధిలో కేటీఆర్ పాత్ర అనన్యం

- **బద్దం శశిధర్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి**

**శంకర్ పల్లి, వెలుతురు జులై 24 :**







భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మాజీ ఐటీ, మున్సిపల్ శాఖల మంత్రి కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) జన్మదిన వేడుకలు శంకర్ పల్లి మండల, మున్సిపాలిటీ పరిధిలో అత్యంత వైభవంగా జరిగాయి. శంకర్ పల్లి పట్టణంలోని స్థానిక ఇంద్రారెడ్డి ప్రధాన కూడలిలో బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు బద్దం శశిధర్ రెడ్డి, మండల అధ్యక్షుడు గండిచెర్ల గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు, నాయకులు పెద్ద ఎత్తున ఈ సంబురాల్లో పాల్గొన్నారు. కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని అక్కడ ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను నాయకులు కట్ చేసి, ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు బద్దం శశిధర్ రెడ్డి, మండల అధ్యక్షుడు గండిచెర్ల గోవర్ధన్ రెడ్డిలు మాట్లాడుతూ.. కేటీఆర్ తన అద్భుతమైన నాయకత్వ పటిమతో, విజన్‌తో హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ పటంలో ఒక గొప్ప నగరంగా తీర్చిదిద్దారని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం ప్రపంచవ్యాప్తంగా ఉన్న అనేక ప్రతిష్టాత్మక ఐటీ, బహుళజాతి పరిశ్రమలను రాష్ట్రానికి తీసుకురావడంలో ఆయన ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు. ఐటీ, మున్సిపల్ శాఖల మంత్రిగా ఆయన అందించిన సేవలు ఎప్పటికీ మరువలేవని, భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, కేటీఆర్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శంకర్పల్లి మున్సిపాలిటీలో ఓటరు సర్వే ప్రక్రియను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్, కాంగ్రెస్ నాయకులు

**శంకర్పల్లి, వెలుతురు జూలై 24 :**



శంకర్పల్లి మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో శరవేగంగా సాగుతున్న ఓటరు సర్వే ప్రక్రియను మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ గోపాల్ రెడ్డి శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మున్సిపాలిటీలోని 1, 9, 10వ వార్డుల పరిధిలోని సింగాపురంలో గల బూత్ నెంబర్లు 54, 55, 56లలో జరుగుతున్న ఓటరు నమోదు, సవరణల సర్వే ప్రక్రియను వారు నిశితంగా గమనించారు.ఈ సందర్భంగా వారు బూత్ లెవెల్ అధికారులతో మాట్లాడి సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా, జాబితాలో ఎలాంటి తప్పులు దొర్లకుండా పారదర్శకంగా సర్వే నిర్వహించాలని అధికారులకు సూచించారు. వార్డుల్లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శ్వేత పాండురంగారెడ్డి, శంకర్పల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చంద్రమౌళి, స్థానిక కౌన్సిలర్లు ఆనంద్, గణేష్, గిరిజ శేఖర్, బి ఎల్ వో లు నాగేష్, పద్మారావు, హరీశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. వీరితో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాలకృష్ణ, పలువురు వార్డు ముఖ్య నాయకులు, బీఎల్ఓలు, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

# శంకర్ పల్లిలో విద్యాసంస్థల బంద్ విజయవంతం

- **కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దిష్టిబొమ్మ దహనం**

**శంకర్ పల్లి, వెలుతురు జూలై 24 :**




ఎన్ ఎస్ యూ ఐ రాష్ట్ర నాయకత్వం పిలుపులో భాగంగా శుక్రవారం శంకర్ పల్లి మండల కేంద్రంలో విద్యాసంస్థల బంద్ ప్రశాంతంగా, విజయవంతంగా ముగిసింది. ఎన్ ఎస్ యూ ఐ రాష్ట్ర అధ్యక్షులు వెంకట్ స్వామి, రాష్ట్ర కార్యదర్శి కరుణాకర్ గౌడ్, సంయుక్త కార్యదర్శి సుమన్, రాష్ట్ర లీగల్ సెల్ మెంబర్ అఖిల్ రెడ్డిల ఆదేశాల మేరకు ఈ నిరసన కార్యక్రమాలను చేపట్టారు.ఈ సందర్భంగా శంకర్ పల్లిలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలను ఎన్ ఎస్ యూ ఐ నాయకులు మూసివేయించారు. అనంతరం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వైఖరికి నిరసనగా ఆయన దిష్టిబొమ్మను రోడ్డుపై దహనం చేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలను నిరసిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

## నాయకుల ఆధ్వర్యంలో ఉధృత నిరసన

ఈ కార్యక్రమం ఎన్ ఎస్ యూ ఐ నియోజకవర్గ, మండల నాయకులు శివ గౌడ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా శివ గౌడ్ మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్న కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యావ్యవస్థలో జరుగుతున్న అక్రమాలను అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మండిపడ్డారు.ఈ నిరసన, దిష్టిబొమ్మ దహన కార్యక్రమంలో ఎన్ ఎస్ యూ ఐ ప్రతినిధులు కిషోర్, అస్లాంలతో పాటు యూత్ కాంగ్రెస్ శంకర్ పల్లి మండల అధ్యక్షులు ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు శివ, ఫయాజ్, సుయాన్, సమీర్, ముసద్దిక్, ఓస్, సోహాన్, వహీద్, ముసబ్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని బంద్‌ను విజయవంతం చేశారు.





## కేటీఆర్ జన్మదినం సందర్భంగా మొక్కలు నాటి శుభాకాంక్షలు తెలిపిన చిరుమర్తి మనోజ్

**నార్కట్ పల్లి వెలుతురు జూలై 24:**



తెలంగాణ రాష్ట్ర బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల శాసనసభ్యులు కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) జన్మదినాన్ని పురస్కరించుకుని నార్కెట్‌పల్లి మండలం బ్రాహ్మణవెల్లెంల గ్రామంలోని ఉదయసముద్రం వద్ద ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా చిరుమర్తి చేయూత ఫౌండేషన్ చైర్మన్ చిరుమర్తి మనోజ్ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను చాటుతూ, కేటీఆర్ చిత్రపటం ఎదుట కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో చౌడంపల్లి సర్పంచ్ గంటా స్వాతి–వెంకట్ రెడ్డి, బ్రాహ్మణవెల్లెంల గ్రామ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు పలువురు అభిమానులు పాల్గొన్నారు. కేటీఆర్ ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.

## అంగన్వాడీ కేంద్రంలో అన్నప్రాసన కార్యక్రమం

**గుండాల జులై 24: (వెలుతురు):**



యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం గంగాపురం గ్రామ అంగన్వాడీ కేంద్రంలో అన్నప్రాసన కార్యక్రమం, పిల్లలకు దుస్తుల పంపిణీ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ కాళీ మంజుల మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్వాడీ కేంద్రానికి పంపించాలని సూచించారు.ప్రభుత్వం అందిస్తున్న పోషకాహార పథకాలను గర్భిణీలు,బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.అంగన్వాడీ ద్వారా గర్భిణీలు,బాలింతలకు పోషకాహారం అందించడంతో పాటు చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ సిహెచ్ లక్ష్మి ,ఆశ వర్కర్ ఫరీదా, ,ఆయా చినూరి సత్తమ్మ, తల్లులు కవిత ,రేఖ ,స్వప్న వెన్నెల ,రేవతి, గ్రామస్తులు ,గర్భిణీలు,బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

## రామన్నపేట మండల కేంద్రంలో కేటీఆర్ జన్మదిన వేడుకలు

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూలై 24:**



మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు మాజీ ఐటీ శాఖ మంత్రి శ్రీ కల్వకుంట్ల తారక రామారావు జన్మదిన సందర్భంగా మండల కేంద్రంలోని సుభాష్ సెంటర్ వద్ద కేక్ కట్ చేసి50 వ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. భగవంతుని దయతో ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని నిండు నూరేళ్లు ఆరోగ్యంగా ఉండాలని భగవంతుని వేడుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బందెల రాములు మాజీ మండల పార్టీ అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం ఇంద్రపాలానగరం సిరిపురం సర్పంచులు గర్దాస్ విక్రమ్ అంబటి ఉపేంద్ర రవీందర్ రెడ్డి మాజీ సర్పంచులు ఎంపీటీసీలు రేఖ యాదయ్య బందెల యాదయ్య, ఎండి అమీర్. జిల్లా నాయకులు కన్నెబోయిన బలరాం ఎస్కే చాందు పట్టణ కార్యదర్శి జాడ సంతోష్ నాయకులు కూనూరు ముత్తయ్య, మిర్యాల మల్లేశం, బాలగోని నరసింహ, బొడ్డు అల్లయ్య, లవణం రాము, రవ్వ నరసింహ, ఆవుల నరేందర్, జెట్టి శివప్రసాద్, మామిళ్ళ కుమార్, బుర్ర శ్రీశైలం, నల్ల సైదులు, గాదె శంకర్, కట్ట భాను శ్రీ, రాస వెంకటేశ్వర్లు, మోటి రవీందర్, గర్దాస్ కరుణాకర్, ఎండి అజాజ్ ఖాన్, లవణం ఉపేందర్, నక్క శంకరయ్య, లింగారావు, బొడ్డుపల్లి రాజు, చిప్పలపల్లి రవి, నోముల లింగస్వామి, బాసాని రాజు, బీరం రాజిరెడ్డి ,మేడబోయిన మహేష్, గట్టు రాములు, సంగిశెట్టి శివ, రేమిడాల వెంకన్న, వంగాల సాయి, సంఘీ ఐలయ్య, కొమ్మనగోని రమేష్, మోటే నరేష్, గంగాదేవి, జంగయ్య, నోముల పెద్ద శంకర్, ఏషబోయిన బిక్షం, కోసనీ అంజయ్య, గట్టు సోములు, రాము, అంజయ్య, వెంకన్న తదితరులు పాల్గొనడం జరిగింది.

## నూతనకల్ లో ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

- **రోగులకు పండ్లు పంపిణీ చేసిన బిఆర్ఎస్ శ్రేణులు**


**నూతనకల్ జూలై24( వెలుతురు):**



తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే డా.గాదరి కిషోర్ కుమార్ ఆదేశానుసారం నూతనకల్ లో బిఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నూతనకల్ ప్రభుత్వ హాస్పిటల్ లో రోగులకు పండ్లు పంపిణి చేశారు ఈ సందర్భంగా బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మున్న మల్లయ్య యాదవ్ మాట్లాడుతూ 2029 లో జరగబోయే సార్వత్రిక ఎన్నికలలో రాష్ట్రంలో అత్యధిక ఎమ్మెల్యే స్థానాలు గెలుచుకొని బిఆర్ఎస్ పార్టీ అధికారం చేపట్టబోతుందని అన్నారు కెసిఆర్ ను మళ్లీ సీఎంగా రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ చైర్మన్ కనకటి వెంకన్న, మండల ప్రధాన కార్యదర్శి సాయిలు గౌడ్, బిఆర్ఎస్ సర్పంచ్ లు మహేశ్వరం మల్లికార్జున్ గాడుదుల లింగరాజు యాదవ్ గుగులోతు కోటేష్ నాయక్ జటంగి సరిత కృష్ణ యాదవ్ బిఆర్ఎస్ నాయకులు సూడి లింగారెడ్డి రేసు వెంకటేశ్వర్లు బత్తుల విద్యాసాగర్ కనకటి మహేష్ గౌడ్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రుద్రవరం యాదగిరి నియామకం

**నార్కట్ పల్లి వెలుతురు జూలై 24:**



చిట్యాల మున్సిపాలిటీ పరిధిలోని శివనేనిగూడెం గ్రామానికి చెందిన రుద్రవరం యాదగిరిని తెలంగాణ భూ సంరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బుగ్గ మైసయ్య నియమించారు.ఈ సందర్భంగా రుద్రవరం యాదగిరి మాట్లాడుతూ, తనపై నమ్మకంతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు బుగ్గ మైసయ్యతో పాటు రాష్ట్ర కమిటీ సభ్యులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.భవిష్యత్తులో సంఘం అభివృద్ధికి, ప్రభుత్వ అసైన్డ్ భూముల క్రమబద్ధీకరణకు, భూ సంరక్షణకు నిరంతరం కృషి చేస్తానని, తనకు అప్పగించిన బాధ్యతలను శక్తివంచన లేకుండా సమర్ధవంతంగా నిర్వర్తిస్తానని ఆయన పేర్కొన్నారు.రుద్రవరం యాదగిరి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా నల్లగొండ జిల్లా వ్యాప్తంగా పలు నియోజకవర్గాల్లో ఆయన అభిమానులు, సంఘం నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

## కల్లుగీత కార్మికుల హక్కులకై జరిగే గీతన్నల చైతన్య బస్సు యాత్రను జయప్రదం చేయండి

- **గాజుల ఆంజనేయులు కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు**

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూలై 24:**



కల్లుగీత కార్మిక సంఘం రామన్నపేట మండల కమిటీ సమావేశం కూనూరు మల్లేశం అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా గాజుల ఆంజనేయులు రాష్ట్ర కమిటీ సభ్యులు హాజరై ఆగస్టు 2 నుండి 18 వరకు మానుకోట నుండి ట్యాంక్ బండ్ వరకు కల్లుగీత అమరుల యాదిలో గీతన్నల చైతన్య బస్సు యాత్ర కొనసాగుతుందని ఆ దిశలో భాగంగా ఆగస్టు 9 ఆదివారం రామన్నపేటకు వస్తున్న బస్సు యాత్ర బృందానికి స్వాగతం పలుకుతూ జయప్రదం చేయాలని కోరుతూ బస్సు యాత్ర పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృత్తిలో ప్రమాదాలకు గురైన కార్మికులకు వెంటనే ఎక్స్‌గ్రేషియా విడుదల చేయాలని, కల్లుగీత వృత్తి రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక విధానాలు రూపొందించి నిధులు కేటాయించాలని, కల్లుగీత కార్మికులకు సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో అమలు చేయాలని, గీత కార్మికులకు ప్రభుత్వ బీమా కల్పించాలని, ప్రమాదంలో మరణించిన గీత కార్మికునికి 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, ఆసరా పెన్షన్ 4000, వికలాంగులు అయిన కార్మికునికి 6 వేల రూపాయలకు పెంచి పెన్షన్ ఇవ్వాలని, వృత్తి సామాగ్రి, భద్రత సామాగ్రి మరియు ద్విచక్రవాహనం ఉచితంగా ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎర్ర రవీందర్, జిల్లా సహాయ కార్యదర్శి బావండ్లపల్లి బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు కూనూరు మల్లేశం, మునికుంట్ల లెనిన్, మండల కమిటీ సభ్యులు పబ్బు సత్తయ్య, పబ్బు వెంకన్న, పబ్బు శేఖర్, గంగాదేవి అంజయ్య, పల్సం కనకయ్య, పల్లె సత్యం, పబ్బు స్వామి, కూనూరు మహేష్, బావండ్లపల్లి సత్యం, కూనూరు అంజయ్య, సుర్వి నవీన్, గోపగోని శంకరయ్య, గంగాపురం గోపాల్, గోపగోని వీరస్వామి, కమ్మగాని అశోక్, వీరమల్ల ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## మరిపడిగాలో సీసీ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం

- **ఉపాధి హామీ నిధులతో అభివృద్ధి పనులు ప్రారంభం**

**గుండాల, జూలై 24 (వెలుతురు):**



యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం మరిపడిగా గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధులతో మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ గుడెపు కుమార్ శుక్రవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సహకారంతో గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. గ్రామ ప్రజలకు మెరుగైన రహదారులు, పారిశుద్ధ్య సదుపాయాలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలను దశలవారీగా అమలు చేసి మరిపడిగాను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామాభివృద్ధికి ప్రజల సహకారం ఎంతో అవసరమని ఆయన అన్నారు.సీసీ రోడ్డు నిర్మాణంతో గ్రామంలో రాకపోకలు సులభతరం కావడంతో పాటు వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులు తొలగిపోతాయని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సొప్పరి సోమయ్య, వార్డు సభ్యులు అనంతల సోమయ్య, తేరాల కిష్టయ్య, గ్రామ శాఖ అధ్యక్షులు కొండబోయిన నరసింహ, అనంతల చంద్రశేఖర్, యాదండ్ల సత్తయ్య, పానుగంటి యాదయ్య, కొండబోయిన సోమన్న, ఇందిరాల ఉప్పలయ్య, బూడిద వెంకటయ్య, పానుగంటి యాదగిరి, గుడెపు రామచంద్రు, హరికృష్ణ, గంగాధర్, యాకన్నతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## నార్కట్‌పల్లిలో ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

**నార్కట్ పల్లి వెలుతురు జూలై 24:**



నార్కట్‌పల్లి పట్టణ కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) జన్మదిన వేడుకలను నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కేక్ కట్ చేసి కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పండ్లను పంపిణీ చేస్తూ తమ అభిమాన నాయకుడి పుట్టినరోజును ఉత్సాహభరితంగా జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు దోసపాటి విష్ణు మూర్తి, దూదిమెట్ల సత్తయ్య, మేకల రాజిరెడ్డి,చిరుమర్తి యాదయ్య, కొండూరు శంకర్,దుబ్బాక శ్రీధర్, బొబ్బలి దేవేందర్, నడింపల్లి నరేష్, మెడబొయిన రాంబాబు,పుల్లెంల మహేష్,దుబ్బా రవికుమార్, నడింపల్లి మహేష్, పుల్లెంల వెంకట్, బాజా హేమంత్, మంద సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం:ఏడి గోవిందయ్య

**మునుగోడు, జూలై 24 (వెలుతురు):**



ఇటీవల జరిగిన ఎన్నికల్లో నూతనంగా ఎన్నికైన మునుగోడు చేనేత సహకార సంఘం పాలకవర్గం శుక్రవారం అధ్యక్షుడు అవ్వారి భాస్కర్ ఆధ్వర్యంలో చేనేత శాఖ సహాయ సంచాలకుడు (ఏడి) గోవిందయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఏడి గోవిందయ్య మాట్లాడుతూ చేనేత కార్మికులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్మికులకు ఎదురయ్యే ఇబ్బందులు,సంఘం దృష్టికి వచ్చే సమస్యలను తనకు తెలియజేస్తే సంబంధిత అధికారులతో సమన్వయం చేసి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మునుగోడు చేనేత సహకార సంఘం ఉపాధ్యక్షురాలు మిరియాల సుభద్ర, కార్యదర్శి రావిరాల కుమార్, కోశాధికారి గంజి నరేందర్, డైరెక్టర్లు కర్నాటి రాజు, బొల్ల చంద్రకళ, చెరిపెల్లి యాదగిరి, మిరియాల మధుకర్, చిలుకూరి మధు, మాజీ అధ్యక్షుడు సంగిశెట్టి పరమేష్, మాజీ కుల సంఘం అధ్యక్షుడు గంజి బిక్షం తదితరులు పాల్గొన్నారు.

## నల్లగొండ జిల్లా బీజేపీ కార్యవర్గంలో పసునూరి సంపత్ కుమార్‌కు చోటు

**నార్కట్ పల్లి వెలుతురు జూలై 24:**



నల్లగొండ జిల్లా భారతీయ జనతా పార్టీ (బీజేపీ) జిల్లా కార్యవర్గ సభ్యుడిగా పసునూరి సంపత్ కుమార్ నియమితులయ్యారు.ఈ సందర్భంగా పసునూరి సంపత్ కుమార్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి ఈ కీలక బాధ్యతను అప్పగించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి, నాయకులు, కార్యకర్తల సమిష్టి సహకారంతో పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని, పార్టీని మరిన్ని శిఖరాలకు తీసుకెళ్లేందుకు శక్తివంచన లేకుండా పనిచేస్తానని పేర్కొన్నారు.అదేవిధంగా తనకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తున్న మండల పార్టీ నాయకులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ నియామకంపై పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ పసునూరి సంపత్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## నూతనకల్ లో బిఎల్‌వోల సమీక్ష సమావేశం

**నూతనకల్ జూలై 24 ( వెలుతురు )**

రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నూతనకల్ మండలంలో బూత్ లెవల్( బి ఎల్ ఓ ) అధికారులతో శుక్రవారం తహసిల్దార్ పి శ్రీనివాసరావు సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఎనుమరేషన్ ఫామ్స్ సకాలంలో సమర్పించడం, ఏ ఎస్ డి డి జాబితా పరిశీలన, డిఎస్ఈ ప్రాసెసింగ్ ఓటరు జాబితాలోని అసంగతులు పరిష్కారం అలాగే పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ అంశాలపై సమగ్రంగా చర్చించి సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు వారికి ఇవ్వడం జరిగింది.నిర్దేశించిన గడువులోపు పనులను పూర్తి చేసి ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా నాణ్యతతో విధులు నిర్వహించాలని తహసీల్దార్ శ్రీనివాస రావు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బిఎల్వో లు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



## ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



**మునుగోడు, జూలై 24 (వెలుతురు ):**

మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 50వ జన్మదిన వేడుకలను శుక్రవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్లో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మందుల సత్యం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రోగులకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.అనంతరం మందుల సత్యం మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధిలో కేటీఆర్ సేవలు కీలకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వేముల వీరేశంకు అభినందనలు తెలిపిన చలమల్ల కృష్ణారెడ్డి



**మునుగోడు,జూలై 24(వెలుతురు):**

నకిరేకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ వేముల వీరేశంకు క్యాబినెట్ మంత్రి హోదా లభించిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు చలమల్ల కృష్ణారెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధికి,ప్రజా సంక్షేమానికి మరింత మెరుగైన సేవలందించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు సురిగి నర్సింహా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మానూలో 2026—27 విద్యా సంవత్సర ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల

- **విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి...**
- **అసిస్టెంట్ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ మహ్మద్ మజహర్ ఖాద్రి...**

**జహీరాబాద్ వెలుతురు జూలై 24:**

మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ (MANUU) 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించి వివిధ అండర్ గ్రాడ్యుయేట్ (యూజీ), పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ), డిప్లొమా, సర్టిఫికేట్, బీఈడ్, ఎంబీఏ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసిందని అసిస్టెంట్ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ మహ్మద్ మజహర్ ఖాద్రి వెల్లడించారు. ఈ మేరకు జహీరాబాద్‌లోని ఇస్లామిక్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు విశ్వవిద్యాలయ ప్రతినిధులతో కలిసి పాల్గొని వివరాలు వెల్లడించారు.విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మానూలో ప్రవేశాలు పొందాలని వారు కోరారు. 2026 జూలై 8 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైనట్లు తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు నిర్ణీత గడువులోపు ఆన్‌లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఈ విద్యా సంవత్సరంలో ఉర్దూ, హిందీ, ఇంగ్లీష్, అరబిక్, చరిత్ర, ఇస్లామిక్ స్టడీస్, ఎంబీఏ, బీఈడ్, బీఏ (ఆనర్స్), బీకాం (ఆనర్స్), బీఎస్సీ (ఆనర్స్) వంటి పలు డిగ్రీ కోర్సులతో పాటు జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, టీచ్ ఇంగ్లీష్, ఎలిమెంటరీ ఎడ్యుకేషన్, స్కూల్ లీడర్‌షిప్, ఎంప్లాయబిలిటీ స్కిల్స్, ఉర్దూ, గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్, ఫంక్షనల్ ఇంగ్లీష్ వంటి డిప్లొమా, సర్టిఫికేట్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.బీఈడ్, ఎంబీఏ కోర్సులకు దరఖాస్తుల చివరి తేదీ ఆగస్టు 25, 2026 కాగా, ఇతర యూజీ, పీజీ, డిప్లొమా, సర్టిఫికేట్ కోర్సులకు సెప్టెంబర్ 10, 2026 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని వెల్లడించారు.ప్రవేశాలకు సంబంధించిన అర్హతలు, మార్గదర్శకాలు, దరఖాస్తు ప్రక్రియ వివరాలను యూనివర్సిటీ అధికారిక వెబ్‌సైట్ లేదా అడ్మిషన్





పోర్టల్‌లో తెలుసుకోవచ్చని తెలిపారు. గడువు తేదీకి ముందే దరఖాస్తులు సమర్పించి ఉన్నత విద్యకు లభించిన ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఆగష్టు 1 ఇందిరా పార్క్ వద్ద జరిగే మహాధర్నాను విజయవంతం చేయండి: తపస్

**మెదక్ టౌన్ వెలుతురు జూలై 24:**



ఆగస్టు 1న ఇందిరా పార్క్ వద్ద మహా ధర్నా పోస్టర్ ను ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాల మెదక్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తపస్ జిల్లా ఉపాధ్యక్షులు గడీల మాధవరెడ్డి, జిల్లా కోశాధికారి మంగ నర్సింలు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంకై తపస్ నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని, పెండింగ్ డిఏలను, జిపిఎఫ్ నిధులను విడుదల వెంటనే చేయాలని, పిఆర్సి ప్రకటించి,వ అమలు చేయాలని, జీఓ 317 బాధితులకు న్యాయం చేయాలని, సిపిఎస్ రద్దుచేసి ఓపిఎస్ విధానాన్ని అమలు, మోడల్ స్కూల్, సమగ్ర శిక్ష అభియాన్, గురుకుల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని వారన్నారు.ఈ కార్యక్రమంలో తపస్ మెదక్ మండల అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు మెరుగు నరేందర్, నాయిని సత్యనారాయణ, వెంకటేశం,ప్రశాంత, కమల, సంతోషిని,శ్రీవాణి, లావణ్య, రజిని, ప్రవళిక, మజార్, హేమలత తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి డివిజన్‌లో సమగ్ర అభివృద్ధే లక్ష్యం – నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

**కరీంనగర్ వెలుతురు జూలై 24:**



కరీంనగర్ నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు నగరపాలక సంస్థ కట్టుబడి పనిచేస్తోందని నగర మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్ అన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా ప్రతి డివిజన్‌లో అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు.ఈ నేపథ్యంలో కరీంనగర్ నగర పాలక సంస్థ 25వ డివిజన్ సుభాష్‌నగర్ లో మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు మరియు సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులకు మేయర్ శంకుస్థాపన చేశారు. అనంతరం 12వ డివిజన్ రామచంద్రపూర్ కాలనీ లో మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు మరియు తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన నిర్వహించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటికి శాశ్వత పరిష్కారం చూపే దిశగా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా సీసీ డ్రెయిన్ల నిర్మాణం, ప్రజలు సౌకర్యవంతంగా రాకపోకలు సాగించేలా నాణ్యమైన సీసీ రోడ్ల నిర్మాణం, ప్రతి ఇంటికి తాగునీరు అందేలా పైప్‌లైన్ వ్యవస్థను బలోపేతం చేయడం వంటి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు.ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు అనుగుణంగా కరీంనగర్ నగరంలోనూ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. నగర అభివృద్ధిలో ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమని, చేపట్టిన పనులను సంరక్షిస్తూ పరిశుభ్రమైన పరిసరాలను కాపాడాలని పిలుపునిచ్చారు.అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టి నిర్ణీత గడువులో పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మేయర్ ఆదేశించారు. నగరంలోని ప్రతి డివిజన్‌లో ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి పనులు కూడా దశలవారీగా చేపడతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, 25వ డివిజన్ కార్పొరేటర్ గంట శ్రీనివాస్, 12వ డివిజన్ కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ, మున్సిపల్ అధికారులు, బీజేపీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీవాసులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జంతర్‌మంతర్ లాఠీచార్జ్‌కు నిరసనగా జహీరాబాద్‌లో ఎస్ఎఫ్ఐ–డివైఎఫ్ఐ ర్యాలీ

**జహీరాబాద్ వెలుతురు జూలై 24:**















ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నీట్ (NEET) పేపర్ లీకేజీ వ్యవహారంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టిన విద్యార్థులు, యువజనులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని నిరసిస్తూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ), డివైఎఫ్ఐ జహీరాబాద్ డివిజన్ కమిటీల ఆధ్వర్యంలో శుక్రవారం జహీరాబాద్‌లో భారీ ర్యాలీ నిర్వహించారు.ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి చేపట్టిన ఈ ర్యాలీలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు టీ. రాజేష్, డివిజన్ కార్యదర్శి శ్రీకాంత్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలకు కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుండా, శాంతియుతంగా ఆందోళన చేస్తున్న వారిపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని తీవ్రంగా ఖండించారు. విద్యా వ్యవస్థలో పారదర్శకతను కాపాడాల్సిన కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల స్వరాన్ని అణచివేసే ప్రయత్నం చేయడం సరైన విధానం కాదన్నారు.నీట్ పేపర్ లీకేజీ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉద్యమాలు కొనసాగుతాయని, ప్రజాస్వామ్యబద్ధమైన పోరాటాలను అణచివేస్తే మరింత ఉధృతంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో నాయకులు రిషి, సాయి గౌడ్, అభి, విష్ణువర్ధన్, బన్నీతో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# రాజకీయ లబ్ధి కోసమే కాంగ్రెస్ ఆందోళనలు: పైడిపెల్లి పృథ్వీరాజ్ గౌడ్

**కరీంనగర్ వెలుతురు జూలై 24:**



పార్లమెంట్‌లో ప్రశ్నోత్తరాల సమయంలో నిద్రించిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, బయట ప్రజా సమస్యల పేరుతో నిరసనలు చేపట్టడం విడ్డూరంగా ఉందని బీజేపీ సిద్ధిపేట జిల్లా కార్యదర్శి పైడిపెల్లి పృథ్వీరాజ్ గౌడ్ విమర్శించారు. భీమదేవరపల్లిలో కాంగ్రెస్ పార్టీ, తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనలు పూర్తిగా రాజకీయ ప్రేరేపితమైనవేనని ఆయన ఆరోపించారు. పరీక్షల ప్రక్రియ ముగిసి నెలలు గడిచిన తర్వాత ఆ అంశాన్ని మళ్లీ తెరపైకి తీసుకురావడం వెనుక కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని రాజకీయంగా ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశమే ఉందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంపై చిత్తశుద్ధి ఉంటే పార్లమెంట్‌లోనే వాటిని ప్రస్తావించి పోరాడాలని, సభలో బాధ్యత విస్మరించి బయట నిరసనలకు దిగడం కాంగ్రెస్ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. ప్రజల దృష్టిని అసలు సమస్యల నుంచి మళ్లించి రాజకీయ లబ్ధి పొందడమే కాంగ్రెస్ లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు. తెలంగాణ ఉద్యమం గురించి కాంగ్రెస్ నాయకులు మాట్లాడడం హాస్యాస్పదమని, ఉద్యమ చరిత్రను ప్రజలు ఇంకా మరచిపోలేదన్నారు. దేశాన్ని దశాబ్దాల పాటు పాలించిన కాంగ్రెస్ హయాంలో అవినీతి, కుంభకోణాలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, ఇప్పుడు అసత్య ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. అభివృద్ధి, పారదర్శక పాలన, ప్రజా సంక్షేమమే బీజేపీ లక్ష్యమని, వాస్తవాలను ప్రజలు గుర్తించి తగిన సమయంలో సరైన తీర్పు ఇస్తారని పైడిపెల్లి పృథ్వీరాజ్ గౌడ్ పేర్కొన్నారు.

# రెగ్యులర్ కమిషనర్‌ను వెంటనే నియమించాలి

- **మొక్కలు నాటి వినూత్నంగా నిరసన తెలిపిన వైద్య విధాన పరిషత్ ఉద్యోగులు...**

**జహీరాబాద్ వెలుతురు జూలై 24:**





వైద్య విధాన పరిషత్ (డీఎస్‌హెచ్ఎస్‌గా మారనున్న సంస్థ)కు రెగ్యులర్ కమిషనర్‌ను వెంటనే నియమించాలని కోరుతూ సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది వినూత్నంగా నిరసన తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వైద్య విధాన పరిషత్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు "మొక్కలు నాటుదాం.. మనవి చేద్దాం" కార్యక్రమాన్ని నిర్వహించి ప్రభుత్వానికి తమ సమస్యలను తెలియజేశారు.ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ.. దాదాపు రెండు నెలలుగా కమిషనర్ పదవి ఖాళీగా ఉండటంతో వైద్యశాలల పరిపాలన, పర్యవేక్షణ సక్రమంగా జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 185 ఆస్పత్రులు, నాలుగు వేల మంది సిబ్బందితో ప్రజలకు కీలక వైద్య సేవలు అందిస్తున్న వైద్య విధాన పరిషత్‌లో రెగ్యులర్ కమిషనర్ లేకపోవడం వల్ల వైద్యులు, నర్సులు, పారామెడికల్, మినిస్టీరియల్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వ్యక్తిగత, సర్వీస్ సంబంధిత సమస్యలు పేరుకుపోయాయని తెలిపారు.ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ స్పందన లేకపోవడంతో పర్యావరణ పరిరక్షణకు ప్రతీకగా మొక్కలు నాటి, తమ సమస్యల పరిష్కారానికి కమిషనర్ నియామకం అవసరమని వినూత్నంగా విజ్ఞప్తి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందించే శాఖలో పనిచేస్తున్నందున రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేయకుండా, సేవలకు అంతరాయం కలగకుండా ఈ విధంగా తమ నిరసనను వ్యక్తం చేస్తున్నామని తెలిపారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వైద్య విధాన పరిషత్‌కు వెంటనే రెగ్యులర్ కమిషనర్‌ను నియమించి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె. కిరణ్ కుమార్, చీఫ్ ఫార్మసీ ఆఫీసర్ వై. మహేష్, సీనియర్ ఫార్మసీ ఆఫీసర్ వెంకటేశం, ఫార్మసీ ఆఫీసర్లు ఎన్. కుమారస్వామి, ఎం. విక్రమ్, ఎం. శ్రీనివాస్, టి. రాజేశ్వరి, నర్సింగ్ సూపరింటెండెంట్ సునంద, హెడ్ నర్స్ వినోద కుమారి, ఎం. లలిత, డి. నిర్మలమ్మతో పాటు వైద్యులు, నర్సింగ్, పారామెడికల్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో ఘనంగా వినాయక చవితి వేడుకల నిర్వహణ కోసం నగరపాలక సంస్థ ప్రత్యేక ప్రణాళిక... విస్తృత ఏర్పాట్లు

- **మేయర్ కోలగాని శ్రీనివాస్ ఆదేశాలతో ఏర్పాట్లకు సమాయత్తమవుతున్న నగరపాలక సంస్థ...**
- **నగరంలోని అన్ని వినాయక మండపాలకు బల్దియా ఆధ్వర్యంలో ఉచిత విద్యుత్...**
- **నగరపాలక సంస్థ అధికారులకు వినాయక చవితి ఏర్పాట్లపై దిశా నిర్దేశం చేసిన మేయర్ కోలగాని శ్రీనివాస్**

కరీంనగర్లో ఇటీవల ఘనంగా ముగిసిన బోనాల మహోత్సవాల విజయవంతమైన ఊపుతో, రానున్న వినాయక చవితి ఉత్సవాలను నగర చరిత్రలోనే అత్యంత వైభవంగా నిర్వహించేందుకు నగర పాలక సంస్థ సమగ్ర కార్యాచరణను సిద్ధం చేసింది. నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ఆదేశాల మేరకు అన్ని శాఖల సమన్వయంతో ప్రత్యేక ఏర్పాట్లకు అధికారులు శ్రీకారం చుట్టారు. ఈమేరకు శుక్రవారం రోజున వినాయక చవితి ఏర్పాట్లపై మేయర్ కోలగాని శ్రీనివాస్ దిశా నిర్దేశం చేశారు. నగరపాలక సంస్థ అధికారులతో సమావేశం మేయర్ కోలగాని శ్రీనివాస్ సమావేశం నిర్వహించి వినాయక నవరాత్రి ఉత్సవాల కోసం చేపట్టాల్సిన పనులు , తీసుకోవాల్సిన చర్యల కోసం ఆదేశాలు ఇచ్చారు. ప్రధానంగా వినాయక మండపాలకు వెళ్లే ప్రధాన రహదారుల్లో గుంతలను పూడ్చడం, అవసరమైన చోట్ల రోడ్డు ప్యాచ్‌వర్క్‌లు చేపట్టడం, పారిశుధ్యాన్ని మెరుగు పరచడం, తాగునీటి సౌకర్యాలు కల్పించడం వంటి పనులను ఉత్సవాలకు ముందే పూర్తి చేయనున్నారు.

**వినాయక మంటపాలకు ఉచిత విద్యుత్ సౌకర్యం.**

నగరంలోని అన్ని వినాయక మండపాలకు అవసరమైన విద్యుత్ సౌకర్యం కల్పించే అంశంపై టీజీ ఎన్ పీడీసీఎల్ అధికారులతో చర్చించి తుది నిర్ణయం తీసుకోనున్నారు. మండపాలకు సంబంధించిన విద్యుత్ బిల్లులను నగర పాలక సంస్థ నిధుల ద్వారా చెల్లించే దిశగా చర్యలు చేపట్టాలని నిర్ణయించారు.

**టవర్ సర్కిల్ సుందరీకరణ:**

వినాయక నిమజ్జనం సందర్భంగా నగరంలోని టవర్ సర్కిల్‌ను ప్రత్యేక విద్యుత్ దీపాలంకరణలు, ఆకర్షణీయమైన డెకరేషన్లతో సుందరీకరించి భక్తులకు కనువిందు చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

**అధికారుల సమన్వయం:**

ఉత్సవాలను ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు టీజీ ఎన్ పీడీసీఎల్ అధికారులు, మున్సిపల్ అధికారులు, పారిశుధ్య విభాగం , ఇతర సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశాలు




నిర్వహించి బాధ్యతలను కేటాయించారు. ఈ కార్యక్రమాలకు అవసరమైన వ్యయాన్ని మున్సిపల్ నిధుల నుంచి కేటాయించనున్నారు.

**నగరంలో వినాయక నవరాత్రి ఉత్సవాలను కన్నుల పండుగగా జరిగేలా చూస్తాం... నగర మేయర్ కొలగాని శ్రీనివాస్**

**కరీంనగర్ వెలుతురు జూలై 24:**

"ప్రజల భాగస్వామ్యం, అన్ని శాఖల సమన్వయంతో కరీంనగర్‌లో వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, కన్నుల పండుగ ఆదర్శవంతంగా నిర్వహించ డానికి తగిన ఏర్పాట్లు , చర్యలు చేపడుతున్నట్లు మేయర్ కోలగాని శ్రీనివాస్ తెలిపారు. త్వరలో జరగబోయే వినాయక నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం నగరపాలక



కార్యాలయంలో మేయర్ కొలగాని శ్రీనివాస్ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కంటే భిన్నంగా ఈసారి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలనే సంకల్పంతో నగర పాలక సంస్థ ఉందని తెలిపారు. నగరంలోని అన్ని ప్రాంతాల వినాయక మండపాల నిర్వాహకుల విజ్ఞప్తుల ను పరిశీలించి మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన పనులపై అధికారులకు తగిన ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. ముఖ్యంగా నగరంలోఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా , భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

# హైదరాబాద్‌లో కాంగ్రెస్ నిరసన ర్యాలీ ఉద్రిక్తం

- కేంద్ర మంత్రి దిష్టిబొమ్మ దహనానికి యత్నం
- రాహుల్ గాంధీపై దాడి, విద్యార్థుల అరెస్టులను ఖండించిన నేతలు
- హిమాయత్‌నగర్ నుంచి హైదర్‌గూడ వరకు భారీ ర్యాలీ నిర్వహణ

**హైదరాబాద్ వెలుతురు జూలై 24:**



దేశ రాజధాని ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై జరిగిన దాడితో పాటు, శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసులు చేసిన లాఠీ ఛార్జీ, అరెస్టులను ఖండిస్తూ హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన నిరసన ర్యాలీ తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. పార్టీ సీనియర్ నేత వినోద్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున రోడ్డుపైకి వచ్చి తమ నిరసనను తెలిపారు. హిమాయత్‌నగర్ కూడలి మరియు వై జంక్షన్ నుంచి ప్రారంభమైన ఈ నిరసన ర్యాలీ హైదర్‌గూడలోని ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్ వరకు కొనసాగింది.ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నేత వినోద్ రెడ్డి మాట్లాడుతూ.. నీట్ (NEET) పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా సుమారు 22 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు మరియు జీవితాలతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడుతోందని ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. విద్యార్థులకు సంబంధించిన ప్రశ్నాపత్రాలను కూడా భద్రంగా కాపాడలేని నాయకులు, ఇక ఈ దేశాన్ని ఎలా కాపాడుతారని ఆయన నిలదీశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిచి విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను పరిగణనలోకి తీసుకోవాలని, ధర్మేంద్ర ప్రధాన్‌తో రాజీనామా చేయించాలని పట్టుబట్టారు.ర్యాలీ హైదర్‌గూడ వద్దకు చేరుకోగానే కేంద్ర విద్యాశాఖ మంత్రి దిష్టిబొమ్మను దహనం చేసేందుకు కాంగ్రెస్ నాయకులు యత్నించారు. అయితే పోలీసులు వెంటనే రంగంలోకి దిగి దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకోవడంతో ఒక్కసారిగా పరిస్థితులు వేడెక్కాయి. పోలీసులు మరియు కాంగ్రెస్ నాయకుల మధ్య తీవ్ర తోపులాట జరగడంతో ఆ ప్రాంతంలో కొద్దిసేపు తీవ్ర ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది.

# మంచాల మండలం సర్పంచ్ ల ఫోరం ఎన్నిక

- సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడిగా మంచాల రవి ప్రధానకార్యదర్శిగా నేనావత్ బాలకృష్ణ

**మంచాల వెలుతురు జులై 24:**



మంచాల మండలం సర్పంచ్ ఫోరం మండల కార్యవర్గాన్ని మంచాల మండల కేంద్రంలో సర్పం చ్ లసమావేశం నిర్వహించిఏకగ్రీవంగాఎన్నుకున్నారు అధ్యక్షుడిగా జపాలగ్రామ సర్పంచ్ మం చాల రవి ప్రధాన కార్యదర్శిగా రంగాపూర్ గ్రామసర్పంచ్ నేనావత్ బాలకృష్ణ ఉపాధ్యక్షులుగా బండలేమూర్ గ్రామసర్పంచ్ పాత్లోతు శ్రీనివాస్ నాయక్ కార్యదర్శిగా లోయపల్లి గ్రామసర్పంచ్ ఆంగోత్ రఘురాంనాయక్ సహాయకార్యదర్శిగా ఆంగోతుతండా సర్పంచ్ ఆంగోత్ రాణి శ్రీనివాస్ నాయక్ కోశాధికారిగా నోముల గ్రామసర్పంచ్ బత్తుల శృతి కరుణాకర్ రెడ్డి కార్యవర్గ సభ్యులు గా వివిధ గ్రామాల సర్పంచ్ లు ఎన్నిక అయ్యారుఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు మంచాల రవి ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ నాయక్ మాట్లాడుతూ సర్పంచ్ ల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తాం అని అన్నారు కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పం చ్ లు పాల్గొన్నారు.

# సంకల్ప్(sankalp) ప్రాజెక్టుపై కోఆర్డినేషన్ మీటింగ్

- జిల్లాలో నవజాత శిశు మరణాల రేటు (Neonatal Mortality Rate) ను సింగిల్ డిజిట్ స్థాయికి తగ్గించడమే లక్ష్యం.
- డా: పుట్ల శ్రీనివాస్
- జిల్లా వైద్య & ఆరోగ్యశాఖ అధికారి, హైదరాబాద్ జిల్లా.

**హైదరాబాద్ వెలుతురు జూలై 24:**

శుక్రవారం రోజున నీలోఫర్ హాస్పిటల్ నాట్కో బిల్డింగ్ ఆడిటోరియంలో సంకల్ప్ ప్రాజెక్టు సమావేశం జరిగింది.ఈ సమావేశంలో హైదరాబాద్ జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ సూపరిటెండెంట్స్, గైనకాలజిస్ట్ లు, పీడియాట్రిషన్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డా. పుట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ సూపరిటెండెంట్స్, గైనకాలజిస్టు్ల, పీడియాట్రిషన్లు సమన్వయంతో జిల్లాలో నవజాత శిశు మరణాల రేటు (Neonatal Mortality Rate ) ను సింగిల్ డిజిట్ స్థాయికి తీసుకురావాలానే లక్ష్యసాధన కోసం అందరూ కృషి చేద్దామని ఈ సందర్భంగా కోరారు.గత దశాబ్ద కాలంలో మన జిల్లా నవజాత శిశు మరణాలు రేటు తగ్గింపులో గణనీయమైన పురోగతి సాధించింది అనీ తెలియజేశారు. సంకల్ప్(Sank-alp)ప్రాజెక్ట్ ప్రధాన లక్ష్యము 2027 నాటికి నవజాత శిశు మరణాల రేటు (NMR) ను సింగిల్ డిజిట్ సాయికి తగ్గించడానికి టీచింగ్ ఆస్పత్రులు, వైద్య విధాన పరిషత్ ఆస్పత్రులు సమన్వయంతో, సహకారంతో అందరము కలిసి సింగిల్ డిజిటు తీసుకురావడానికి కృషి చేద్దామని ఈ కార్యక్రమానికి హాజరైన, సూపరింటెండెంట్సు, గైనకాలజిస్ట్ లకు, పీడియాట్రిషన్లకు కోరారు. అత్యవసర నవ జాత శిశు సంరక్షణ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు.పుట్టిన ఒక గంటలోపు తల్లి పాలు ప్రారంభించడం చేయాలని సూచించారు.అధిక ప్రమాద గర్భధారణలు(High risk pregnancies) గుర్తించి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని , గర్భిణీల తీవ్ర రక్తహీనత వారిని గుర్తించి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని చికిత్స స ల హాలు, స త్వ ర మే అందించి సుఖవంతమైన ప్రసవం జరిగేటట్టు కృషి చేయాలని కోరారూ.ఈ కార్యక్రమంలో డా.విజయకుమార్ , మెడికల్ సూపరిటెండెంట్ మాట్లాడుతూ గర్భిణీలను ప్రారంభ దశలోనే గుర్తించి నమోదు చేయడం ,చికిత్స, సలహాలు అందించాలని, హై రిస్క్ గర్భిణీలను గుర్తించి వారి ఆరోగ్యం పై శ్రద్ధ తీసుకొని సుఖవంతమైన ప్రసవం జరిగేటట్టు వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని కోరారు.అధిక ప్రమాద గర్భిణీలు, మరియు నవజాత శిశువుల ను ఉన్నత స్థాయి వైద్య కేంద్రాలకు సకాలంలో రిఫర్ చేయడం వలన మాతృ శిశు మరణాలను తగ్గించవచ్చని సూచించారు. అకాల ప్రసవం (preterm delivery) ప్రమాదమున్నా గర్భిణులను పై హాస్పిటల్లో యాంటీనేటాల్ కార్డికో స్టెరాయిడ్స్ అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డా. స్వప్న, SNCU నోడల్ ఆఫీసర్, డా.అలివేలు, ప్రొఫెసర్, పీడియాట్రిక్ నిలోఫర్,Dr. రవికుమార్ పూర్వ మెడికల్ సూపరిటెండెంట్ నవజాత శిశు మరణాలను సింగిల్ డిజిట్ స్థాయికి తీసుకురావడానికి పలు సూచనలు చేశారు ఈ కార్యక్రమంలో డా.శ్రీధర్ , జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి,డా.అనిత , అడిషనల్ డిఎంహెచ్ఓ, ప్రభుత్వ ఆసుపత్రూల మెడికల్ సూపరిటెండెంట్స్, గైనకాలజిస్టు్ల, పీడియాట్రిషన్లు, ప్రోగ్రామ్ ఆఫీసర్స్, సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్స్,నిలోఫర్ హాస్పిటల్ వైద్యులు సుమారుగా 60 మంది పాల్గొన్నారు



# కేజీకేఏస్ గీతన్నల రాష్ట్ర చైతన్య బస్సు యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించిన మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

**హైదరాబాద్ వెలుతురు జూలై 24:**

తెలంగాణ రాష్ట్ర కల్లుగీత కార్మిక సంఘం (KGKS) ఆధ్వర్యంలో ఆగస్టు 2 నుంచి 18 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న "అమరుల యాదిలో.. గీతన్నల చైతన్య యాత్ర" రాష్ట్ర బస్సు యాత్ర పోస్టర్‌ను శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం (TPSK హాల్) లో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ శాసన మండలి సభ్యులు చెరుపల్లి సీతారాములు ఆవిష్కరించారు.ఈ కార్యక్రమానికి కేజీకేఏస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల రమణ అధ్యక్షత వహించగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమ్మి ఫౌండేషన్ చైర్మన్, గోపా డివిజన్ అధ్యక్షులు చిలువేరు సమ్మయ్య గౌడ్ ప్రత్యేక ఆహ్వానం మేరకు పాల్గొన్నారు.ఈ సందర్భంగా చిలువేరు సమ్మయ్య గౌడ్ మాట్లాడుతూ గీత కార్మికుల హక్కుల పరిరక్షణ, గీత వృత్తి అభివృద్ధి, సంక్షేమ పథకాల సమర్థ అమలు, గీత కార్మిక కుటుంబాల ఆర్థిక భద్రత కోసం చేపడుతున్న 'గీతన్నల చైతన్య యాత్ర' ను ప్రతి గీత కార్మికుడు తన సొంత కార్యక్రమంగా భావించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గీత కార్మికుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం, వారి సంక్షేమం కోసం అందరూ సంఘటితంగా ముందుకు సాగాలని అన్నారు. సందర్భంగా గీత కార్మికులకు ఎన్నికల సందర్భంగా ప్రకటించిన రూ.4,000 పెన్షన్, ప్రమాద మరణ ఎక్స్‌గ్రేషియాను రూ.10 లక్షలకు పెంపు, 50 సంవత్సరాలు నిండిన గీత కార్మికులకు పెన్షన్, అలాగే వృత్తి నిర్వహించే ప్రతి గీత కార్మికుడికి 'కాటమయ్య రక్షణ కవచం' వంటి సంక్షేమ హామీలను ప్రభుత్వం త్వరితగతిన అమలు చేసి గీత కార్మిక కుటుంబాలకు అండగా నిలవాలని కోరారు... అదేవిధంగా, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఆగస్టు 2న మహబూబాబాద్ (మానుకోట)లో ప్రారంభమయ్యే రాష్ట్ర బస్సు యాత్రకు కేసముద్రం మండలంతో పాటు ఉమ్మడి మండల పరిధిలోని ప్రతి గ్రామం నుంచి గీత కార్మికులు, యువత, సంఘం నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి చైతన్య యాత్రను విజయవంతం చేయాలని చిలువేరు సమ్మయ్య గౌడ్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గౌడ కల్లు గీత సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర చైర్మన్ బాలగోని బాలరాజు గౌడ్, గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పల్లె లక్ష్మణరావు గౌడ్, గోపా రాష్ట్ర అధ్యక్షులు బండి సాయన్న గౌడ్, గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు అంబాల నారాయణ గౌడ్, వంగ సదానందం గౌడ్, ప్రభులింగం గౌడ్, వి. వెంకట నరసయ్య తదితరులు పాల్గొన్నారు.



# ఆరుట్ల గ్రామంలో వర్షాలు బాగా కురవాలని వరుణ యాగం పెద్ద ఎత్తున బిందెలతో మహిళలు నీరు తెచ్చి శివలింగానికి జలాభిషేకం

- వరుణయాగంలో కూర్చొని ప్రత్యేక పూజలు చేసిన గ్రామ సర్పంచ్ మానిపాటి శోభాకుమార్ ఉపసర్పంచ్ నూకంరాజు ముదిరాజ్ పాలక మండలి సభ్యులు

**మంచాల వెలుతురు జులై 24:**

మంచాల మండలం ఆరుట్ల గ్రామం శివాలయంలో వర్షాలు బాగా కురువాలి ప్రజలు సుఖసం తోషాలతో జీవించాలని కోరుకుంటూ వరుణయాగం ఏర్పాటు చేశారు ముందుగా ఆరుట్ల గ్రా మ సర్పంచ్ మానిపాటి శోభాకుమార్ ఉపసర్పంచ్ నూకంరాజు ముదిరాజ్ గ్రామపంచాయతీ పాలక మండలి సభ్యులు మాజీ ప్రజాప్రతినిధులు గ్రామపెద్దలు కలిసి శివలింగానికి ప్రత్యేక అభి షేకం చేశారు అనంతరం దంపతులతో కలిసి వరుణ యాగంలో కూర్చొని ప్రత్యేక పూజలు చేశా రు యాగం పూర్తి అయిన తర్వాత గ్రామంలోని మహిళలు బిందెలతో తెచ్చిన నీటితో పెద్ద ఎత్తున శివలింగానికి జలాభిషేకం కార్యక్రమం నిర్వహించారు ఈసందర్భంగా గ్రామసర్పంచ్ మాని పాటి శోభాకుమార్ ఉపసర్పంచ్ నూకంరాజు ముదిరాజ్ మాట్లాడుతూ సమయానికి వర్షాలు కురువక రైతులు నాన ఆందోళన చెందుతున్నారు వారసుడు కరుణించక వర్షాలు పడక పోతే వంటలు ఎలా కాపాడు కోవాలోఅని రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు అని అన్నారు అం దుకే శివాలయంలో వర్షం రావాలని ఆదేవుడు కటాక్షం కోసం వరణయాగం ఏర్పాటు చేశాం అ ని అన్నారు దేవుడు కరుణించి బాగావర్షాలు పడేలా దీవించాలని రైతులు వేసిన పంటలుబాగా పండి ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండేలా దీవించాలని ఆదేవుడికి ప్రత్యేక పూజలుచేశాం అని అన్నారు ఈకార్యక్రమంలో పెద్దలు రాజరాజేశ్వరిదేవి ఆలయ నిర్మాణదాత వెదిరె పాండు రంగారెడ్డి వీఆర్ వన్ ఫౌండేషన్ చైర్మన్ వెంకటేశ్వర రెడ్డి గోగిరెడ్డి అంజిరెడ్డి గ్రామపంచాయతీ కార్యదర్శి చిలుకల వెంకటేష్ ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాతిరిఎల్లేష్ సొసైటీ డైరె క్టర్ కొంగర జనార్దన్ రెడ్డి మాజీ ఎంపీటీసీలు చీరాల ర మేష్ కావలి శ్రీనివాస్ ముదిరాజ్ గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు కొండిగారి శ్రావణ్ కుమార్ పంది శేఖర్ మంద మాధవి మోహన్ రె డ్డి అన్నంగళ్ళ జగన్నాథం పూన్నం రాము రావుల జంగయ్య మాదు గుల బాలమణి కృష్ణగౌడ్ మొగ్రిపద్మ ఐలయ్య సాతిరి సత్యం ఇందిరమ్మ కమిటీ సభ్యుడు కోరే బాబు పెద్దలు గుడ్డిమల్ల చంద్రయ్య ముదిరాజ్ వెదిరె వెంకటరమణరెడ్డి కురుమ సంఘం అధ్యక్షుడు రావుల భాష ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కావలి శ్రీనివాస్ ముదిరాజ్ ( హోటల్) చిందం రఘుపతి కొంగర వెం కట్ రెడ్డి దంటు మధుసూదన్ రెడ్డి మెండు వెంకట్ రెడ్డి వైయస్సార్ మాధగోని జంగయ్యగౌడ్ నుకం బాలరాజ్ ముదిరాజ్ ప్రజాగళం భూపాల్ ఆలయ కమిటీ సభ్యులు యువకులు తదితరులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



ఆరుట్ల గ్రామం శివాలయంలో కూర్చొని ప్రత్యేక పూజలు చేస్తున్న గ్రామ సర్పంచ్ మానిపాటి శోభాకుమార్ ఉపసర్పంచ్ నూకంరాజు ముదిరాజ్ మాజీ ప్రజాప్రతినిధులు గ్రామ పెద్దలు



ఆరుట్లలో శివలింగానికి జలాభిషేకం చేస్తున్న భక్తులు



ఆరుట్ల శివాలయంలో వరుణయాగం శివలింగ జలాభిషేకం కార్యక్రమంలో పాల్గొన్న పెద్దలు వెదిరె వెంకట రమణ రెడ్డి వైయస్సార్ మాధగోని జంగయ్య గౌడ్



ఆరుట్ల గ్రామంలో నీళ్ల బిందెలతో బొడ్రాయికి ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు

# ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఏకరూప దుస్తులు త్వరగా అందించాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి

**ఇబ్రహీంపట్నం వెలుతురు జూలై 24:**







ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కొంగర కలాన్ రంగారెడ్డి జిల్లా కార్యాలయంలోప్రభుత్వ పాఠశాల లలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు2 జతల ఏకరూప దుస్తులు త్వరగా అందించే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వప్రధానకార్యదర్శి సంజయ్ జాజు అన్నారు శుక్రవారం హై దరాబాద్ నుండి ఉన్నతాధికారులతో కలిసి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా అన్నిజిల్లాల కలెక్టర్లు అ దనపు కలెక్టర్లు విద్యగ్రామీణ అభివృద్ధి వ్యవసాయశాఖల అధికారులు ఇతర సంబంధిత అధి కారులతో విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ పంటల సాగు సీజనల్ పరిస్థితులపై సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా రాష్ట్రప్రభుత్వ ప్రధానకార్యదర్శి మాట్లాడుతూ ప్రభు త్వ యాజమాన్యాల పరిధిలో పనిచేస్తున్న పాఠశాలలు గురుకులాలలో1వ తరగతి నుండి ఇం టర్మీడియట్ వరకు విద్య అభ్యసించే విద్యార్థులకు2 జతల ఏకరూప దుస్తులు ఆగస్టు25వ తే దీలోగా అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు ఈక్రమంలో విద్యార్థుల కొలతలు మాస్టర్ టైలర్లు స్వయం సహాయకసంఘాల మహిళలకు దుస్తులు కుట్టేందుకు అవసరమైన ఏ ర్పాటు చేయాలని తెలిపారు ఎల్ నినో వర్షబావ పరిస్థితుల దృష్ట్యావరికి ప్రత్యామ్నాయంగా ఆ రుతడి పంటల సాగువైపు అవగాహన కల్పించి రైతులను ప్రోత్సహించాలని కందులు పెసర్లు కూరగాయల పంటలు సాగును రైతులకు సూచించాలని తెలిపారు సిజనల్ వ్యాధులపై అధి కారులు అప్రమత్తంగా ఉండాల ని సూచించారు వీడియో కాన్ఫరెన్స్ అనంత రంజిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి సంబంధిత అధికారులతో మాట్లాడుతూ నిర్ణీతగడు వులోగా విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందించేందుకు అధికారుల సమన్వయంతో పనిచేయాలని ప్రతి మండలం లో పాఠశాలల వారీగా యూనిఫాం తయారీపనులకు స్పష్టమైన కార్యాచరణ రూపొందించి అ మలు చేయాలనిసూ చించారురోజువారీ లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని తప్పనిసరిగా సాధిం చాలని అన్నారు రోజువారీ లక్ష్యాలను నిర్దేశిం చుకుని వాటినితప్పనిసరిగా సాధించాలని అన్నా రు యూనిఫాం తయారీలో నాణ్యతతో పాటులక్ష్య సాధన కూడా సమానంగా ముఖ్యమని పే ర్కొన్నారు వస్త్రాల స్వీకరణ బల్క్ కటింగ్ విద్యార్థుల కొలతల ప్రకారం వ్యక్తిగత కటింగ్ కుట్టిం పు పరిశీలనపాఠశాలలకు అప్పగింత వరకు ప్రతిదశను పకడ్బందీగా నిర్వహించాలని సూచిం చారు మండలస్థాయిలో అధికారుల మధ్య సమన్వయం బలోపేతం చేసి ఎంఈఓలు ఏపీఎం లుప్రధానోపాధ్యాయులు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు ఎస్ఎంసీలు కలిసి పనిచేయాలని ఆ దేశించారు ప్రతి దశ బాధ్యతలు ఎవరు నిర్వర్తించాలనే విషయాన్ని ముందుగానే నిర్ణయించి ని రంతర పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారుపాఠశాలల వారీగాప్రధానోపాధ్యాయులుసంబంధిత సి బ్బందితో సమన్వయం కొనసాగిస్తూ పనుల పురోగతిని ప్రతిరోజూ సమీక్షించాలని సూచించారు నిర్ణయించిన లక్ష్యాలను చేరుకునేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారుఈ కార్యక్రమం లో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు కిరణ్మయి జిల్లాగ్రామీణ అభివృద్ధి అధికారి కృష్ణారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు జిల్లావ్యవసాయ అధికారి సుజాతపిడి మెప్మా వెంకట నారాయణ ట్రైబల్ వెల్ఫేర్ అధికారి రామేశ్వరి దేవి సంబంధిత ఆర్.సి.ఓ.లు సంబంధిత అధి కారులు తదితరులు పాల్గొన్నారు

# దిలీప్‌కుమార్‌ను వెంటనే బదిలీ చేయాలి

- తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జిలుకర రవికుమార్.

**బషీర్ బాగ్ వెలుతురు 24 జులై :**

జనగామ జిల్లాలోని కొడకండ్ల మండలంలో తెలంగాణ(TGRS & JC) రెసిడెన్షియల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ గా కొనసాగింపబడుతున్న దిలీప్ కుమార్ ను వెంటనే అక్కడి నుండి బదిలీ చేయాలని తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు జిలుకర రవికుమార్ రాష్ట్ర (TREIS ) సెక్రెటరీ జి కలిసి వినతి పత్రం సమర్పించారు గతంలో రెండు సార్లు జనగామ జిల్లా కలెక్టర్ కు విన్నపించిన ఫలితం లేదన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి వద్ద ఉన్న విద్యాశాఖ రాష్ట్రంలో ఎంతో వేగంగా విద్యాశాఖ పరుగులు తీస్తున్న. సమయంలో ఈ విషయాన్ని గమనించకపోవడం శోచనీయం ..గత ప్రభుత్వము చేసిన తప్పిదాలు ఈ ప్రభుత్వం కూడా చేస్తున్నది అనడానికి ఇది నిదర్శనం.గత ప్రభుత్వంలో డిప్టేషన్ మీద 14...11.2022. నాడు(TGRS&JC) రెసిడెన్షియల్ బాలికల స్కూల్ అండ్ జూనియర్ కాలేజ్ కి ప్రిన్సిపాల్ గా వచ్చిన టీ .దిలీప్ కుమార్ ను ఇంతవరకు అక్కడనే ఉంచడం ఆశ్చర్యం కలగజేస్తుంది 2022లో di-putation )మీద వచ్చిన ప్రిన్సిపల్ నాలుగు సంవత్సరాలు గడుస్తున్న బాలికల స్కూల్ అండ్ జూనియర్ కాలేజీలోలో ఉన్న అతనిని ఇంతవరకు మార్చకపోవడమో. శో చనీయం .బాలికల రెసిడెన్స్ లో ఉండవలసిన మహిళ.. ప్రిన్సిపల్ గా.. బదులు.. మేల్ ((male)ప్రిన్సిపల్ గా ఉండడం వలన వారి సమస్యను వారి బాధలను వారి ఇబ్బందులను చెప్పుకోవలసిన బాలికలు చెప్పలేక ఇబ్బందులు పడుతున్నట్టుగా.. సెక్రెటరీ వివరించారు గానీ విద్యాశాఖ అధికారులు గాని పట్టించుకోకపోవడం ఎంతవరకు కరెక్ట్ అని అన్నారు అసలు బాలికల రెసిడెన్షియల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజీలో ఉండవలసిన( మహిళా) ప్రిన్సిపల్ ను ఎందుకు ఏర్పాటు చేయలేకపోతున్నారనేదే ప్రశ్న.నాలుగు సంవత్సరాలు గడుస్తున్న.. ((Diputation)..మీద వచ్చిన (మేల్)male ప్రిన్సిపాల్ ను బాలికల వద్ద ఉంచడము కరెక్టే కాదు అని సీక్రెట్ కి తెలియజేశారు అలాగైతే అనేక అరాచకమైన దుష్కర్యాలు జరిగే ప్రమాదం ఉందని వెంటనే. ప్రభుత్వం. బాలికల స్కూల్ అండ్ జూనియర్ కాలేజీలు ఉన్న ప్రిన్సిపాల్ ను తక్షణమే బదిలీ చేసి అందులో ఉన్న మేల్ male ఫ్యాకల్టీ కూడా బదిలీ చేసి మొత్తం ఫిమేల్ ఫ్యాకల్టీ తో పాటు ఫిమేల్ (మహిళ) ప్రిన్సిపాల్ ఏర్పాటు. చేయాలని బాలికల రెసిడెంట్ స్కూల్ అండ్ జూనియర్ లో ఏ దుష్కార్యం జరిగిన ప్రభుత్వమే బాధ్యత వహించవలసి ఉంటుందని అన్నారు సెక్రటరీ జి ఉష రాణి గారు మాట్లాడుతూ ఈ నెలలోనే మెయిల్ ప్రిన్సిపల్ గా ఉన్న టీ దిలీప్ కుమార్ ను బదిలీ చేస్తామని హామీ ఇచ్చారని తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు జిలుకర రవికుమార్ తెలిపారు.



# నీట్ యుజీ లీకేజీ రచ్చ



- విద్యాశాఖ మంత్రి రాజీనామాకు పట్టుపడుతున్న విపక్షాలు
- నాలుగో రోజూ పార్లమెంట్ మకరద్వారం వద్ద విపక్ష ఎంపీల నిరసన
- పరస్పరం విమర్శలు గుప్పించుకున్న అధికార, ప్రతిపక్షాలు
- యువత భవిష్యత్తుపై కాంగ్రెస్ మూడు ప్రధాన డిమాండ్లు
- ప్రధాని మోదీ సభలోనే ప్రకటన చేయాలని ఖర్గే స్పష్టం
- ప్రధాని ఫాస్ట్ ట్రాక్ కోర్టుల హామీ అసత్యమైనది
- ఆప్ అధినేత కేజ్రీవాల్ తీవ్ర వ్యాఖ్యలు

**ఢిల్లీ వెలుతురు జూలై 24:**

దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపిన నీట్–యుజీ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ విపక్ష ఎంపీలు తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం పార్లమెంట్ కాంప్లెక్స్‌లోని మకరద్వారం వద్ద విపక్ష కూటమి ఎంపీలు వరుసగా నాలుగో రోజు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి, విద్యాశాఖ మంత్రికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ, ప్లకార్డులు మరియు బ్యానర్లను ప్రదర్శించారు.పార్లమెంట్ పరిసరాల్లో నిరసనల వేడి తీవ్రస్థాయికి చేరింది. ఒకవైపు ప్రతిపక్ష 'ఇండియా' కూటమి ఎంపీలు మంత్రి రాజీనామాకు పట్టు బడుతుండగా, మరోవైపు అధికార ఎన్‌డీఏ ఎంపీలు కూడా పోటీగా నిరసన ప్రదర్శనలు నిర్వహించడంతో ఇరు వర్గాల మధ్య తీవ్ర ఘర్షణ వాతావరణం నెలకొంది. నీట్ లీకేజీ అంశంపై సభలో నిర్మాణాత్మక చర్చ జరగకుండా విపక్షాలు ఉద్దేశపూర్వకంగా సభా కార్యక్రమాలను అడ్డుకుంటున్నాయని అధికార పక్షం ఆరోపించగా, విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్న ప్రభుత్వం బాధ్యత వహించే వరకు వదిలేదే లేదని విపక్షాలు స్పష్టం చేశాయి.నీట్ లీకేజీ సంక్షోభంపై కాంగ్రెస్ పార్టీ తమ మూడు ప్రధాన డిమాండ్లను సామాజిక మాధ్యమం ద్వారా దేశ ప్రజల ముందుకు తెచ్చింది. మొదటిది విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, రెండోది నిరసన తెలుపుతున్న విద్యార్థులపై హింసకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, మూడోది దేశ యువతకు ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ కోరింది. అర్ధరాత్రి ప్రకటనలు జారీ చేయడం మాని, ప్రధాని నేరుగా పార్లమెంట్ సభ వేదికగానే ఈ అంశంపై మాట్లాడితేనే దానికి ప్రామాణికత ఉంటుందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు.పేపర్ లీక్ చేసిన దోషులను శిక్షించేందుకు ప్రత్యేకంగా ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ప్రకటనపై ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధినేత అరవింద్ కేజ్రీవాల్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అర్ధరాత్రి దాటిన తర్వాత వీడియో విడుదల చేసి ఫాస్ట్ ట్రాక్ కోర్టుల కోసం చట్టం తెస్తామని చెప్పిన ప్రధాని హామీలు ఎంత అసత్యమైనవో మరుసటి రోజే రుజువైందని ఎద్దేవా చేశారు. నిజంగా దోషులను శిక్షించే ఉద్దేశం ఉంటే క్షేత్రస్థాయిలో చర్యలు దానికి విరుద్ధంగా ఎందుకు ఉంటున్నాయని కేజ్రీవాల్ ప్రశ్నించారు.నీట్–2024 పేపర్ లీక్ కేసులో ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న సంజీవ్ ముఖియాకు బెయిల్ లభించడాన్ని కేజ్రీవాల్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. ముఖియాకు వ్యతిరేకంగా ఎలాంటి ఆధారాలు లభించలేదని సీబీఐ కోర్టుకు తెలపడం వెనుక ఉన్న అంతరార్థం ఏంటని ఆయన నిలదీశారు. అసలు నీట్ పేపర్ లీక్ చేసింది సంజీవ్ ముఖియా కాకపోతే ఇంకెవరని ప్రశ్నించారు.

కీలక నిందితులపై సరైన ఆధారాలు సమర్పించనప్పుడు ఇక ప్రతిపాదిత ఫాస్ట్ ట్రాక్ కోర్టుల వల్ల దేశానికి వచ్చే ప్రయోజనం ఏమిటని నిలదీస్తూ, ప్రభుత్వం పేపర్ లీక్ మాఫియాను కాపాడుతోందని ఆరోపించారు.పరీక్షల నిర్వహణలో జరిగిన అక్రమాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేసే వరకు తమ పోరాటం నిరాటంకంగా సాగుతుందని కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే స్పష్టం చేశారు. 26 రోజులకు పైగా సాగిన సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్ష విరమణపై ఆయన సంతోషం వ్యక్తం చేస్తూ, దేశానికి ఆయన ప్రాణం ఎంతో విలువైనదన్నారు.

తమ డిమాండ్ల విషయంలో తగ్గేదే లేదని, మంత్రి రాజీనామా చేసే వరకు జంతర్ మంతర్ వేదికను వదిలి వెళ్లేది లేదని తెగేసి చెప్పారు.కేంద్ర ప్రభుత్వంతో జరగబోయే చర్చలకు సంబంధించి తమ పార్టీ వైఖరిని సీజేపీ ప్రతినిధులు పునరుద్ఘాటించారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రతిపాదనలు వచ్చినా చర్చలు కేవలం ఒక తటస్థ వేదికపైనే జరగాలని సీజేపీ అధికార ప్రతినిధి దీపక్ బలియాన్ స్పష్టం చేశారు. మరోవైపు, శుక్రవారం రాత్రి తమ పార్టీ కీలక బృంద సభ్యులను పోలీసులు అరెస్టు చేసే అవకాశం ఉందని అభిజీత్ దీప్కే ఆందోళన వ్యక్తం చేశారు. తమను అరెస్టు చేసినప్పటికీ దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువత ఈ ఉద్యమాన్ని ముమ్మరంగా ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.నీట్ లీకేజీ వివాదం కేవలం రాజధాని ఢిల్లీకే పరిమితం కాకుండా దక్షిణాదికీ వ్యాపించింది. తమిళనాడు రాజధాని చెన్నైలో నీట్ రద్దు చేయాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వందలాది మంది విద్యార్థులు శుక్రవారం బాలన్ ఇల్లం వద్ద భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. విద్యార్థుల ఆందోళనకు మద్దతుగా పలువురు సినీ ప్రముఖులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనడంతో తమిళనాడు వ్యాప్తంగా నీట్ రద్దు డిమాండ్ మరోసారి తీవ్రరూపం దాల్చింది. దేశంలో యువత మేల్కొన్నారని, ఇకపై అబద్ధపు హామీలతో వారిని మోసం చేయడం సాధ్యం కాదని నేతలు హెచ్చరించారు.

# గుజరాత్‌ను ముంచెత్తిన వరద

- అసోం, జమ్ముకశ్మీర్‌లలో కొనసాగుతున్న ఉధృతి
- వందలాది మంది సురక్షిత ప్రాంతాలకు తరలింపు
- వల్సాడ్ జిల్లాలో పడవలు, హెలికాప్టర్లతో సహాయక చర్యలు
- నవసారి జిల్లాలో ఎన్డీఆర్ఎఫ్ రెస్క్యూ
- వరద నీటి నుంచి 67 మంది గ్రామీణుల సురక్షిత తరలింపు
- సురేంద్రనగర్ జలదిగ్బంధం-డిప్యూటీ సీఎం సమీక్ష
- లఖ్తర్ తాలూకాలో 27 మందిని కాపాడిన అధికారులు
- అసోంలో తీవ్రరూపం దాల్చిన వరదలు
- ఇప్పటివరకు 47 మంది ప్రాణాలు బలి

**గుజరాత్ వెలుతురు జూలై 24:**



గుజరాత్ రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా తీవ్రమైన వరద బీభత్సం నెలకొంది. ప్రత్యేకించి వల్సాడ్ జిల్లాలో వర్షపు నీరు లోతట్టు ప్రాంతాలను ముంచెత్తడంతో స్థానిక యంత్రాంగం రెస్క్యూ చర్యలను ముమ్మరం చేసింది. వాపి సిటీ రెవెన్యూ అధికారి కాంతిభాయ్ ప్రత్యక్ష పర్యవేక్షణలో సహాయక బృందాలు రంగంలోకి దిగాయి. నీటిలో చిక్కుకున్న ప్రజలను రక్షించేందుకు పడవలతో పాటు కొన్ని అత్యవసర ప్రాంతాల్లో హెలికాప్టర్లను కూడా ఉపయోగిస్తున్నారు. ఎన్డీఆర్ఎఫ్, స్థానిక విపత్తు స్పందన దళాలు బాధితులకు ఆహారం, తాగునీరు మరియు ప్రాథమిక వైద్య సదుపాయాలు అందిస్తున్నాయి.నవసారి జిల్లా సరిఖురాద్ గ్రామం ఆకస్మిక వరద నీటిలో చిక్కుకుపోవడంతో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న ఎన్డీఆర్ఎఫ్ 6వ బెటాలియన్ సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. బాధితుల్లో ఉన్న 25 మంది మహిళలు, 22 మంది చిన్నారులతో సహా మొత్తం 67 మందిని రెస్క్యూ సిబ్బంది సురక్షితంగా బయటకు తీసుకు వచ్చారు. ఆ ప్రాంతంలో ఇంకా ఎవరైనా చిక్కుకున్నారేమోనన్న అనుమానంతో గాలింపు చర్యలను కొనసాగిస్తున్నారు.సురేంద్రనగర్ జిల్లా లఖ్తర్ తాలూకాలోని ఓలాక్ గ్రామాన్ని వరద నీరు చుట్టుముట్టడంతో ప్రజలు జలదిగ్బంధంలో ఇరుక్కుపోయారు. వెంటనే స్పందించిన జిల్లా యంత్రాంగం, పోలీసు మరియు అగ్నిమాపక సిబ్బంది సంయుక్తంగా రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించి 27 మందిని కాపాడారు. రాష్ట్రంలో ఉత్పన్నమైన ఈ అత్యవసర పరిస్థితులపై గుజరాత్ డిప్యూటీ సీఎం ఉన్నతాధికారులతో అత్యున్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించి, ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.మరోవైపు ఈశాన్య రాష్ట్రమైన అసోంలో వరద పరిస్థితి అత్యంత భయానకంగా మారింది. నిరంతరం కురుస్తున్న వర్షాల ధాటికి నదులు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో అనేక ప్రాంతాలు నీటమునిగాయి. రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ వెల్లడించిన అధికారిక గణాంకాల ప్రకారం, ఈ వరద విపత్తు కారణంగా రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 47 మంది మరణించారు. దాంతో బాధితులను రక్షించేందుకు రెస్క్యూ బృందాలు శ్రమిస్తున్నాయి.అసోం రాజధాని గువాహటిలోని హటిగావ్, అనిల్ నగర్, బెల్టోల వంటి ప్రధాన ప్రాంతాలు జలమయమయ్యాయి. మోకాళ్ల లోతు నీరు చేరడంతో వందలాది ఇళ్లు, దుకాణాలు, పాఠశాలల్లోకి వరద నీరు చేరింది. రోడ్లపై భారీగా నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడి జనజీవనం పూర్తిగా స్తంభించింది. పరిస్థితి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని కామ్రూప్ మెట్రో జిల్లా యంత్రాంగం గువాహటిలోని అన్ని విద్యాసంస్థలకు ముందస్తు సెలవులను ప్రకటించింది.రాబోయే రోజుల్లో ఉరుములు, మెరుపులతో కూడిన మరిన్ని భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని అధికారులు సూచించారు. వరద పరిస్థితులపై సమగ్ర సమీక్ష నిర్వహించేందుకు ప్రభావిత జిల్లాల డిప్యూటీ కమిషనర్లు, ఉన్నతాధికారులతో శనివారం మధ్యాహ్నం 2 గంటలకు సీఎం హిమంత బిశ్వశర్మ ప్రత్యేక సమావేశం కానున్నారు.ఉత్తరాదిన జమ్ముకశ్మీర్ రాష్ట్రాన్ని కూడా వర్షాలు విపరీతంగా ముంచెత్తుతున్నాయి. శుక్రవారం తెల్లవారు జామున ఉధంపూర్ జిల్లాలో భారీ వర్షాల కారణంగా ఒక్కసారిగా ఆకస్మిక వరదలు పారాయి. దీని ప్రభావంతో పలు నివాస గృహాలు పాక్షికంగా దెబ్బతినగా, వ్యవసాయ పంటలు నీట మునిగి రైతులకు భారీ నష్టం వాటిల్లింది. ముందస్తు జాగ్రత్త చర్యగా బాధితులను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు.ఉధంపూర్ ప్రాంతంలో సంభవించిన ఆకస్మిక వరదల్లో ఎలాంటి ప్రాణనష్టం నమోదు కాకపోవడం ఊరటనిచ్చే అంశం. అయితే, వరదలు మరియు కొండచరియలు విరిగిపడటం వల్ల ఆస్తిపాస్తులు, పంటలకు జరిగిన నష్టాన్ని అధికారులు క్షేత్రస్థాయిలో అంచనా వేస్తున్నారు. వర్షాలు ఇంకా కొనసాగే అవకాశం ఉన్నందున కొండ ప్రాంతాల ప్రజలు నదీ పరివాహక ప్రాంతాల నివాసితులు అప్రమత్తంగా ఉండాలని విపత్తు నిర్వహణ దళాలు హెచ్చరించాయి.

# పుట్టినరోజు నాడే యువ ఇంజినీర్ దుర్మరణం

- అమెరికాలో నిర్మల్ జిల్లా యువకుడు మృతి!
- ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన కారు..
- ఆసుపత్రి బెడ్‌పైనే బర్త్‌డే వేడుకలు
- వేడుకలైన కాసేపటికే విషమించిన ఆరోగ్యం
- స్వగ్రామంలో సోకసంద్రం

**నిర్మల్/డెట్రాయిట్, వెలుతురు జూలై 2026:**

ఉన్నత చదువులు చదివి, మంచి ఉద్యోగంలో స్థిరపడి కుటుంబానికి ఆసరాగా ఉంటాడనుకున్న ఆ యువకుడిని విధి వెక్కిరించింది. కళ్లముందే ఉన్నత భవిష్యత్తు కనిపిస్తున్న తరుణంలో అమెరికాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం ఒక నిండు ప్రాణాన్ని బలిగొంది. పుట్టినరోజు నాడే ఆ యువకుడు కన్నుమూయడంతో స్వగ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలముకున్నాయి.

### ప్రమాదం జరిగిందిలా..

నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలం నర్సాపూర్ (డబ్ల్యూ) గ్రామానికి చెందిన నిత్యానంద రెడ్డి (24) మూడేళ్ల క్రితం ఎంఎస్ చేసేందుకు అమెరికా వెళ్లారు. చదువు పూర్తయిన తర్వాత ఇటీవలే ఆయన అక్కడ ఒక ఉద్యోగంలో కూడా చేరారు. మిషిగన్ రాష్ట్రంలోని డెట్రాయిట్‌లో నివాసముంటున్న నిత్యానంద రెడ్డి ఈ నెల 18న తన ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఒక కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో ఆయనకు తీవ్ర గాయాలు కావడంతో గమనించిన స్నేహితులు తక్షణమే డెట్రాయిట్‌లోని స్థానిక ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.



**ఆసుపత్రి బెడ్‌పైనే వేడుకలు.. కాసేపటికే మహామౌనం**

జులై 23న నిత్యానంద రెడ్డి పుట్టినరోజు కావడంతో, ఆయన త్వరగా కోలుకుంటాడనే ఆశతో స్నేహితులు ఆసుపత్రి బెడ్‌పైనే బర్త్‌డే వేడుకలు నిర్వహించారు. అయితే వేడుకలు పూర్తయిన కాసేపటికే నిత్యానంద రెడ్డి ఆరోగ్యం ఒక్కసారిగా క్షీణించింది. వైద్యులు అత్యవసర చికిత్స అందించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. పరిస్థితి విషమించడంతో ఆయన చికిత్స పొందుతూ కన్నుమూసినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

### కన్నీరుమున్నీరవుతున్న స్వగ్రామం


తన పుట్టినరోజు నాడే కొడుకు నూరేళ్ల ఆయుష్షు తీరిపోయిందనే వార్త విన్న నర్సాపూర్ గ్రామస్తులు, బంధువులు తీవ్ర శోకసంద్రంలో మునిగిపోయారు. కంటికి రెప్పలా పెంచుకున్న కుమారుడు తిరిగిరాని లోకాలకు వెళ్లాడని తెలిసి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. నిత్యానంద రెడ్డి పార్థివ దేహాన్ని స్వగ్రామానికి రప్పించేందుకు ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు చొరవ చూపి తగిన సహాయం అందించాలని బాధిత కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు.

# ఆయిల్ ఫెడ్ కార్యాలయంలో అధికారులతో మంత్రి తుమ్మల సమీక్ష సమావేశం

**హైదరాబాద్ వెలుతురు జూలై 24:**

రైతు ప్రయోజనాలకు సంబంధించిన ప్రతి అంశంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత & జౌళి శాఖల మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ స్టేట్ ఆయిల్‌ఫెడ్ కార్యాలయంలో ఆయిల్ ఫెడ్ అధికారులతో సమావేశం నిర్వహించిన మంత్రి తుమ్మల.. రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగు విస్తరణ, నర్సరీల నిర్వహణ, మొక్కల లభ్యత, రైతులకు అందుతున్న సేవలు, డ్రిప్ ఇరిగేషన్ అమలు, భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రం ఎల్–నినో ప్రభావాన్ని ఎదుర్కొనే పరిస్థితులు నెలకొన్నాయని, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులకు ప్రత్యామ్నాయంగా నిలబడగల పంటలపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి సూచించారు. ఎలాంటి కఠిన పరిస్థితులనైనా తట్టుకుని నిలబడగల సామర్థ్యం ఉన్న పంటల్లో ఆయిల్‌పామ్ ఒకటని పేర్కొన్నారు. అందువల్ల రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగు విస్తరణను వేగవంతం చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.రాష్ట్రవ్యాప్తంగా రైతుల నుంచి ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి రోజురోజుకూ పెరుగుతోందని మంత్రి తెలిపారు. ముఖ్యంగా ప్రస్తుతం ఆయిల్‌పామ్ తాజా గెలలకు (Fresh Fruit Bunches) మార్కెట్లో మంచి ధర లభిస్తోందని, ఈ కారణంగా పెద్ద సంఖ్యలో రైతులు ఆయిల్‌పామ్ సాగు వైపు మొగ్గుచూపుతున్నారని చెప్పారు. ఈ అవకాశాన్ని పూర్తిగా వినియోగించుకునేలా అధికారులు ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు.రైతులు నర్సరీలకు వెళ్లినప్పుడు మొక్కలు అందుబాటులో లేవని చెప్పే పరిస్థితి ఎట్టి పరిస్థితుల్లోనూ రాకూడదని మంత్రి స్పష్టం చేశారు. రైతుల అవసరాలను ముందుగానే అంచనా వేసి, అవసరమైన మేరకు నాణ్యమైన పామాయిల్ మొక్కలను నర్సరీలలో సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. ప్రతి జిల్లాలో, ప్రతి ఆయిల్‌పామ్ విస్తరణ ప్రాంతంలో రైతుల డిమాండ్‌కు అనుగుణంగా మొక్కల ఉత్పత్తి చేపట్టాలని సూచించారు.భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని తక్కువ ఎత్తు పెరిగే, తక్కువ నిడివి గల ఆకులు కలిగి, అధిక దిగుబడులు ఇచ్చే ఆధునిక రకాల ఆయిల్‌పామ్ మొలకలను అధిక సంఖ్యలో దిగుమతి చేసుకోవాలని మంత్రి సూచించారు. ఈ రకాల మొక్కలు రైతులకు నిర్వహణ సులభతరం చేయడమే కాకుండా అధిక దిగుబడులు, మెరుగైన ఆదాయాన్ని అందిస్తాయని తెలిపారు. అదేవిధంగా ఆయిల్‌పామ్ సాగులో కీలకమైన డ్రిప్ ఇరిగేషన్ విషయంలో కూడా ఎలాంటి జాప్యం ఉండకూడదన్నారు. డ్రిప్ పరికరాల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి రైతుకు సకాలంలో పరికరాలు అందేలా డ్రిప్ కంపెనీలతో సమన్వయం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండకూడదని, ఒకే చోట అవసరమైన సేవలు అందేలా వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు.ఆయిల్‌పామ్ విస్తరణ కార్యక్రమాన్ని కేవలం లక్ష్యాల సాధనగా కాకుండా రైతుల ఆదాయాన్ని పెంచే ఉద్యమంగా అధికారులు భావించాలని మంత్రి పేర్కొన్నారు. నర్సరీల నుంచి క్షేత్రస్థాయి వరకు ప్రతి దశలో నాణ్యత, పారదర్శకత, వేగం ఉండాలని, రైతుల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరించాలని ఆదేశించారు.ఖమ్మం జిల్లా కల్లూరుగూడెంలో నిర్మాణంలో ఉన్న ఆయిల్‌పామ్ ప్రాసెసింగ్ ప్లాంట్‌కు సంబంధించిన మిగిలిన పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రారంభోత్సవానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. అలాగే టీజీ ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న మెగా ఆయిల్ ప్యాకింగ్ స్టేషన్ ప్రారంభోత్సవ ఏర్పాట్లను కూడా వేగవంతం చేయాలని ఆదేశించారు. "విజయ హైదరాబాద్" బ్రాండ్ వంటనూనెల విక్రయాలను పెంపొందించే దిశగా మార్కెట్ విస్తరణ, విస్తృత ప్రచార కార్యక్రమాలు, విక్రయ ప్రోత్సాహక చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఆన్ లైన్ పోర్టల్ ద్వారానే అమ్మకాలు, కొనుగోలు నిర్వహించాలని, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ వారితో సంప్రదించి మార్కెటింగ్ విభాగాన్ని బలోపేతం చేయాలని సూచించారు.ఈ సమీక్ష సమావేశంలో ఏపీసీ & ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ కె. సురేందర్ మోహన్, ఉద్యాన శాఖ డైరెక్టర్ & టీజీ ఆయిల్‌ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి షేక్ యాస్మీన్ బాషా తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# వెట్టి చాకిరీ ఉత్పత్తులపై అమెరికా కొరడా..



- భారత్‌కు 10% కొత్త టారిఫ్
- 60 దేశాల దిగుమతులపై 10% నుంచి 12.5% వరకు సుంకాలు
- ట్రేడ్ యాక్ట్ సెక్షన్ 301 కింద ట్రంప్ నిర్ణయం
- భారత్‌పై ప్రతిపాదిత 12.5% సుంకాన్ని 10%కు తగ్గింపు
- చైనా సహా 38 దేశాలకు 12.5% టారిఫ్
- చమురు, గ్యాస్, ఎరువుల దిగుమతులకు మినహాయింపు

**వాషింగ్టన్, జూలై 24 (వెలుతురు):**

వెట్టి చాకిరీ (Forced Labour) ద్వారా తయారైన వస్తువుల దిగుమతులను అరికట్టే చర్యల్లో భాగంగా అమెరికా కొత్త టారిఫ్‌లను ప్రకటించింది. భారత్‌తో పాటు దాదాపు 60 వాణిజ్య భాగస్వామ్య దేశాల నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై 10 శాతం నుంచి 12.5 శాతం వరకు అదనపు సుంకాలు విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు.తాత్కాలికంగా అమల్లో ఉన్న 10 శాతం గ్లోబల్ టారిఫ్‌ల గడువు శుక్రవారంతో ముగియనున్న నేపథ్యంలో, ట్రేడ్ యాక్ట్–1974లోని సెక్షన్–301 నిబంధనల కింద ఈ కొత్త సుంకాలను అమల్లోకి తీసుకొచ్చారు. వెట్టి చాకిరీ ద్వారా తయారైన ఉత్పత్తుల దిగుమతులపై సమర్థవంతమైన చర్యలు తీసుకోని దేశాలపై ఈ నిర్ణయం వర్తిస్తుందని అమెరికా ప్రభుత్వం తెలిపింది.మొదట భారత్‌పై 12.5 శాతం టారిఫ్ విధించాలని ప్రతిపాదించినప్పటికీ, వెట్టి చాకిరీ నిరోధక చర్యలను భారత్ వేగవంతం చేయడంతో సుంకాన్ని 10 శాతానికి తగ్గించారు. అలాగే చమురు, సహజ వాయువు, ఎరువుల దిగుమతులతో పాటు యూఎస్–మెక్సికో–కెనడా వాణిజ్య ఒప్పందం (USMCA) పరిధిలోని వస్తువులకు ఈ టారిఫ్‌ల నుంచి మినహాయింపు కల్పించారు.వివిధ దేశాలు వెట్టి చాకిరీ నిరోధక చర్యలను ఎంత మేర అమలు చేస్తున్నాయన్న అంశాన్ని పరిగణనలోకి తీసుకుని టారిఫ్‌లను నిర్ణయించినట్లు అమెరికా తెలిపింది. భారత్, బ్రిటన్, కెనడా, మెక్సికో, ఇండోనేషియాపై 10 శాతం సుంకం విధించగా, చైనా సహా మరో 38 దేశాలకు 12.5 శాతం టారిఫ్ అమలు చేయనున్నారు.ఈ సందర్భంగా అమెరికా వాణిజ్య ప్రతినిధి జెమిసన్ గ్రీర్ మాట్లాడుతూ, అమెరికాలో శతాబ్దకాలంగా వెట్టి చాకిరీపై నిషేధం అమల్లో ఉందని, కొత్త సుంకాలు ప్రపంచవ్యాప్తంగా కార్మిక హక్కుల పరిరక్షణకు దోహదపడతాయని పేర్కొన్నారు. కొత్త టారిఫ్‌లు అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాల్లో పేర్కొన్న గరిష్ఠ పరిమితులను మించవని అమెరికా స్పష్టం చేసింది.

# విద్యార్థుల సమస్యలపై బీజేవైఎం సమరభేరి...!

- కరీంనగర్‌లో 'ఫీజుల బకాయి-బిజెపి లడాయి' పోస్టర్ ఆవిష్కరణను ఆవిష్కరించిన బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి..

**కరీంనగర్ వెలుతురు జూలై 24:**




భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం ) రాష్ట్ర శాఖ పిలుపు మేరకు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన 'ఫీజుల బకాయి–బిజెపి లడాయి' కార్యక్రమానికి సంబంధించిన సన్నాహక సమావేశం మరియు పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం రోజున నగరంలోని వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన గంగా డి కృష్ణారెడ్డి పోస్టర్‌ను ఆవిష్కరించి, విద్యార్థుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.రాష్ట్రవ్యాప్తంగా ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలు దాదాపు రూ. 15,000 కోట్లు విడుదల చేయకుండా ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని ఆయన మండిపడ్డారు.నిధుల విడుదల నిలిచిపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందన్నారు. విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతోందన్నారు, కేవలం రాష్ట్ర స్థాయిలోనే కాకుండా, కరీంనగర్ జిల్లాలో కూడా లక్షలాది మంది విద్యార్థులు ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్పులు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతూ సతమతమవుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతుందని ఘాటుగా విమర్శించారు.విద్యార్థుల అగమ్య గోచరంగా మారుతున్న రాష్ట్ర ప్రభుత్వానికి చీమ కుట్టినట్టైనా లేదని, రేవంత్ రెడ్డి పభుత్వానికి తగిన గుణపాఠం చెప్పి, విద్యార్థులకు న్యాయం జరగాలనే సంకల్పంతో బీజేవైఎం ఆధ్వర్యంలో ఫీజుల బకాయి . బిజెపి లడాయి పేరిట ప్రోగ్రాం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకూ ప్రభుత్వాన్ని విడిచి పెట్టేది లేదని ఆయన హెచ్చరించారు. ఫీజు రియంబర్స్మెంట్ , స్కాలర్షిప్ల బకాయిలు చెల్లించే వరకు ప్రభుత్వాన్ని నిద్ర పోనిచ్చేది లేదని , బీజేవైఎం ఆధ్వర్యంలో నిరంతర ఆందోళన కార్యక్రమాలు చేపట్టి, విద్యార్థులకు న్యాయం జరిగే వరకూ పోరాటం కొనసాగిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజేవైయం జిల్లా అధ్యక్షులు సంగ నరేష్, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు నరెడ్ల ప్రవీణ్ రెడ్డి,బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు వాసుదేవరెడ్డి,గుజ్జ శ్రీనివాస్,మహిళా మోర్చా జిల్లా అధ్యక్షులు నిర్మలా రెడ్డి,సునిత,యువ మోర్చా నాయకులు శశిధర్ రెడ్డి,జిల్లా నాయకులు,మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జన్వాడలో భూకబ్జా కలకలం

- కాంపౌండ్ వాల్ కూల్చివేత, కంటైనర్ ఏర్పాటు
- యజమాని ఫిర్యాదుతో సాయి గౌతమ్, హనుమంతరావులపై మోకిలా పీఎస్‌లో కేసు నమోదు

**శంకర్పల్లి, వెలుతురు జులై 24 :**

మోకిలా పోలీస్ స్టేషన్ పరిధిలోని జన్వాడ గ్రామంలో భారీ భూకబ్జా యత్నం కలకలం రేపింది. అర్ధరాత్రి వేళ జేసీబీలతో అక్రమంగా చొరబడి, కాంపౌండ్ వాల్‌ను కూల్చేసి, ల్యాండ్‌ను కబ్జా చేసేందుకు ప్రయత్నించిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు మరియు బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ చిక్కడపల్లికి చెందిన వ్యాపారవేత్త విజయ్ ఆనంద్ గుప్తా, ఆయన కుటుంబ సభ్యులు కలిసి 1991లో జన్వాడ గ్రామ పరిధిలోని సర్వే నెంబర్లు 145/3, 146, 147 లలో మొత్తం 6 ఎకరాల 8½ గుంటల భూమిని కొనుగోలు చేశారు. అప్పటి నుంచి సదరు భూమి వారి స్వాధీనంలోనే ఉంది. అందులో గతంలో స్టీల్ కంపెనీ, ఇనుప స్క్రాప్ గోడౌన్ నిర్వహించగా.. ప్రస్తుతం రోడ్డు పక్కన 15 గుంటల విస్తీర్ణంలో హెచ్‌పీ పెట్రోల్ పంప్ నడుపుతున్నారు. దీనికి ఆనుకుని ఉన్న సుమారు 2 ఎకరాల ఖాళీ స్థలం చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించుకున్నారు.

### అర్ధరాత్రి జేసీబీలతో దాడి

ఈ నెల 23న అర్ధరాత్రి దాటిన తర్వాత (సుమారు 3:30 గంటల సమయంలో) పెట్రోల్ బంక్‌లో డ్యూటీలో ఉన్న మహేష్ అనే సిబ్బంది యజమానికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. దాదాపు 10 నుండి 15 మంది గుర్తుతెలియని వ్యక్తులు రెండు జేసీబీ యంత్రాలు, క్రేన్‌తో ల్యాండ్‌లోకి అక్రమంగా చొరబడ్డారు. రక్షణగా ఉన్న కాంపౌండ్ వాల్‌ను పూర్తిగా ధ్వంసం చేసి, స్థలాన్ని ఆక్రమించే ఉద్దేశంతో లోపల ఒక పెద్ద కంటైనర్‌ను తెచ్చి పెట్టారు.సమాచారం అందుకున్న వెంటనే బాధితుడు విజయ్ ఆనంద్ గుప్తా ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా.. సాయి గౌతమ్, హనుమంతరావు అనే వ్యక్తులు తమ అనుచరులతో కలిసి ఈ అక్రమ చొరబాటుకు, కాంపౌండ్ వాల్ కూల్చివేతకు పాల్పడినట్లు విచారణలో తేలింది.


### కేసు నమోదు - దర్యాప్తు

బాధితుడి ఫిర్యాదు మేరకు మోకిలా పోలీసులు స్పందించారు. భారతీయ న్యాయ సంహిత (BNS) సెక్షన్లు 329(3), 24(4) తో పాటు 3(5) కింద కేసు (Cr. No: 315-2026) నమోదు చేసినట్లు మోకిలా ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు.

# ఉద్యమం అంటే కేవలం పోరాటం కాదు... ఆలోచన కూడా!

- నేడే ఉ.సా వర్ధంతి
- ప్రజాకవి ఉప్పు మావులూరి సాంబశివరావు (ఉ.సా.) వర్ధంతి సందర్భంగా లింగంపల్లి దయానంద్ మాటల్లో

**వెలుతురు హైదరాబాద్ ప్రతినిధి జూలై 24:**



సమాజంలో మార్పు అనేది కేవలం నినాదాలతో, ఆవేశాలతో సాధ్యం కాదు. ఆ మార్పుకు బలమైన ఆలోచన, అధ్యయనం, శాస్త్రీయ దృక్పథం, సామాజిక బాధ్యత అవసరం. ఈ సత్యాన్ని తన సాహిత్యంతో, ఉద్యమ ప్రస్థానంతో నిరూపించిన అరుదైన ప్రజామేధావి ప్రజాకవి ఉప్పు మావులూరి సాంబశివరావు (ఉ.సా.)."ఆలోచనకు అక్షరరూపం ఇచ్చినప్పుడు అది సాహిత్యం అవుతుంది. ఆ సాహిత్యం సమాజాన్ని కదిలించినప్పుడు అది ఉద్యమమవుతుంది." అనే భావనకు ప్రతిరూపంగా నిలిచిన ఉ.సా. కవిగా మాత్రమే కాకుండా, సిద్ధాంతకర్తగా, సామాజిక విశ్లేషకుడిగా, ప్రజా చైతన్య రచయితగా ప్రత్యేక గుర్తింపు పొందారు.సాహిత్యం కేవలం భావ వ్యక్తీకరణ మాత్రమే కాదని, అది సమాజాన్ని ప్రశ్నించే శక్తిగా ఉండాలని ఉ.సా. విశ్వసించారు. అణగారిన వర్గాల సమస్యలు, సామాజిక అసమానతలు, వివక్ష, అవకాశాల లోపం వంటి అంశాలను తన రచనల్లో ప్రధానంగా ప్రస్తావించారు. సమస్యలను కేవలం వివరించడం కాకుండా, వాటి మూలాలను విశ్లేషించి పరిష్కార మార్గాలను సూచించారు.ఉ.సా. దృష్టిలో ఉద్యమం అంటే కేవలం నిరసన కార్యక్రమం కాదు. అది ప్రజల ఆలోచనా విధానంలో వచ్చే మార్పు. అధ్యయనం, విశ్లేషణ, సిద్ధాంత స్పష్టతతో కూడిన ఉద్యమాలే సమాజంలో శాశ్వత మార్పును తీసుకురాగలవని ఆయన నమ్మారు.శాస్త్రీయ దృక్పథం, రాజ్యాంగ విలువలు, సామాజిక న్యాయం, సమానత్వం——ఈ సూత్రాలే ఆయన జీవితానికి పునాదులు. మూఢనమ్మకాలు, అశాస్త్రీయ భావనలు, వివక్షాపూరిత ఆలోచనలకు వ్యతిరేకంగా ఆయన తన కలంతో నిరంతరం పోరాడారు."బీసీ మ్యానిఫెస్టో (బీసీలు సగం–బీసీలకు సగం)", "పాదులేనిదే పందిరిలేదు", "కాపుల కార్చిచ్చు", "ఎడతెగని బీసీ రిజర్వేషన్ పంచాయితీ", "దళిత రణనినాదం", "ఆకాశంలేని సగం", "ఎదురీత సంపాదకీయాలు" వంటి రచనలు ఉద్యమ సాహిత్యంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాయి.ఆయన సంపాదకత్వంలో వెలువడిన "ఎదురీత" మాసపత్రిక ప్రత్యామ్నాయ ఆలోచనలకు వేదికగా నిలిచి ప్రజా సమస్యలను చర్చలోకి తీసుకువచ్చింది.నేటి సమాజంలో అసమానతలు, మూఢనమ్మకాలు, విద్వేష భావనలు పెరుగుతున్న నేపథ్యంలో ఉ.సా. ఆలోచనలు మరింత అవసరం. ప్రశ్నించే తత్వం, శాస్త్రీయ దృక్పథం, రాజ్యాంగ స్పృహ కలిగిన సమాజ నిర్మాణమే ఆయన ఆశయం.ఉప్పు మావులూరి సాంబశివరావును స్మరించుకోవడం అంటే ఒక రచయితను గుర్తు చేసుకోవడం మాత్రమే కాదు; సమానత్వం, సామాజిక న్యాయం, శాస్త్రీయ ఆలోచనల కోసం మనల్ని మనం పునరంకితం చేసుకోవడం కూడా.

# వినూత్నంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

- చినపాక రమేష్ 7 వ వార్డ్ మెంబెర్

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూలై 24:**



నీర్నెముల గ్రామంలో కేటీర్ 50వ జన్మదినం వేడుకలు వినూత్నంగా శుభాకాంక్షలు తెలియజేసిన గ్రామానికి చెందిన 7వ వార్డ్ మెంబర్ చినపాక రమేష్. కేటీర్ జన్మదినాన్ని పురస్కరించుకొని చినపాక రమేష్ తన వ్యవసాయ క్షేత్రంలో వరి నాటు వేసే మొక్కలను కే టి ర్ అనే ఆంగ్ల అక్షరాలతో పేర్చి కేటీర్ మీద ఉన్న అభిమానాన్ని శుభాకాంక్షలు తెలిపి చాటుకున్నాడు. రాబోయే కాలంలో కేటీర్ నాయకత్వంలో బి ఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుంది. అని ఈ సందర్భంగా ఆయన ధీమా వ్యక్తం చేసారు.

# ప్రతి నీటి బొట్టు అమూల్యం... నీటి పొదుపు ప్రతి ఒక్కరి బాధ్యత

**మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్**

**జహీరాబాద్ వెలుతురు జూలై 24:**



సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 25వ వార్డు డ్రైవర్స్ కాలనీలో మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ సమీపంలో నీటి సంరక్షణ, నీటి పొదుపుపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్, మున్సిపల్ కమిషనర్ జి. ప్రభాకర్ పాల్గొని ప్రజలకు నీటి ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్ మాట్లాడుతూ, "జలమే జీవనానికి ఆధారం. ప్రకృతి ప్రసాదించిన అమూల్యమైన నీటిని వృథా చేయకుండా సంరక్షించడం ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత. ఈరోజు మనం పొదుపు చేసే ప్రతి నీటి బొట్టు రేపటి తరాలకు జీవనాధారంగా నిలుస్తుంది" అని అన్నారు.ప్రజలు అవసరానికి మించి నీటిని వినియోగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఇళ్లలోని ట్యాపులు, పైపుల ద్వారా లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మతులు చేయించాలని సూచించారు. ప్రతి ఇంటిలో రైన్ వాటర్ హార్వెస్టింగ్ విధానాలను అమలు చేసి భూగర్భ జలాల పరిరక్షణకు సహకరించాలని పిలుపునిచ్చారు.మున్సిపల్ కమిషనర్ ప్రభాకర్ మాట్లాడుతూ, నీటి వృథాను అరికట్టడం ద్వారా భవిష్యత్తులో తాగునీటి సమస్యలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. ప్రతి ఇంటికి నీటిని అందించడం మున్సిపాలిటీ బాధ్యత అయినప్పటికీ, నీటిని సక్రమంగా వినియోగించడం ప్రజల బాధ్యత అని పేర్కొన్నారు. మంజీరా నీరు సరఫరా అయ్యే సమయంలో అవసరమైన మేరకే వినియోగించాలని, ట్యాపులకు క్యాపులు అమర్చి లీకేజీలను నివారించాలని సూచించారు. పిల్లలకు కూడా నీటి విలువను తెలియజేసి నీటి సంరక్షణలో భాగస్వాములను చేయాలని కోరారు.ప్రభుత్వం చేపడుతున్న నీటి పరిరక్షణ కార్యక్రమాలకు ప్రజలందరూ సహకరించాలని, నీటి వనరుల పరిరక్షణ ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడవచ్చని అధికారులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ మహేష్, ఏఈ ఖాజా, మేనేజర్ శ్రీనివాస్, రవి, బస్వంత్ రెడ్డి, 25వ వార్డు కౌన్సిలర్ ఎండీ జాకీర్, వార్డు నాయకులు, మహిళలు, యువత, కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని నీటి పొదుపుపై అవగాహన పెంపొందించుకున్నారు.

# సైబర్ నిఘాను మరింత బలోపేతం చేయాలి

**తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశాలు**

**హైదరాబాద్:**




రాష్ట్రంలో వేగంగా పెరుగుతున్న సైబర్ నేరాలను సమర్థవంతంగా అరికట్టడానికి సాంకేతిక ఆధారిత పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలని, జాతీయ సైబర్ సెక్యూరిటీ ర్యాంకింగ్స్‌లో తెలంగాణ పనితీరును మెరుగుపరచాలని రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) సీవీ ఆనంద్ ఆదేశించారు.

శుక్రవారం సైబర్ సెక్యూరిటీ కార్యక్రమాలు, ఈ–జీరో ఎఫ్ఐఆర్ అమలు, సీసీటీఎన్ఎస్ పురోగతిపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమీక్షా సమావేశంలో డీజీపీ మాట్లాడారు. కేంద్ర హోంశాఖ పరిధిలోని 'ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్' పర్యవేక్షిస్తున్న 9 కీలక సూచికలలో అన్ని పోలీస్ యూనిట్లు మెరుగైన ప్రదర్శన కనబరచాలని సూచించారు. ముఖ్యంగా దేశవ్యాప్తంగా విపరీతంగా పెరుగుతున్న 'డిజిటల్ అరెస్ట్' మోసాలపై కేంద్ర ప్రభుత్వం, ప్రధాని కార్యాలయం ఆందోళన వ్యక్తం చేసిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు.

ఈ నేరాలను అరికట్టేందుకు ఈ–జీరో ఎఫ్ఐఆర్‌ల సమర్థవంతమైన అమలు, ప్రజల్లో సైబర్ అవగాహన పెంపొందించడం, అధికారులకు నైపుణ్య శిక్షణ ఇవ్వడం మరియు సైబర్ నేరాల దర్యాప్తులో సీసీటీఎన్ఎస్ విధానాన్ని విస్తృతంగా ఉపయోగించాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయెల్‌తో పాటు టి–స్పార్క్ ఎస్పీ రూపేష్, సైబర్ సెక్యూరిటీ ఎస్పీ సాయిశ్రీ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఈసీఐఎల్‌లో కిసాన్ ఫ్యాషన్ మాల్‌ను ప్రారంభించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు



ఈసీఐఎల్ వెలుతురు జూలై 24:

ఈసీఐఎల్ క్రాస్ రోడ్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కిసాన్ ఫ్యాషన్ మాల్ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారు, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు గారు, నిజామాబాద్ ఎమ్మెల్యే దన్పాల్ సూర్యనారాయణ సంయుక్తంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా మాల్‌ను సందర్శించి వివిధ విభాగాలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, ఈసీఐఎల్ ప్రాంతంలో ఆధునిక వసతులతో కూడిన ఫ్యాషన్ మాల్ ప్రారంభం కావడం స్థానిక ప్రజలకు ఎంతో ఉపయోగకరమని అన్నారు. ఒకే చోట కుటుంబ సభ్యులందరికీ నాణ్యమైన దుస్తులు అందుబాటు ధరల్లో లభించేలా ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు.బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు మాట్లాడుతూ, హైదరాబాద్ తూర్పు ప్రాంత అభివృద్ధిలో ఇటువంటి వాణిజ్య సంస్థలు కీలక పాత్ర పోషిస్తాయని, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో BRS పార్టీ రాష్ట్ర నాయకులు సోమ శేఖర్ రెడ్డి, మహేష్ గౌడ్ కిసాన్ ఫ్యాషన్ మాల్ యాజమాన్యం, స్థానిక నాయకులు, వ్యాపారవేత్తలు, అభిమానులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# నాగోల్‌లో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ధర్నా – విద్యార్థులపై లాఠీచార్జ్‌ను ఖండించిన విద్యార్థి సంఘాలు

**రంగారెడ్డి జిల్లా వెలుతురు జూలై 24:**




రంగారెడ్డి జిల్లా నాగోల్‌లో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా ఎన్ఎస్‌యూఐ నాయకుడు జయరాం యాదవ్ మాట్లాడుతూ, ఢిల్లీలో ఆందోళన చేస్తున్న విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌ను తీవ్రంగా ఖండించారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై ఎలాంటి కనికరం లేకుండా లాఠీచార్జ్ చేయడం, వారిపై కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు.పేపర్ లీకేజ్ వ్యవహారంలో అసలు బాధ్యులపై చర్యలు తీసుకోకుండా విద్యార్థులపైనే కేసులు నమోదు చేయడాన్ని నిరసిస్తూ ఆందోళన వ్యక్తం చేశారు. పేపర్ లీకేజ్ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల హక్కులు, స్వేచ్ఛలను పరిరక్షించాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆందోళనకారులు జైరాం రమేష్ రాజీనామా చేయాలని నినాదాలు చేశారు.ఈ ధర్నా కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఎన్ఎస్‌యూఐ నాయకుడు జయరాం యాదవ్‌తో పాటు హేమంత్, భవాని, సిద్ధు, మధు, మల్లేష్, రాఖి, ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వంపై బీజేపీ ఎంపీలు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు భీమ లక్ష్మణ్ ముదిరాజ్

**హైదరాబాద్ వెలుతురు జూలై 24:**

ఢిల్లీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెలంగాణ బీజేపీ ఎంపీలు రాష్ట్ర ప్రభుత్వం, గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారిపై చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు భీమ లక్ష్మణ్ ముదిరాజ్ తీవ్రంగా ఖండించారు.తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులు, అభివృద్ధి కార్యక్రమాలు, రాష్ట్ర హక్కుల సాధన వంటి కీలక అంశాలపై పోరాడాల్సిన బీజేపీ ఎంపీలు వాటిని పక్కనబెట్టి రాష్ట్ర ప్రభుత్వంపై నిరాధార విమర్శలు చేయడం బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.ప్రజలకు ఆరు గ్యారంటీలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తూ ప్రజల విశ్వాసాన్ని పొందుతున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రాజకీయ స్వార్థంతో లక్ష్యంగా చేసుకుని విమర్శించడం సమంజసం కాదని అన్నారు.తెలంగాణ ప్రజల ప్రయోజనాల కోసం నిర్మాణాత్మకంగా వ్యవహరించకుండా రాజకీయ విమర్శలకే పరిమితమైతే ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో తగిన తీర్పు ఇస్తారని



హెచ్చరించారు.అలాగే, భవిష్యత్తులో రాష్ట్ర ప్రభుత్వం, గౌరవ ముఖ్యమంత్రి గారిపై వ్యక్తిగత దూషణలు, అనుచిత వ్యాఖ్యలు చేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలంగాణ బీజేపీ నాయకులకు భీమ లక్ష్మణ్ ముదిరాజ్ సూచించారు.

# దళితులకు 15% రాజకీయ రిజర్వేషన్లు అమలు చేయాలని జగిత్యాల జిల్లా కలెక్టర్‌కు బీజేపీ ఎస్సీ మోర్చా వినతి

**జగిత్యాల వెలుతురు జూలై 24:**



భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ క్రాంతి కిరణ్ గారి సూచన మేరకు, తెలంగాణ రాష్ట్రంలో రాబోయే ఎన్నికల్లో దళితులకు 15 శాతం రాజకీయ రిజర్వేషన్లు అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయాల్సిందిగా కోరుతూ, భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా కలెక్టర్ గారికి వినతి పత్రం సమర్పించినట్లు జిల్లా అధ్యక్షులు నారపాక అశోక్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారత రాజ్యాంగం సామాజిక న్యాయం, సమానత్వం మరియు బలహీన వర్గాల సాధికారతను ప్రధాన లక్ష్యాలుగా నిర్దేశించిందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని దళిత జనాభాకు అనుగుణంగా రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడం రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణమైన చర్య అని అన్నారు.దళితులకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం లభించడం ద్వారా వారి సమస్యలు శాసనసభలు, స్థానిక సంస్థలు మరియు ఇతర ప్రజాప్రతినిధుల వేదికల ద్వారా సమర్థవంతంగా ప్రభుత్వ దృష్టికి చేరే అవకాశం ఉంటుందని తెలిపారు. సామాజిక న్యాయం బలోపేతానికి, ప్రజాస్వామ్యంలో అన్ని వర్గాలకు సముచిత భాగస్వామ్యం కల్పించేందుకు దళితులకు 15 శాతం రాజకీయ రిజర్వేషన్లు అమలు చేయడం అవసరమని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుని, రాబోయే ఎన్నికల్లో దళితులకు 15 శాతం రాజకీయ రిజర్వేషన్లు అమలు చేసే దిశగా నిర్ణయం తీసుకోవాలని, అలాగే ఈ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేలా జగిత్యాల జిల్లా కలెక్టర్ గారు తమ వంతు సిఫార్సు చేయాలని వినతి పత్రం ద్వారా కోరినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా జగిత్యాల జిల్లా నాయకులు, మండల అధ్యక్షులు, జిల్లా పదాధికారులు, కొత్తూరి బాబు, బన్న సంజీవ్, తడగొండ అంజయ్య, దుర్గం రమేష్, కొత్తూరి అంజయ్య, దేవి సంతోష్, ఉయ్యాలా స్వామి, సట్ట రవి రాజు, కొదురుపాక అశోక్, కె లక్ష్మణ్, గిరిమళ్ళ రఘు, మంత్రి నాగరాజు జిత్తవేణి శివకుమార్ తదితర పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# పెద్ద అంబర్‌పేట్ ఇసుక లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయం ఘనంగా ప్రారంభం




**పెద్ద అంబర్‌పేట్ వెలుతురు జూలై 24:**

పెద్ద అంబర్‌పేట్ ఇసుక లారీ ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యాలయాన్ని ఈ రోజు ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, లారీ యజమానులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు పోలగోని భాస్కర్ గౌడ్ మాట్లాడుతూ, లారీ యజమానుల సమస్యల పరిష్కారం, వారి సంక్షేమం, హక్కుల పరిరక్షణ మరియు ఐక్యత కోసం అసోసియేషన్ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని తెలిపారు.కార్యాలయం ప్రారంభం సందర్భంగా సభ్యులు ఒకరినొకరు అభినందించుకుని, భవిష్యత్తులో అసోసియేషన్ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమం అనంతరం పాల్గొన్న వారందరికీ మిఠాయిలు పంపిణీ చేసి ఆనందోత్సాహాల మధ్య వేడుకలను ముగించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రవీందర్, ఉపాధ్యక్షులు బలరాం, పెదగోని నర్సింహ, అసోసియేషన్ సభ్యులు మునుకుంట్ల శ్రీను, వర్ధం లింగస్వామి, జలందర్, ముక్కెర్ల లింగస్వామి, ప్రవీణ్, స్వామి, కుమార్, నర్సింహ, శేఖర్, శ్రీశైలం, అశోక్, ఆవుల శేఖర్, శ్రీకాంత్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# హ్యాండ్లూమ్ ఏడి ని కలిసిన మునుగోడు చేనేత సహకార సంఘం పాలకవర్గం





**మునుగోడు వెలుతురు జూలై 24:**

ఇటీవల జరిగిన ఎలక్షన్ లో నూతనంగా ఎన్నికైన మునుగోడు చేనేత సహకార సంఘం పాలకవర్గం శుక్రవారం అధ్యక్షుడు అవ్వారి భాస్కర్ ఆధ్వర్యంలో  చేనేత శాఖ ఏడి గోవిందయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు  ఈ సందర్భంగా ఏడి గోవిందయ్య మాట్లాడుతూ నిరంతరం కార్మికులు అందుబాటులో ఉంటూ వారి అవసరాలు తీర్చాలని తదానుగుణంగా  మీ దృష్టికి వచ్చినా మరియు  ఎదురయ్యే సమస్యల తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో మునుగోడు చేనేత సహకార సంఘం అధ్యక్షులు అవ్వారి భాస్కర్ , ఉపాధ్యక్షులు మిరియాల సుభద్ర, కార్యదర్శి రావిరాల కుమార్ కోశాధికారి గంజి నరేందర్ డైరెక్టర్లు కర్నాటి రాజు, బొల్ల చంద్రకళ,చెరిపెల్లి యాదగిరి మిరియాల మధుకర్ , చిలుకూరి మధు, మాజీ అధ్యక్షులు సంగిశెట్టి పరమేష్, మాజీ కుల సంఘం అధ్యక్షులు గంజి బిక్షం తదితరులు పాల్గొన్నారు.

# రెండు నెలల్లో మోత్కూరు రాజన్నగూడెం రహదారి పనులు పూర్తి కావాలి. ప్రజలకు అందుబాటులోకి తేవాలి

- **నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం చేస్తే ఎవర్నీ ఉపేక్షించేది లేదు**
- **మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి**
- **కాంట్రాక్టర్,సంబంధిత అధికారులను హెచ్చరించిన మంత్రి**
- **మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలో నిలిచిపోయిన రాజన్నగూడెం రహదారి నిర్మాణ పనులను ఆకస్మికంగా పరిశీలించిన మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి**

**వెలుతురు యాదాద్రి భువనగిరి జిల్లా జూలై 24::**



మరో రెండు నెలల్లో మోత్కూరు రాజన్నగూడెం అసంపూర్తిగా ఉన్న రహదారి పనులన్నీ పూర్తి కావాలని, లేకపోతే ఉపేక్షించేది లేదని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను, కాంట్రాక్టర్లను హెచ్చరించారు.శుక్రవారం మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలో నిలిచిపోయిన రాజన్నగూడెం రహదారి నిర్మాణ పనులను ఆలేరు ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యతో కలిసి ఆయన క్షేత్ర స్థాయిలో ఆకస్మిక పరిశీలన చేశారు.

**ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...**

అసంపూర్తిగా ఉన్న రహదారి కారణంగా వరుసగా ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇప్పటికే జరిగిన ప్రమాదాల్లో పలువురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకపై పనుల్లో ఎలాంటి జాప్యానికి అవకాశం ఇవ్వకుండా వచ్చే రెండు నెలల్లో అన్ని పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. ప్రస్తుతం వర్షాలు లేకపోవడంతో నిర్మాణ పనులను వేగవంతం చేయడానికి ఇదే అనుకూల సమయమని పేర్కొన్నారు. రోలింగ్ పనులను వెంటనే పూర్తి చేసి, బీటీ రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభించాలని సూచించారు. ప్రతిరోజూ రహదారి పనులను పర్యవేక్షిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేసే బాధ్యత అధికారులదేనని స్పష్టం చేశారు. పనులు పూర్తయిన వెంటనే కాంట్రాక్టర్ల బిల్లులు విడుదలయ్యేలా తాను స్వయంగా బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. మోత్కూరు సెంటర్ నుంచి అమ్మనబోలు వైపు వెళ్లే రహదారి విస్తరణ పనులను కు వెంటనే అంచనాలను సిద్ధం చేయమని అధికారులను ఆదేశించారు.మంత్రి వెంట జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి,ఆర్ అండ్ బి ఎస్.ఈ రాంబాబు, డి.ఈ సురేందర్ పలువురు స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# ట్రిపుల్ ఆర్ లో భూములు కోల్పోతున్న రైతులతో కలెక్టరేట్‌లో నిర్వహించిన ఆర్బిట్రేషన్ కార్యక్రమంలో పాల్గొన్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

**వెలుతురు యాదాద్రి భువనగిరి జిల్లా జూలై 24:**

ట్రిపుల్ ఆర్ లో భూములు కోల్పోతున్న రైతులతో కలెక్టరేట్‌లో నిర్వహించిన ఆర్బిట్రేషన్ కార్యక్రమంలో పాల్గొన్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి,తనకు మంత్రి పదవి ఇవ్వొద్దన్న తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ వ్యాఖ్యలపై ఆగ్రహం ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ మందుల సామేల్‌కు టికెట్ ఇప్పించింది నేను. టికెట్ కోసం ఆయన నా ఇంటికి వందసార్లు వచ్చారు. ఇప్పుడు నాపై వ్యాఖ్యలు చేశారు. ఆయన విజ్ఞతకే వదిలేస్తున్న నా ఎమ్మెల్యే టికెట్‌తో పాటు తుంగతుర్తి, బాన్సువాడ టికెట్లను వరుసగా మందుల సామేల్, ఏనుగు రవీందర్‌లకు కాంగ్రెస్ అధిష్ఠానాన్ని ఒప్పించి ఇప్పించుకున్నా.తుంగతుర్తి ఎమ్మెల్యేగా తప్పుడు వ్యక్తిని సూచించినందుకు ఆ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నన్ను క్షమించాలి. ఆయన వ్యాఖ్యలపై కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, నా అభిమానులు ఎవరూ స్పందించవద్దు.పార్లమెంట్ ఎంపీగా, ఎమ్మెల్సీగా, తెలంగాణ కోసం పోరాడిన వ్యక్తిగా, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పని చేశాను.

నా సేవలను గుర్తించి, నేను పార్టీ మారినా ఉమ్మడి జిల్లాలో చేసిన సేవలను పరిగణనలోకి తీసుకుని అధిష్ఠానం నన్ను తిరిగి పార్టీలో చేర్చుకుంది.



2009 ఎన్నికల సమయంలో ఇక్కడ కాంగ్రెస్ పార్టీ కొంత బలహీనంగా ఉంది.

నేను వచ్చిన తర్వాత పార్టీ బలోపేతం అయింది.

మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీలో పని చేసిన కార్యకర్తలకు అన్యాయం జరగకూడదు.

కొత్తగా పార్టీలోకి వచ్చిన వారి వల్ల పాత కార్యకర్తలకు ఇబ్బంది కలిగితే ఊరుకునేది లేదు.

అసలైన కార్యకర్తల కోసం ఎంత దూరమైనా వెళ్తాం. వారిని కాపాడుకోవాల్సిన బాధ్యత పార్టీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ కార్యదర్శి మీనాక్షి నటరాజన్ తో పాటు మా లాంటి నాయకుల పై ఉంది.

"వినాశకాలే విపరీత బుద్ధి" అంటూ సంచలన వ్యాఖ్యలు

# అక్షరాలకు ఆసరా: మునుగోడు విద్యార్థుల భవిష్యత్తుకు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గారి 'ప్రతిభా పురస్కారాల' భరోసా!

- **ఈద శేఖర్**

**నాంపల్లి వెలుతురు జూలై 24:**

పేదరికం చదువుకు అడ్డంకి కాకూడదని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో దాగి ఉన్న అద్భుతమైన ప్రతిభకు సరైన గుర్తింపు దక్కాలని నమ్మే నిజమైన ప్రజానేత మునుగోడు ఎమ్మెల్యే శ్రీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గారు. 2025-2026 విద్యా సంవత్సరంలో మునుగోడు నియోజకవర్గవ్యాప్తంగా పదవ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం ఆయన ప్రకటించిన నగదు బహుమతుల కార్యక్రమం ఆయన విద్యాభిమానానికి, సేవాతత్పరతకు నిలువెత్తు నిదర్శనం.

**సొంత నిధులతో అక్షర యజ్ఞం**

రాజకీయాలు అంటే కేవలం పదవులు, నినాదాలు మాత్రమే కాదు... సమాజ శ్రేయస్సు కోసం, రేపటి తరం భవిష్యత్తు కోసం నిలబడటమే అని రాజగోపాల్ రెడ్డి గారు మరోసారి నిరూపించారు. "కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్" ఆధ్వర్యంలో, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఆయన తన సొంత నిధుల నుండి రూ. 32,20,000 (32 లక్షల 20 వేల రూపాయలు) నగదు ప్రోత్సాహకాలను అందించడం సామాన్యమైన విషయం కాదు. నియోజకవర్గంలోని 63 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 192 మంది ప్రతిభావంతులైన విద్యార్థిని విద్యార్థులకు ఈ భారీ నగదు బహుమతులను అందజేస్తూ వారి కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నారు.

**ప్రతిభకు అండగా నగదు ప్రోత్సాహకాలు**

విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంచేలా, వారి కష్టానికి తగిన ప్రతిఫలాన్ని అందిస్తూ ఈ పురస్కారాలను మూడు విభాగాలుగా విభజించి అందిస్తున్నారు:

ప్రథమ స్థానం: సాధించిన విజేతలకు రూ. 25,000/- నగదు ప్రోత్సాహకం.

ద్వితీయ స్థానం: సాధించిన వారికి రూ. 15,000/- నగదు ప్రోత్సాహకం.

తృతీయ స్థానం: సాధించిన వారికి రూ. 10,000/- నగదు ప్రోత్సాహకం.

ఈ నగదు పురస్కారాలు కేవలం బహుమతులు మాత్రమే కావు; ఉన్నత చదువులు చదవాలనుకునే పేద విద్యార్థులకు ఇవి ఒక గొప్ప ఆర్థిక కొండంత అండ.

**మునుగోడు గడ్డపై విద్యా విప్లవం**

మునుగోడు నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తూ, ప్రజల గుండెల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న రాజగోపాల్ రెడ్డి గారు, విద్యారంగానికి ఇస్తున్న ప్రాధాన్యత ప్రశంసనీయం. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపడానికి, "మేము సైతం ప్రైవేట్ పాఠశాలల పిల్లలతో పోటీపడగలం" అనే ధీమాను వారిలో కల్పించడానికి ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుంది. ఈ రోజు మే 26, 2026 (మంగళవారం) సాయంత్రం 5:00 గంటలకు మునుగోడులోని క్యాంప్ కార్యాలయంలో జరగనున్న ఈ పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమం మునుగోడు విద్యా చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోతుంది.

ఒక నాయకుడు రాబోయే ఎన్నికల గురించి ఆలోచిస్తే... ఒక గొప్ప నాయకుడు రాబోయే తరం భవిష్యత్తు గురించి ఆలోచిస్తాడు. మునుగోడు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతూ, వారి అక్షర సాధనకు తన సొంత సంపాదనను సార్థకం చేస్తున్న శ్రీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గారు నిజమైన 'ప్రజా నాయకుడు'. విద్యార్థులపై ఆయన చూపిస్తున్న ఈ మమకారం, అందిస్తున్న ఈ ప్రోత్సాహం మరెంతో మంది ప్రజాప్రతినిధులకు ఆదర్శప్రాయం. ఈ మహత్కార్యాన్ని తలపెట్టిన రాజగోపాల్ రెడ్డి గారికి మునుగోడు ప్రజల తరపున, విద్యార్థి లోకం తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు మరియు అభినందనలు!



# దేశ పరిరక్షణకు కాంగ్రెస్‌తో కలిసి సీపీఐ పోరాటం: ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

**వరంగల్, వెలుతురు జూలై 24:**

దేశాన్ని, ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవడానికి కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (సీపీఐ) కాంగ్రెస్ పార్టీతో కలిసి నిరంతరం పోరాడుతుందని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావులతో కలిసి వరంగల్ నగరం మార్కండేయ నగర్‌లో నూతనంగా నిర్మించిన సీపీఐ కార్యాలయం 'ఏ.బి. బర్దన్ భవన్'ను శుక్రవారం ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. దేశాన్ని మతోన్మాద శక్తుల నుంచి, కార్పొరేట్ అనుకూల కేంద్ర ప్రభుత్వం నుంచి కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నీట్ ప్రశ్నపత్రాల లీకేజీ, కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలపై దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువత చేస్తున్న నిరసనలు ప్రధాని నరేంద్ర మోదీ పాలనపై ప్రజల్లో ఉన్న తీవ్ర అసంతృప్తికి నిదర్శనమని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్, వామపక్షాలు సంయుక్తంగా తమ పోరాటాన్ని కొనసాగిస్తాయని స్పష్టం చేశారు.

రాష్ట్ర అంశాలపై స్పందిస్తూ.. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తెలంగాణ ప్రభుత్వం తక్షణమే నెరవేర్చాలని, పేదల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని కూనంనేని కోరారు. ప్రభుత్వ స్థలాల్లో నివాసముంటున్న పేద కుటుంబాలకు భూమి యాజమాన్య హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇదే సమయంలో పెద్ద ఎత్తున ప్రభుత్వ భూములను ఆక్రమించిన బడా బాబులను వదిలేసి, పేదల గుడిసెలను కూల్చివేయడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. గుడిసెల కూల్చివేతలను వెంటనే నిలిపివేసి, అర్హులైన పేదలకు గృహ స్థలాల పట్టాలు ఇచ్చి క్రమబద్ధీకరించాలని ప్రభుత్వాన్ని కోరారు.

పేదల ఇళ్ల కూల్చివేతలను అడ్డుకుంటాం: ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

ఈ కార్యక్రమంలో పాల్గొన్న వర్ధన్నపేట ఎమ్మెల్యే, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి కే.ఆర్. నాగరాజు మాట్లాడుతూ.. పేదల ఇళ్ల కూల్చివేతలను అడ్డుకోవడానికి తన వంతు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ స్థలాల్లో నివసిస్తున్న అర్హులైన పేద కుటుంబాలకు ఇళ్ల స్థలాల పట్టాలతో పాటు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యేలా చూస్తానని భరోసా ఇచ్చారు. కమ్యూనిస్టు పార్టీలు బలంగా ఉన్నప్పుడే ప్రజాస్వామ్యం మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్న నాగరాజు, ప్రజా సమస్యల పరిష్కారం, బలహీన వర్గాల సంక్షేమం కోసం కాంగ్రెస్, సీపీఐ కలిసి పనిచేస్తాయని స్పష్టం చేశారు.



## "దేశ యువత కోసం పోరాడుతున్న రాహుల్ గాంధీని నిరంకుశంగా అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్యంపై దాడే" — మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

- **152కు పైగా ప్రశ్నాపత్రాల లీకేజీలు... ప్రశ్నించిన రాహుల్ గాంధీ అరెస్ట్ – ఇదేనా మోదీ ప్రభుత్వ న్యాయం?**
- **యువత భవిష్యత్తు కోసం రాహుల్ గాంధీ పోరాటం – 2029లో దేశం కాంగ్రెస్ వైపే**
- **ప్రశ్నాపత్రాల లీకేజీలపై కేంద్ర ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలి.**
- **దేశ యువతే తన కుటుంబమని భావించి విద్యార్థుల పక్షాన నిలిచిన రాహుల్ గాంధీని గాయపరచడం హేయమైన చర్య.**
- **ప్రశ్నాపత్రాల లీకేజీలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలి**
- **మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**

**యాదాద్రి భువనగిరి వెలుతురు జూలై 24:**

దేశంలో వరుసగా జరుగుతున్న ప్రశ్నాపత్రాల లీకేజీలకు కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలపై పోరాడుతూ, వారి భవిష్యత్తు కోసం ప్రశ్నిస్తున్న లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ గారిని అరెస్ట్ చేయడం అత్యంత హేయమైన, అప్రజాస్వామిక చర్య అని తీవ్రంగా ఖండించారు.లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న అత్యంత సున్నితమైన అంశంలో కేంద్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. దేశవ్యాప్తంగా పలు పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాలు లీక్ కావడం వల్ల ప్రతిభ కలిగిన లక్షలాది మంది విద్యార్థులు నష్టపోతుండగా, ఎంతోమంది తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ భవిష్యత్తు కోసం విద్యార్థులు శాంతియుతంగా ఆందోళన చేస్తుంటే వారిపై లాఠీచార్జ్‌కు పాల్పడడం అమానుషమైన, ప్రజాస్వామ్య విరుద్ధమైన చర్య అని మండిపడ్డారు.గత 12 ఏళ్లలో దేశవ్యాప్తంగా 152కు పైగా వివిధ నియామక, ప్రవేశ పరీక్షల ప్రశ్నాపత్రాలు లీక్ కావడం కేంద్ర ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని విమర్శించారు. యువత భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న ప్రభుత్వాన్ని దేశ యువత క్షమించదని హెచ్చరించారు. దేశంలో 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు గల యువతే దాదాపు 40 శాతం ఓటర్లుగా ఉన్నారని, వారు కోరుకుంటే ప్రభుత్వాలను మార్చగల శక్తి ఉందని పేర్కొన్నారు.ప్రశ్నాపత్రాల లీకేజీలకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహిస్తూ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని మంత్రి డిమాండ్ చేశారు. ప్రధాని ఇంటి ముట్టడిని సమర్థిస్తున్నామని,నిరసన తెలిపిన రాహుల్ గాంధీపై దాడి చేసి,గాయపరిచి అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తిని అవమానపరచడమేనని పేర్కొన్నారు. దేశ యువతే తన కుటుంబంగా భావించి, భారత్ జోడో యాత్ర ద్వారా దేశ ప్రజలతో మమేకమైన రాహుల్ గాంధీ గారు విద్యార్థుల తరపున ప్రశ్నిస్తుంటే ఆయనపై బలప్రయోగానికి పాల్పడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.విద్యార్థుల భవిష్యత్తును కాపాడాల్సిన ప్రభుత్వాలే వారిపై నిర్బంధ చర్యలకు దిగడం ఆందోళన కలిగించే విషయమన్నారు. ప్రశ్నాపత్రాల లీకేజీలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు విద్యార్థులకు న్యాయం జరిగేలా కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.రాహుల్ గాంధీ గారిని అరెస్ట్ చేసినా, దాడులకు పాల్పడినా ఆయన వెనక్కి తగ్గబోరని, ప్రజా సమస్యలపై ఆయన పోరాటం మరింత బలంగా కొనసాగుతుందని అన్నారు. ప్రియాంక గాంధీతో పాటు ప్రతిపక్ష పార్టీలు ప్రజల గొంతుకగా పార్లమెంట్‌లోనూ, ప్రజాక్షేత్రంలోనూ పోరాటాన్ని ఉధృతం చేస్తాయని పేర్కొన్నారు.



**ఓటు హక్కును కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత**

ఓటు హక్కును పరిరక్షించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ఓటు హక్కుకు అర్హులైన ఒక్కరి పేరు కూడా ఓటరు జాబితా నుంచి మిస్ కాకుండా చూడాల్సిన బాధ్యత అధికార పార్టీగా కాంగ్రెస్ ప్రభుత్వంపై, పార్టీ శ్రేణులపై ఉందని స్పష్టం చేశారు.ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, బీఎల్ఏలు,BLO లకు క్షేత్రస్థాయిలో ఫారాలు నింపించడం, ప్రజలకు అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలను అభినందించారు. ఎన్నికల సమయంలో ఎలా జట్టుకట్టి పనిచేస్తారో అదే స్ఫూర్తితో ఈ కార్యక్రమాన్ని కూడా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గంలో ఇప్పటికే 98.5 శాతం ఎన్యూమరేషన్ పూర్తవడం సంతోషకరమని, త్వరలోనే అది 99 శాతానికి చేరుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. భువనగిరి నియోజకవర్గంలో 93 శాతం, నల్గొండలో 85 శాతం మేర ఓటరు నమోదు ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. నల్గొండ వంటి పట్టణ ప్రాంతాల్లో బయట ప్రాంతాల్లో నివసించే వారి సంఖ్య ఎక్కువగా ఉన్నప్పటికీ, బీఎల్ఏలు, బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను నింపడంలో విశేష కృషి చేస్తున్నారని కొనియాడారు.రాష్ట్ర ప్రభుత్వ తరపున బీఎల్ఓలందరికీ ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నానని పేర్కొన్నారు. ఓటు అనేది ప్రతి పౌరుడికి ప్రభుత్వం, ప్రజాప్రతినిధులను ప్రశ్నించే హక్కును కల్పించే అత్యంత విలువైన ప్రజాస్వామ్య ఆయుధమని అన్నారు. ఓటు హక్కు ఉంటేనే వ్యక్తికి గౌరవంతో పాటు తన అభిప్రాయాన్ని నిర్భయంగా వ్యక్తం చేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.ఇంకా వారం రోజుల సమయం ఉన్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, బీఎల్ఏలు మరింత కృషి చేసి అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏ ఒక్క అర్హుడి ఓటు కూడా నమోదు కాకుండా మిగిలిపోకూడదని అన్నారు. బయట ప్రాంతాల్లో ఉన్న ఓటర్లకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు.ఓటు హక్కు లేని ప్రజలకు ప్రజాప్రతినిధులను ప్రశ్నించే హక్కు ఉండదని, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే శక్తి ఓటు హక్కుకే ఉందన్నారు. ఎన్నికలు తర్వాతి విషయం అయినప్పటికీ, ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించడమే ప్రస్తుతం మన ముందున్న ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు.2029లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని, రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అవుతారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో స్వల్ప మెజార్టీతో అవకాశాన్ని కోల్పోయామని, ఈసారి దేశ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు.మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్, సోనియా గాంధీ దూరదృష్టితో తీసుకొచ్చిన ఉపాధి హామీ చట్టం వంటి పేదల సంక్షేమ చట్టాలను బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పేదలు, భూమిలేని కూలీలకు ఉపాధి హామీ పథకం ఎంతో అండగా నిలుస్తోందన్నారు.తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అత్యధిక ఓటరు నమోదు శాతాన్ని సాధించి నెంబర్ వన్‌గా నిలవాలని, అదే స్ఫూర్తితో రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అత్యధిక మద్దతు అందించి రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావడంలో కీలక పాత్ర పోషించాలని రాష్ట్ర ప్రజలకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పిలుపునిచ్చారు.






Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com